# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 11 | ఆగస్టు 2024 | వెల : రూ.15

మాటల్లో సహకారం.. చేతల్లో ప్రతీకారం

నిజమైన సమస్యలను ఎదుర్కొనే ధైర్యం లేని కేంద్ర బడ్జెట్ 2024-25

వికసించని మన పారిశ్రామిక భారతం!

మొట్ట మొదటి కేంద్ర బడ్జెట్ ఎంతో తెలుసా ?

తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు

చరిత్ర కాల నిర్ణయం

ప్రజాస్వామ్య బహుళత్వం వ్యవస్థ - ప్రత్యామ్నాయ రాజకీయం

ఆగస్టు 9 క్విట్ కార్పొరేట్స్ డే

రాజ్యాంగానికి పీఠిక ఒక ఆత్మ

'నియంత అంతం' వర్తమానంతో సరిపోలిన ఊహా చిత్రం

పారిస్ కమ్యూన్ ఒక సామాజిక విప్లవ ఉషోదయం!

ఫ్రెంచి వామపక్ష కూటమి ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమం!

మార్క్స్ జన్మస్థలం ట్రైయర్ కళా సంపదకు నిలయం

నేను కమ్యూనిస్టును ఎలా అయ్యాను ? : నాజర్

బుర్ర కథా లోకంలో లేజర్-నాజర్

ఆగస్టు - 2024 పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 11

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) మాటల్లో సహకారం..
చేతల్లో ప్రతీకారం : సంపాదకీయం 3

2) నిజమైన సమస్యలను ఎదుర్కొనే
ధైర్యం లేని కేంద్ర బడ్జెట్ 2024-25
– ప్రభాత్ పట్నాయక్ 4

3) వికసించని మన పారిశ్రామిక భారతం!
-రాహుల్ కుమార్ 8

4) మొట్ట మొదటి కేంద్ర బడ్జెట్
ఎంతో తెలుసా ?
- బీఎస్ఎన్ మల్లేశ్వరరావు 10

5) తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు
– ఎం.కోటేశ్వరరావు 12

6) చరిత్ర కాల నిర్ణయం
– ఆర్.పి.బహుగుణ 14

7) ప్రజాస్వామ్య బహుళత్వం వ్యవస్థ - ప్రత్యామ్నాయ రాజకీయం
– మందలపర్తి కిశోర్ 20

8) ఆగస్టు 9 క్విట్ కార్పొరేట్స్ డే – వడ్డే శోభనాద్రీశ్వరరావు 24

9) రాజ్యాంగానికి పీఠిక ఒక ఆత్మ – మాడభూషి శ్రీధర్ 25

10) 'నియంత అంతం' వర్తమానంతో సరిపోలిన ఊహా చిత్రం
– కె.శ్రీనివాస్ 28

11) పారిస్ కమ్యూన్ ఒక సామాజిక విప్లవ ఉషోదయం! – వివిజయకుమార్ 31

12) ఫ్రెంచి వామపక్ష కూటమి ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమం!
– ప్రభాత్ పట్నాయక్ 33

13) మార్క్స్ జన్మస్థలం ట్రైయర్ కళా సంపదకు నిలయం
–బుడ్డిగ జమిందార్ 35

14) నేను కమ్యూనిస్టును ఎలా అయ్యాను ? – నాజర్ 36

15) బుర్రకథా లోకంలో లేజర్-నాజర్ – ఖాదర్ మొహిద్దీన్ 39

15) కార్టూన్స్ 43 16) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

## దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# మాటల్లో సహకారం.. చేతల్లో ప్రతీకారం

మోదీ పదే పదే ప్రస్తావించే మాట సహకార ఫెడరలిజం. 2014 నుంచి ఇదే పాట అవకాశం వచ్చినప్పుడల్లా వినిపిస్తారు. ఈ జూలై 27న నీతి అయోగ్ సమావేశం జరిగింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరాలంటే కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సరిగ్గా నాలుగు రోజుల ముందు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తన ప్రభుత్వం మనుగడకు ఆధారంగా వున్న బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు మాత్రం కేటాయింపులో కొంత సహాయం ప్రకటించారు. మిగిలిన ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలను పూర్తిగా విస్మరించారు. ఇది నిన్న గాక మొన్న జరిగింది. మోదీ సహకార సమాఖ్యకు ఇది తాజా మచ్చుతునక. ఈ కారణంగానే తొమ్మిది ప్రతిపక్ష పార్టీల రాష్ట్ర ముఖ్యమంత్రులు నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరించాయి. సమావేశానికి హాజరైన మమతా బెనర్జి పశ్చిమ బెంగాల్‌కు న్యాయం చేయమని కోరుతూ ప్రసంగిస్తుండగా మైక్ కత్తిరించి అవమానించారు. ఆమె నీతి అయోగ్ భేటీ నుంచి వాకౌట్ చేయాల్సి వచ్చింది. గత పదేళ్లుగా మోదీ మాటల్లో సహకార సమాఖ్య ప్రస్తావనలు చేస్తూనే వున్నారు. కాని, ఆచరణలో రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా కబ్జా చేస్తూ వచ్చారు.

భారత రాజ్యాంగం ప్రకారం ఒక ఫెడరల్ పద్ధతి రూపొందింది. కేంద్రానికి, రాష్ట్రాలకు ప్రత్యేకంగా చట్టాలు చేసుకునే హక్కు, పన్నులు వసూలు చేసుకునే హక్కు, పరిపాలనా విధానాలను రూపొందించుకునే హక్కు రాజ్యాంగం ప్రత్యక్షంగా వాటికి దఖలు పరిచింది. ఇవి కేంద్రానికి లోబడి పనిచేసే సామంత ప్రభుత్వాలు కావు. వీటికితోడు ఉమ్మడి జాబితాలో వున్న అంశాలపై చట్టాలు చేసుకునే హక్కు ఉభయులకీ కల్పించబడింది.

ప్రతి ఎన్నికలోను మోదీ డబుల్ ఇంజన్ సర్కార్స్ వుంటేనే సత్వరాభివృద్ధి జరుగుతుందని, పైనా కిందా తననే గెలిపించమని కోరడం ఈ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. తమకు అనుకూలమైన రాష్ట్ర ప్రభుత్వాలకే తోడ్పాటు వుంటున్నది రాజ్యాంగ వ్యతిరేకమైన భావన. జీఎస్టీలో ఒకే దేశం, ఒకే పన్ను పేరుతో రాష్ట్రాల నుంచి పన్నులు విధించే హక్కును కేంద్రం కబ్జా చేసింది. అలాగే వ్యవసాయం పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశం. కాని, మోదీ ప్రభుత్వం దొడ్డిదారిన మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చి, రాష్ట్రాల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా అమలుకు చర్యలు తీసుకుంది. పాఠశాల విద్య పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశం. జాతీయ విద్యా విధానం పేరుతో రాష్ట్రాల సమ్మతితో నిమిత్తం లేకుండా తనదైన జాతీయ విద్యా విధానాన్ని అందరి మీదా రుద్దింది. అలాగే ఎన్ఐఏ సంస్థను వినియోగించి రాష్ట్రాలలో అన్ని కేసులలో తాను జోక్యం చేసుకునే పెత్తనం సంపాదించింది. కార్మిక చట్టాలలో రాష్ట్రాలకున్న వెసులుబాటును తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది. పలు భాషలు, ప్రాంతాలు, సంప్రదాయాల వైవిధ్యం వున్న దేశంలో ఒకే ఎన్నిక, ఒకే భాష, ఒకే సివిల్ కోడ్‌ల పేరుతో భిన్నత్వాన్ని చెరిపివేస్తూ ఏకరూపం తేవాలనే ప్రయత్నం సహకార సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నది. మోదీ విధానాలు సహకార సమాఖ్యకు దోహదం చేయకపోగా విద్వేషానికి, విభజనకు దారితీసేవిగా వున్నాయి. ❑

- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977


# నిజమైన సమస్యలను ఎదుర్కొనే ధైర్యం లేని కేంద్ర బడ్జెట్ 2024-25



- ప్రభాత్ పట్నాయక్

**ఒక పక్కన భారీ నిరుద్యోగం ప్రజల్ని, ప్రత్యేకించి దేశంలోని యువతను పీడిస్తోంది. అదిగాక ఆహార వస్తువుల ధరల్లో పెద్ద ఎత్తున ద్రవ్యోల్బణం విడవకుండా వెన్నాడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యం గతంలో ఎన్నడూ మనం చూడనంత తీవ్రస్థాయిలో ఉంది. వీటన్నింటికీ తోడు చిన్న ఉత్పత్తుల రంగంలో సంక్షోభం నెలకొంది. ఇక ఆదాయాల్లో, సంపదలో వ్యత్యాసాలు ఎంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయంటే మొత్తం ప్రపంచమంతా దాని గురించి మాట్లాడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రవేశపెట్టే బడ్జెట్ తక్షణం జరూరుగా చేపట్టవలసిన చర్యలను ప్రతిపాదిస్తుందని, ఈ సమస్యలను ఎదుర్కోవడానికి కొంత గుండె ధైర్యాన్ని ప్రదర్శిస్తుందని ఎవరైనా ఆశిస్తారు. కాని జూలై 23న పార్లమెంటులో ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇవేమీ కనిపించవు.**

మొత్తంగా స్థూల డిమాండ్‌ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచి తద్వారా నిరుద్యోగాన్ని కొంత మేరకు తగ్గించే ప్రతిపాదన గాని, లేదా ప్రత్యేకంగా ఉద్యోగాల కల్పనకు దారి తీసే పథకాలు గాని ఏవీ లేవు. విద్య, వైద్య రంగాలకు జీడీపీలో తగు మోతాదులో కేటాయింపులు పెంచలేదు. సంక్షేమ పథకాలకు కేటాయింపులు పెంచలేదు






సరికదా, తగ్గించారు. పోనీ, ఆర్థిక వనరుల కొరత కారణంగా ఇలా చేయవలసి వచ్చిందా అంటే అటువంటిదేమీ లేదు. మొత్తంగా ప్రభుత్వం వైపు నుంచి ఒక ప్రయత్నమే ఏదీ లేకుండా పోయింది. గత సంవత్సరాలలో ఏ వ్యూహాన్ని అనుసరిస్తూ వచ్చారో ఇప్పుడూ అదే అనుసరించారు. ఆ వ్యూహం ఏమంటే : అదనపు ఆర్థిక వనరులను సమీకరించడానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయకపోవడం, పన్నులు ద్వారా వచ్చే ఆదాయం కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని (ఇందులో ఎక్కువ భాగం రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాకు వచ్చే లాభాలు ఉంటాయి) పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి కొంత వరకు ఉపయోగించడం, (ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన రంగంలో) కొన్ని పద్దుల కింద సంక్షేమ వ్యయం గనుక పెరిగితే తక్కిన పద్దుల కింద సంక్షేమ

### రూపాయి రాక

- ఇన్‌కమ్ ట్యాక్స్ 19 శాతం
- ఎక్సైజ్ డ్యూటీ 5 శాతం
- అప్పులు, ఆస్తులు 27 శాతం
- పన్నేతర ఆదాయం 9 శాతం
- మూలధన రశీదులు 1 శాతం
- కస్టమ్స్ ఆదాయం 4 శాతం
- కార్పొరేషన్ ట్యాక్స్ 17 శాతం
- జీఎస్టీ, ఇతర పన్నులు 18 శాతం





### రూపాయి పోక

- పెన్షన్లు 4 శాతం..
- వడ్డీ చెల్లింపులు 19 శాతం
- కేంద్ర పథకాలు 16 శాతం
- సబ్సిడీలు 6 శాతం.. • డిఫెన్స్ 8 శాతం
- రాష్ట్రాలకు తిరిగి చెల్లించే ట్యాక్స్‌లు 21 శాతం
- ఫైనాన్స్ కమిషన్‌కు చెల్లింపులు 9 శాతం
- కేంద్ర ప్రాయోజిత పథకాలు 8 శాతం
- ఇతర ఖర్చులు 9 శాతం

వ్యయానికి కోత పెట్టడం, బడా పెట్టుబడిదారులు ఎదుర్కొం టున్న సమస్యలకు పరిష్కారంగా బడ్జెట్‌లో వారికి కేటాయిం పులు పెంచడం. వీటన్నింటినీ నేను వరుసగా వివరిస్తాను.

2023-24 బడ్జెట్ (సవరించిన అంచనాలు)తో పోల్చితే 2024-25 బడ్జెట్ (బడ్జెట్ అంచనాలు)లో రాష్ట్రాలకు బదలాయించే భాగంతో సహా మొత్తం ప్రభుత్వ వ్యయం 7.35 శాతం పెరుగుతుందని ప్రతిపాదించారు. అంటే జీడీపీలో కేంద్ర ప్రభుత్వ వ్యయం వాటా తగ్గుతుందన్న మాట. ఇప్పుడు ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాలి. కాని దానికి పూర్తి వ్యతిరేక దిశలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిం చారు. ఈ వికృత చర్యకు కారణం ఆర్థిక వనరుల కొరత ఉండడం ఎంత మాత్రమూ కాదు. వాస్తవానికి జీడీపీతో పోల్చినప్పుడు పన్ను నిష్పత్తి 2021-22లో 11.5 శాతం, 2023-24లో 11.7 శాతం, ఇప్పుడు 2024-25లో 11.8 శాతంగా ఉంది. అంటే పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకో వాలనే ప్రయత్నం ఈ ప్రభుత్వం వైపు నుండి ఏ మాత్రమూ లేదు. ఇక పన్నుల ద్వారా కాకుండా ఇతరత్రా వచ్చే ఆదాయం 2023-24తో పోల్చితే 2024-25లో 36 శాతం పెరుగుదల నమోదు చేస్తుందని అంచనా వేశారు. అందులో డివిడెండ్ల ద్వారా, లాభాల ద్వారా (ముఖ్యంగా రిజర్వు బ్యాంకు లాభాల ద్వారా) లభించేది 70 శాతం పెరుగుదల నమోదు చేయనుంది.

ఇక ఖర్చు వైపు చూద్దాం. ప్రభుత్వ వ్యయం మొత్తంగా 7.35 శాతం మాత్రమే పెరుగుతుంది. అందులో పెట్టుబడి వ్యయంలో (దీనిలో రాష్ట్రాలకు ప్రాజెక్టు పెట్టుబడుల నిమిత్తం బదలాయిం చేది కూడా ఉంటుంది) మాత్రం 17 శాతం వృద్ధి ఉండనుంది. ఇది పైకి చూడడానికి మంచి పరిణామంగానే కనిపిస్తుంది. కాని, ఈ ప్రాజెక్టులు శ్రామిక ప్రజల జీవితాల మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపించలేవు. పైగా దానిలో విదేశాల నుండి దిగు మతి చేసుకునే సరుకులు, సేవల నిమిత్తం విదేశాలకు తరలి పోయే భాగం ఎక్కువగా ఉంటుంది. అందుచేత దేశీయంగా ఉద్యోగాలను కల్పించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా, పెట్టుబడి వ్యయం పెరిగినందున, తక్కిన ప్రభుత్వ వ్యయం బాగా తగ్గిపోతుంది. దాని ఫలితంగా దేశీయంగా డిమాండ్ తగ్గుతుంది. అది నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది.

తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిరుద్యోగాన్ని గురించి ప్రస్తావించారు. కాని అందుకు సూచించిన పరిష్కారం చూస్తే ఆమెకు ఉన్న అవగాహనా రాహిత్యం బైటపడుతుంది. ఉద్యోగాల కల్పనకోసం ఆమె మూడు పథకాలను ప్రతిపాదించారు. ఈ పథకాల ద్వారా ఉద్యోగులకు, యజమానులకు సొమ్మును చెల్లి స్తారు. కొత్త ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు ఈ చెల్లిం పులు చేస్తారు. ప్రధానంగా ఈ స్కీములు సంఘటిత రంగానికి

## ప్రధాన కేంద్ర పథకాలకు కేటాయింపులు

- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ. 86 వేలకోట్లు.
- రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు రూ. 1,200 కోట్లు.
- న్యూ క్లియర్ ప్రాజెక్టులకు రూ. 2,228 కోట్లు.
- ఫార్మాసూటికల్స్ రంగంలో పీఎల్ఐ పథకానికి రూ. 2,143 కోట్లు.
- సెమి కండక్టర్లు అభివృద్ధికి, తయారీ రంగానికి రూ. 6,903 కోట్లు.
- సోలార్ పవర్(గ్రిడ్) రూ. 10 వేల కోట్లు.
- ఎల్‌పీజీ డీబీటీ(రాయితీ)లకు 1,500 కోట్లు.

## బడ్జెట్ 2024-25 కేటాయింపులు ఇలా..

- రక్షణ వ్యయం రూ. 4.56 లక్షల కోట్లు.
- గ్రామీణాభివృద్ధి రూ. 2,65,808 కోట్లు.
- వ్యవసాయం, అనుబంధ రంగాలు రూ. 1,51,851 కోట్లు.
- హోం వ్యవహారాలు రూ. 1,50,983 కోట్లు.
- విద్య రూ. 1,25,638 కోట్లు.
- ఐటీ, టెలికాం రూ. 1,16,342 కోట్లు.
- ఆరోగ్యం రూ. 89,287 కోట్లు.
- ఎనర్జీ రూ. 68,769 కోట్లు.
- సాంఘిక సంక్షేమం రూ. 56,501 కోట్లు.
- వాణిజ్యం, పరిశ్రమల రంగం రూ. 47,559 కోట్లు.

## కొత్త పన్ను విధానంలో మార్పులు..

- రూ. 3 లక్షలలోపు ఎలాంటి పన్ను లేదు.
- రూ. 3 లక్షల నుంచి రూ. 7 లక్షలలోపు 5 శాతం,
- రూ. 7 లక్షలు-రూ. 10 లక్షలలోపు 10%,
- రూ. 10 లక్షలు-రూ. 12 లక్షలలోపు 15%,
- రూ. 12 లక్షలు-రూ. 15 లక్షలలోపు 20%,
- రూ. 15 లక్షలు అంతకంటే ఎక్కువ ఉంటే 30% పన్ను చెల్లించాలి.
- మొత్తంగా పన్నుదారులు రూ. 17,500 మిగుల్చుకునే అవకాశం.
- పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ. 50,000 నుంచి రూ. 75,000కి పెంపు.

- ట్రేడింగ్ మార్కెట్‌లో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్లపై ఎస్‌టీటీ వరుసగా 0.02%, 0.01%కి పెంపు.
- దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5 శాతం పన్ను.
- క్యాపిటల్ కనిష్ఠ పరిమితి రూ. 1.25 లక్షలు.
- స్టార్టప్‌ల కంపెనీలకు ప్రోత్సాహకం.. ఏంజెల్ ట్యాక్స్ రద్దు.

వర్తిస్తాయి. అందులో ఉద్యోగులకు చెల్లింపుల కోసం కేటాయించినప్పటికీ, ఆ మేరకు యజమానులు ఉద్యోగుల వేతనాలను తగ్గించే అవకాశం ఉంది. ఆ విధంగా యజమానులు ప్రయోజనం పొందుతారు. ఇది కాకుండా నైపుణ్యం పెంపొందించేందుకు ఒక పథకాన్ని ఆమె ప్రతిపాదించారు. దాని వలన కొత్త ఉద్యోగాలు లభిస్తాయని ఆమె చెప్పుకొచ్చారు. ఈ నిధుల కేటాయింపు పథకం వెనుక ఉన్న అంతస్సూత్రం ఏమంటే ఉద్యోగులకు చెల్లించే వేతనాలు తక్కువగా ఉంటే ఎక్కువ ఉద్యోగాలు ఏర్పడతాయి అని. ఇది బూర్జువా ఆర్థిక శాస్త్రానికి అత్యంత ఇష్టమైన సూత్రం. కాని అది ఎంత మాత్రమూ సరైనది కాదు. యజమానులు చెల్లించవలసిన జీతాల వాటా తగ్గితే ఆ తగ్గిన మొత్తాన్ని యజమానులు తమ జేబులో వేసుకుంటారే తప్ప కొత్త ఉద్యోగాలను కల్పించరు. నైపుణ్యాన్ని కల్పించే పథకాల వలన కొత్త ఉద్యోగాలు వస్తాయన్నదీ ఆ బూర్జువా ఆర్థిక వేత్తల సిద్ధాంతమే. దాని ప్రకారం, మార్కెట్‌లో స్థూల డిమాండ్ ఎప్పుడూ ఒకే తీరుగా ఉంటుంది. ఉన్న ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలు ఉన్నవారు లేకుంటే అప్పుడు ఉద్యోగాలు నిండవు. ఉన్న నిరుద్యోగులకు సరిపడా ఉద్యోగాలైతే ఉంటాయి కాని, వారికి తగిన నైపుణ్యం లేనందువల్లే ఆ ఉద్యోగాలు నిండడం లేదు. - ఇదీ ఆ సిద్ధాంతం.

ఈ రెండు సిద్ధాంతాలూ పూర్తిగా తప్పు. సరుకులను ఉత్పత్తి చేసిన మేరకు వాటికి డిమాండ్ ఎప్పుడూ ఉండనే వుంటుంది అన్నదే ఆ సిద్ధాంతం (దీనినే సే సూత్రం అంటారు). ఈ వాదనను మార్క్స్ పూర్తిగా వ్యతిరేకించాడు. మళ్ళీ 75 సంవత్సరాల తర్వాత కీన్స్ కూడా ఈ సూత్రాన్ని వ్యతిరేకించాడు. అంతదాకా ఈ సే సూత్రాన్ని చాలా బలంగా నమ్ముతూ వచ్చారు. ఎఫ్‌డి రూజ్‌వెల్ట్‌కన్నా ముందు అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన హెర్బర్ట్ హూవర్ మహా మాంద్యం కాలంలో వేతనాలను తగ్గిస్తే దాని వలన అదనపు ఉద్యోగాలు కలుగుతాయని నమ్మి ఆ పనికి పూనుకున్నాడు. ఐతే కొత్త ఉద్యోగాలు ఏవీ ఏర్పడలేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు వంద సంవత్సరాల క్రితపు ఆ ఆలోచనలను దాటి ముందుకు పోలేకపోతున్నాయి. నిరుద్యోగాన్ని పరిష్కరించడంలో విఫలమైన ఆ ఆలోచనలనే పట్టుకుని వేలాడుతున్నాయి.

ఆర్థిక వ్యవస్థను పుంజుకునేలా చేయడానికి పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం నిష్ప్రయోజనం అని అధికారిక ప్రకటనలలో అరుదుగా వస్తుంది. ఆర్థిక సర్వే అటువంటి ఒక అరుదైన సందర్భం. ఆ సర్వే కూడా పెట్టుబడిదారులు తమకు ధనం బదలాయింపు జరిగినా, దానిని ఎందుకు పెట్టుబడిగా పెట్టడం లేదని ప్రశ్నించదు. అలా పెట్టుబడి పెట్టడానికి ఆర్థికంగా పరిస్థితులు బాగానే ఉన్నా, వాళ్లు పెట్టుబడులు పెట్టకపోవడం కేవలం వారి నైతిక వైఫల్యం మాత్రమేనని భావిస్తుంది.

- కేంద్ర బడ్జెట్ 2024-25లో మొత్తం రూ.48,20,512 కోట్లు వ్యయం అంచనా వేశారు.
- మూలధన వ్యయం రూ.11,11,111 కోట్లు. ఇది 2023-24 అంచనాల కంటే 16.9% ఎక్కువ.
- ప్రభావవంతమైన మూలధన వ్యయం రూ.15,01,889 కోట్లుగా అంచనా.
- రెవెన్యూ వసూళ్లు రూ.31,29,200 కోట్లు.
- నికర పన్ను ఆదాయం రూ.25,83,499 కోట్లు.
- పన్నేతర ఆదాయం రూ.5,45,701 కోట్లు.
- మొత్తం మూలధన వసూళ్లు (రుణేతర రశీదులు, రుణ రసీదులతో కలిపి) రూ.15,50,915 కోట్లు.

## విధాన ముఖ్యాంశాలు

- **రైల్వేలు :** మూడు ప్రధాన ఆర్థిక రైల్వే కారిడార్ కార్యక్రమాలు అమలు చేయబడతాయి. అవి:
  (i) శక్తి, ఖనిజ మరియు సిమెంట్ కారిడార్లు,
  (ii) పోర్ట్ కనెక్టివిటీ కారిడార్లు మరియు
  (iii) అధిక ట్రాఫిక్ సాంద్రత గల కారిడార్లు.
  ప్రయాణీకుల భద్రత మరియు సౌకర్యాన్ని నిర్ధారించడానికి నలభై వేల సాధారణ రైలు బోగీలను వందే భారత్ ప్రమాణాలకు అప్‌గ్రేడ్ చేస్తారు.
- **హౌసింగ్ :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీన్ కింద వచ్చే ఐదేళ్లలో అదనంగా రెండు కోట్ల ఇళ్లు నిర్మించబడతాయి. అద్దె ఇళ్లు, మురికివాడలు, అనధికార కాలనీల్లో నివసిస్తున్న మధ్య తరగతి వర్గాలకు సొంత ఇళ్లు కొనేందుకు లేదా నిర్మించుకునేందుకు కొత్త పథకం ప్రారంభించనున్నారు.
- **ఆరోగ్యం :** తొమ్మిది మరియు 14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్‌ను నిరోధించడానికి టీకాలు వేయడం ప్రోత్సహించబడుతుంది. దేశవ్యాప్తంగా ఇమ్యునైజేషన్ నిర్వహణ కోసం U-WIN అనే కొత్త ప్లాట్‌ఫారమ్ రూపొందించబడుతుంది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఆరోగ్య సంరక్షణ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు మరియు హెల్పర్‌లందరికీ వర్తింపజేయబడుతుంది.
- **శక్తి :** కోటి కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలారైజేషన్ చేపట్టబడుతుంది. 2070 నాటికి నికర-సున్నాను సాధించడానికి, CNG మరియు PNGలలో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను కలపడం దశలవారీగా తప్పనిసరి చేయబడుతుంది. 2030 నాటికి కోల్ గ్యాసిఫికేషన్ మరియు 100 మెట్రిక్ టన్నుల ద్రవీకరణ సామర్థ్యం ఏర్పాటు చేయబడుతుంది.

తమకు ఎక్కువగా లాభాలు వచ్చాయి కాబట్టి వాళ్లు ఎక్కువగా పెట్టుబడులు మళ్లీ పెడతారనుకోవడం తప్పు. మార్కెట్‌లో డిమాండ్ పెరగకుండా ఉండిపోతే వాళ్లు పెట్టిన అదనపు పెట్టు బడి వలన ఏమి ఉపయోగం? అటువంటి సందర్భాలలో పెట్టు బడిదారులు తమ వద్దనున్న ధనాన్ని పెట్టుబడి పెట్టడానికి కాకుండా రియల్ ఎస్టేట్ కొనడానికో, షేర్లు కొనడానికో ఖర్చు చేస్తారు. తద్వారా మరింత లాభాన్ని పొందవచ్చునని భావిస్తారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు పూర్తిగా డొల్ల విధానాలు. వాటిని ఐఎంఎఫ్. ప్రపంచబ్యాంకు పదే పదే ప్రచారం చేస్తున్నాయి కనుక వీళ్లు ఇక్కడ వాటిని అమలు చేసేస్తున్నారు.

ప్రభుత్వం ఉద్దేశ్యం ఏమిటో ఉపాధి హామీ పథకానికి చేసిన కేటాయింపులు చూస్తే తెలుస్తుంది. దానికి రూ.86,000 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది ఇదే మొత్తాన్ని కేటాయిం చారు. పెరిగిన ధరలతో పోల్చినప్పుడు వాస్తవంగా కేటాయిం పులు తగ్గాయన్నమాట. ఆ ఉపాధి పనులకు డిమాండ్ పెరిగితే అప్పుడు అదనంగా కేటాయిస్తామని ఎప్పుడూ చెప్పేదే ఇప్పుడు ప్రభుత్వం చెప్తుంది. కాని ఉపాధి పనులకు వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఆ పనులకు అదనపు డిమాండ్ ఎలా పెరుగు తుంది ? బడ్జెట్‌లో తక్కువగా కేటాయించినప్పుడు సకాలంలో వేతనాలు చెల్లించడం ఏ విధంగా సాధ్యపడుతుంది? పైగా గతేడాది చాలామందిని ఉపాధిహామీ పథకం పరిధి నుండి మినహాయించారు (పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగా). అందు వలన ఉపాధి హామీ పథకానికి చేసిన వ్యయం గతేడాది బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది ఇదే జరుగుతుంది. ఇది క్షమించరాని నేరం. ఇక వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్లను చూస్తే గతేడాది ఎంత కేటాయించారో ఈ ఏడాదీ అదే మొత్తాన్ని కేటాయించారు. అసలు ఈ పథకాల కింద ఇచ్చే మొత్తమే చాలా తక్కువ. పైగా కేటాయింపులు పెంచలేదు. అంటే ధరల పెరుగుదలను లెక్కలోకి తీసుకుంటే వాస్తవ కేటాయింపులు తగ్గినట్టే. ఇక విద్య కు కేటాయింపుల్లో 7.8 శాతం పెరుగుదల చూపారు. వైద్యానికి దాదాపు ఎటువంటి పెరుగుదలా లేదు. జిడిపితో పోల్చినప్పుడు ఈ రెండు రంగాలకూ తగు విధంగా పెరుగుదల ఉండాలి. కాని అలా చేయలేదు. అంటే సాపేక్షంగా కేటాయింపులు తగ్గిపోయినట్టే. నిజానికి ఈ రెండు రంగాల లోనూ గతేడాది చేసిన కేటాయింపుల మేరకు కూడా ఖర్చు చేయలేదు. ఇది తీవ్రంగా పరిగణించవలసిన విషయం. కాని గతేడాది ఖర్చు కాలేదు అన్న సాకు చూపించి ఈ ఏడాది కేటాయింపుల్లోనే కోతలు పెట్టడం జరిగింది.

2023-24లో ఆహార సబ్సిడీ కింద రూ.2.12 లక్షల కోట్లు కేటాయించారు. ఈ ఖర్చు 2024-25లో రూ.2.05 లక్షల కోట్లకు తగ్గిపోయింది. ఇంకోపక్క రైతులకు ప్రకటించిన మద్దతు ధరలు చాలా హీనంగా ఉంటున్నాయి. అంటే ఆ రైతులు తాము మద్దతు ధరలను కోల్పోతూ మరోపక్క ఆహార సబ్సిడీ భారాన్ని కొంతవరకూ మోస్తున్నారన్నమాట. ఇక ఆంధ్ర, బీహార్ ప్రభుత్వాలకు చేసే బదలాయింపులు ఎక్కువగా ఉన్నందువలన ఆ మేరకు తక్కిన రాష్ట్రాల మీద ఆ భారం పడుతుందన్నమాట. ఈ దేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న తీవ్ర తక్షణ సమస్యల గురించి ఈ ప్రభుత్వానికి ఏమీ పట్టడం లేదని ఈ బడ్జెట్ బట్టి అర్థం అవుతుంది. ఈ దేశ ఆర్థిక స్థితి అంతా బాగానే ఉన్నట్టు, తక్షణమే స్పందించి పరిష్కరించవలసిన సమస్యలేవీ లేనే లేనట్టు ఎన్డీయే ప్రభుత్వం నటిస్తోంది. ఈ మొండితనం ఆశ్చర్యం కలిగిస్తోంది. ❑

- **పర్యావరణం :** EV తయారీ మరియు ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయబడతాయి మరియు విస్త రించబడతాయి. ప్రజా రవాణా కోసం ఈ-బస్సుల స్వీకరణను ప్రోత్సహిస్తారు. కోస్టల్ ఆక్వాకల్చర్ మరియు మారికల్చర్ పునరుద్ధరించడానికి బ్లూ ఎకానమీ 2.0 పథకం ప్రారంభించబడుతుంది. బయోడిగ్రేడబుల్ పాలి మర్లు, బయో-ప్లాస్టిక్స్ మరియు బయో-ఫార్మా స్యూటి కల్స్ వంటి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను అందించడానికి కొత్త పథకం ప్రారంభించబడుతుంది.
- **వ్యవసాయం :** సమగ్రత, నిల్వ, సరఫరా గొలుసు, ప్రాసె సింగ్ మరియు మార్కెటింగ్‌సహా పంట అనంతర కార్య కలాపాలలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ పెట్టుబడి ప్రోత్స హించబడుతుంది. నానో డిఎపి ఎరువుల వాడకం అన్ని వ్యవసాయ-వాతావరణ మండలాల్లో విస్తరించబడు తుంది. పాడి రైతులను ఆదుకునే కార్యక్రమం రూపొందిస్తామన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన వీటికి విస్తరించబడుతుంది:
  (i) ఆక్వాకల్చర్ ఉత్పాదకతను హెక్టారుకు మూడు నుండి ఐదు టన్నుల వరకు పెంచడం,
  (ii) రెట్టింపు మత్స్య ఎగుమతులు లక్ష కోట్ల రూపాయలకు మరియు
  (iii) 55 లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం.
- **జనాభా మార్పులు :** వేగవంతమైన జనాభా పెరుగుదల మరియు జనాభా మార్పుల వల్ల తలెత్తే సవాళ్లను పరిష్క రించడానికి ఒక ఉన్నత-శక్తి కమిటీని ఏర్పాటు చేస్తారు.
- **పరిశోధన :** పరిశోధన మరియు ఆవిష్కరణలను పెంచ డానికి ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి, లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కార్పస్ తక్కువ లేదా శూన్య వడ్డీ రేట్లకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తుంది.

# వికసించని మన పారిశ్రామిక భారతం!



- రాహుల్‌కుమార్

**వికసిత భారత్ ! దీని గురించి జరిగే ప్రచారం అంతా ఇంతా కాదు. సమావేశాలు, గోష్ఠులు, లక్ష్య ప్రకటనలు, విధానాల రూపకల్పనలు.. ఎటు చూసినా వికసిత భారత్ వైపే దేశం కదులుతున్నట్లు ప్రచారం హోరెత్తుతోంది. రాజకీయ దృష్టితో దీన్ని ప్రచారపటాటోపంగా కొట్టివేయటం తేలిక. భిన్న రాజ కీయ దృక్పథంతో పెదవి విరవటమూ కష్టం కాదు. వీటికి మించి వికసిత భారత్ భావన సాధ్యాసాధ్యాలను అర్థం చేసుకోవాలంటే చాలా విషయాలను స్పృశించాలి. అందుకు మన ఆర్థికాభివృద్ధి చరిత్రలోకి వెళ్లాలి. అదెంత వేగంతో నడిచిందో చూడాలి. ఆ వేగం ఆశించిన రీతిలో కాకుండా అరకొరగా ఉంటే కారణాలను వెతకాలి. ఆర్థిక వికాసానికి, మేధో వికాసానికి సంబంధాలను చూడాలి. అసలు ఈ రెండిటికీ బంధనాల్లాంటివి ఉంటే అవెందుకు ఏర్పడ్డాయో విశ్లేషించాలి.**

జూలై మాసం చివరలో దిల్లీలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధానమంత్రితోపాటు సీఎంలూ పాల్గొన్నారు. 2047 నాటికి మన ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి అనుగుణంగా విధానాలను రూపొందించుకుని, అడ్డంకులను తొలగించుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. స్వాతంత్ర్యం పొందిన వందేళ్ల నాటికి (2047) మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండాలన్నదే వికసిత భారత లక్ష్యం. లక్ష్యం ఘనంగా పెట్టుకోవటంలో తప్పులేదు. 1950 నాటికి ఆర్థికంగా భారత్‌తో సమానస్థాయిలో ఉన్న కొన్ని దేశాలు చాలా ముందుకు వెళ్లాయి. ఆగ్నేయాసియా, చైనాల ఆర్థిక చరిత్ర చూస్తే ఇదే అర్థం అవుతుంది. బంగ్లాదేశ్‌ను పరిశీలించినా కొన్ని రంగాల్లో ఆ దేశం ముందుకు వెళ్లింది. మానవాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఇది స్పష్టంగా కన పడుతుంది. 2024లో బంగ్లాదేశ్ తలసరి జీడీపీ (స్థూల దేశీ యోత్పత్తి) 2,529 డాలర్లు. దారిద్ర్యరేఖ (రోజుకు 2.15 డాలర్లకంటే తక్కువ ఆదాయం) దిగువన అయిదు శాతం ప్రజలే ఉన్నారు. సగటు ఆయుర్దాయం 74 ఏళ్లు. శ్రామిక శక్తిలో బంగ్లా మహిళల వాటా 43 శాతం ఉంది. ఆ దేశంతో పోలిస్తే భౌగోళికంగా భారత్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. అయినా కొన్ని విషయాల్లో వెనుకబడే ఉంది. భారత్‌లో తలసరి జీడీపీ 2484.8 డాలర్లు ఉంటే, దారిద్ర్య రేఖకు దిగువన 12.9 శాతం (2021 నాటికి) ప్రజలు ఇప్పటికీ జీవిస్తున్నారు. మన సగటు ఆయుర్దాయం 68 ఏళ్లే. ఇక శ్రామికశక్తిలో మహి ళల వాటా (37శాతం) బంగ్లాతో పోల్చితే తక్కువ. తాజా మాన వాభివృద్ధి సూచికలో సైతం బంగ్లాదేశ్ కంటే (129) అయిదు పాయింట్లు (134) దిగువనే ఉన్నాం.

ఇప్పుడు మరికొన్ని దేశాలను చూద్దాం. 1970ల నాటికి సింగపూర్ పరిస్థితి దయనీయంగా ఉండేది. ప్రస్తుతం ఆ దేశ వార్షిక తలసరి జీడీపీ 88450 డాలర్లు. మలేసియా కూడా మంచి స్థితిలోనే (13310) ఉంది. థాయిలాండ్ (7810), చైనా (13140), దక్షిణ కొరియా (34165), భూటాన్ (4010), ఐర్లండ్ (106,060), డొమినికన్ రిపబ్లిక్ (11170).. ఇట్లా ప్రత్యక్ష, పరోక్ష వలస పాలన నేపథ్యం ఉన్న దేశాలను తీసుకున్నా ఎంతో ముందుకు వెళ్లిన పరిస్థితి కనపడుతుంది. ఐర్లండ్‌కు 1922లో బ్రిటన్ నుంచి స్వేచ్ఛ లభించినా 1970ల వరకూ పేద దేశంగానే ఉండేది. ఆ తర్వాత బ్రిటన్‌ను అధిగమించింది. ప్రస్తుత ఐర్లండ్ తలసరి జీడీపీతో పోల్చితే బ్రిటన్ తలసరి జీడీపీ సగం కంటే తక్కువగానే ఉంది.

ఆశించిన స్థాయిలో భారత్ గణనీయంగా ఆర్థికాభివృద్ధిని సాధించలేకపోవటానికి చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిలో మనం పెట్టుకున్న లక్ష్యాలను సాధించలేదు. 1950ల నుంచి ఇప్పటి వరకూ జీడీపీలో పారిశ్రామిక రంగం వాటా 20 శాతానికి దాటిన సందర్భాలు అరుదనే చెప్పాలి. వాటా పెరగటం కంటే తరిగిన సంవత్సరాలు ఉన్నాయి. ఇప్పుడూ ఒకప్పుడూ అగ్రరాజ్యాలుగా ఉన్న దేశాలన్నీ పారిశ్రామిక రంగంలో గణనీయ అభివృద్ధిని సాధించిన తర్వాతే ఆ స్థాయికి చేరుకున్నాయి. 1950ల నుంచి పారిశ్రామికాభివృద్ధి పరంగా మనం సరైన గాడిలో నడిచిన సందర్భాలు చాలా తక్కువ. దీనిమీద ప్రముఖ ఆర్థికవేత్త సుమిత్ కె.మజుందార్ తన 'లాస్ట్ గ్లోరీ-ఇండియాస్ క్యాపిటలిజం స్టోరీ' అన్న పుస్తకంలో మంచి విశ్లేషణే చేశారు. 2013-2014 వరకూ సుమిత్ చేసిన పరిశీలనలో ఒకటి

మాత్రం స్పష్టంగా వెల్లడైంది. 1950ల నుంచి 2013-14 వరకూ అంటే 63 ఏళ్ల కాలంలో సేవల రంగమే ప్రధాన పాత్ర వహించింది. ఆ కాలం నాటి సేవల రంగం వార్షిక సగటు వాటా 48 శాతం ఉంది. ఆర్థిక సంస్కరణలతో (1991) సేవల రంగం మరింత ఊపందుకున్న మాట నిజమే. అంతకు ముందు కూడా దాని ప్రాధాన్యం తక్కువ కాదు. ఇక ఇదే కాలంలో పారిశ్రామిక రంగం వార్షిక సగటు వాటా 18 శాతానికి మించలేదు. వ్యవసాయం వాటా 34 శాతం వరకూ ఉంది. 63 ఏళ్ల సగటును కాకుండా 2010 తర్వాత పరిస్థితినే తీసుకుంటే వ్యవసాయ రంగం వాటా (14శాతం) బాగా తగ్గిపోయింది. అదింకా క్షీణిస్తూనే ఉంది. దీనికి బదులు పారిశ్రామిక రంగం వాటా పెరిగిందా ? అంటే అదీ లేదు. యథాప్రకారం సేవల రంగం (66శాతం) వాటానే విపరీతంగా పెరిగింది. స్పష్టంగా చెప్పుకోవాలంటే వ్యవసాయరంగ ఆధిక్యత నుంచి సేవలరంగం ప్రాబల్యంలోకి మన ఆర్థిక వ్యవస్థ అడుగు పెట్టింది. దీర్ఘ దృష్టితో చూస్తే దేశంలో పారిశ్రామిక రంగం ఎప్పుడూ ఆధిక్యతను ప్రదర్శించలేదు. అందుకే పారిశ్రామికాభివృద్ధికి చేదోడువాదోడుగా నిలిచే మేధోవికాసమూ మనకు అరకొరగానే జరిగింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదంటూ చెప్పుకోదగిన ప్రభావిత ఆవిష్కరణలూ కనపడలేదు. ఆ ఆవిష్కరణలతో సమాంతరంగా పెంపొందే శాస్త్రీయ ఆలోచనా విధానమూ సమగ్రంగా బలపడలేదు. వ్యవస్థీకృత రంగంలో కార్మికవర్గం గణనీయ శక్తిగా ఎదగలేదు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ పారిశ్రామిక రంగాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుని ఆర్థికంగా సుసంపన్నం అయిన తర్వాతే సేవల రంగాన్ని విస్తరించుకున్నాయి.

**బలమైన పారిశ్రామిక రంగం లేకుండా కేవలం సేవలరంగం ఆధిక్యతతో సుసంపన్నం అవుతామని అనుకోవటం ఇప్పటికీ ప్రశ్నార్థకమేనన్నది సుమిత్ మజుందార్ అభిప్రాయం. ఆదా యంలో భారత్‌కంటే ముందున్న ఆసియా దేశాల్లో పారిశ్రామిక రంగం వాటా 40 శాతం దాకా ఉంది. ఉత్పాదక సామ ర్థ్యం చాలా మెరుగ్గా నమోదైంది. సాధించాలనుకున్న పారిశ్రా మిక ఉత్పాదక సామర్థ్యంలో అయిదో వంతుకు కూడా భారత్ చేరుకోలేదు. అలా చేరుకుని ఉంటే మన జాతీయాదాయం ఎన్నో రెట్లు పెరిగేది. ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం వాటా అయిదింట రెండు వంతులకు చేరుకుంటే మన పరిస్థితి భిన్నంగా ఉండేది. 11.5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థకు ఎప్పుడో చేరుకుని ఉండే వారం. చైనాకు దరిదాపుల్లో నిలిచేవాళ్లం. సామర్థ్యం లోపించిన పారిశ్రామిక రంగంతో మనం ఆర్థికంగా చేరుకోగలిగిన స్థాయిలో 20 శాతం మాత్రమే సాధించగలిగాం.**

అనేక అభివృద్ధి కొలమానాల్లో భారత్ పేద దేశంగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. వివిధ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు పారిశ్రామికాభివృద్ధి ప్రాధాన్యత గురించి చాలానే చెప్పాయి. పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లోనూ ఇదే కనపడింది. చివరికి 1991 నాటి ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యమూ ఘనమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించటమే. ఆత్మ నిర్భర్-మేకిన్ ఇండియా ప్రకటనల పరమార్థమూ అదే! ఇక ఉద్యోగ కల్పనలో వ్యవస్థీకృత పారిశ్రామిక రంగం వాటా చాలా తక్కువ. 2015 నాటికి ఒక శాతం జనాభానే ఈ రంగంలో ఉపాధిని పొందుతున్నారు. చిన్నాపెద్దా అన్ని కలిపి మొత్తంగా తయారీ రంగాన్ని తీసుకున్నా 13 మిలియన్ల మంది మాత్రమే అందులో ఉన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో కొంత మెరుగుదల కనిపించింది. కానీ ఆ తర్వాత 1960ల నుంచి 1980ల చివరి వరకూ ఆశించిన స్థాయిలో అది పెరగలేదు. ఆర్థిక సంస్కరణల తర్వాత కొంత ఎదుగుదల కనపడినా లక్ష్యాలకు చాలా దూరంలోనే ఉండిపోయింది. క్యాపిటలిజం అంటేనే పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచటం. ఇందులో వెనుకబడిన చోట పారిశ్రామిక పురోగతి సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో గణనీయ మార్పు లేకుండా వికసిత భారత్ లక్ష్యాలు నెరవేరుతాయా? అన్నది పెద్ద ప్రశ్నార్థకమే!

గరిష్ఠ లాభాల కోసమే వెంపర్లాడే ప్రైవేటు రంగం విశాల దృష్టితో జాతీయ అభివృద్ధికి తోడ్పడే రీతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, కుల-మత రాగద్వేషాలకు అతీతంగా సమర్థతకు పెద్దపీట వేస్తూ సంస్థల నిర్వహణకు పూనుకుంటూనే 'మేక్ ఇన్ ఇండియా' అనేది ఎంతో కొంత వాస్తవరూపం దాల్చుతుంది. గత అనుభవాలనూ, మన ప్రైవేటు రంగం స్వభావాన్నీ దృష్టిలో ఉంచుకుని ఇదంత తేలికగా సాకారమయ్యే పరిస్థితి లేదని సుమిత్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానంతో ఏకీభవించకపోయినా ఆయన వ్యక్తంచేసిన సందేహాన్ని తేలికగా కొట్టిపారేయలేం. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, నూతన ఆవిష్కరణల జోలికి వెళ్లకుండా, అమ్మకాలు-కొనుగోలు లావాదేవీలతో లాభాలు గడించాలన్న

**మిగతా 19వ పేజీలో..**

# మొట్ట మొదటి కేంద్ర బడ్జెట్ ఎంతో తెలుసా ?

- బీఎస్ఎన్ మల్లేశ్వరరావు



**1947-48 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఆర్కే షన్ముఖం చెట్టి 1947 నవంబర్ 26వ తేదీన దీనిని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఇది 1947 ఆగస్టు 15వ తేదీ నుంచి 1948 మార్చి 31 వరకు అంటే.. ఏడున్నర నెలలకు మాత్రమే అమలయ్యింది. ఆ బడ్జెట్ ప్రసంగంలో ఆయన ప్రధానంగా.. ఆహార, పారిశ్రామిక ఉత్పత్తి, దిగుమతుల్ని తగ్గించి స్వయం సమృద్ధి సాధించటంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అలాగే, భవిష్యత్ అవసరాల దృష్ట్యా రక్షణ రంగాన్ని బలోపేతం చేయటం గురించి మాట్లాడారు. సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పాలని ఆయన పిలుపునిచ్చారు. తొలి బడ్జెట్ ప్రసంగం ఆయన మాటల్లోనే..**

## 'విదేశాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడలేం'

'ఎక్కువ ఆహారం పండించండి' అన్న ప్రచారం పెద్దగా విజయం సాధించలేదు. దాని ప్రభావం ఆహార పంపిణీ వ్యవస్థపై పడింది. స్వాతంత్ర్యానికి ముందు నాలుగేళ్లు.. అంటే 1944 నుంచి 47 వరకు రూ.127 కోట్ల విలువ చేసే 43.80 లక్షల టన్నుల ఆహార పదార్థాలను భారతదేశం దిగుమతి చేసుకుంది. స్వాతంత్ర్యం పొందిన సంవత్సరంలో కూడా రూ.42 కోట్ల విలువైన 10.62 లక్షల ఆహార పదార్థాలను దిగుమతి చేసుకుంది. ఆస్ట్రేలియా నుంచి గోధుమలను దిగుమతి చేసుకునేందుకు ఒక కమిటీ ఆ దేశానికి వెళ్లింది. బహుశా సానుకూల ఫలితం రావొచ్చు. తద్వారా వచ్చే ఏడాదికి సరిపడా గోధుమలు మనం కొనుగోలు చేయవచ్చు. ఇలా విదేశాల నుంచి పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవటం ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై పెను ప్రభావం చూపుతోంది.

ఈ నేపథ్యంలో ఆహార ధాన్యాల విషయంలో దేశం స్వయం సమృద్ధి సాధించటమే మన ముందున్న ప్రధాన అజెండా. దీనిపై సర్ పురుషోత్తందాస్ ఠాకూర్దాస్ ఆధ్వర్యంలోని కమిటీ తన మధ్యంతర నివేదిక ఇచ్చింది. దీన్ని ప్రభుత్వం పరిశీలించాలి. దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి తగ్గటం, మత సంఘర్షణల కారణంగా పారిశ్రామిక రంగంలో అశాంతి కారణంగా నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి.

ఇప్పటి వరకూ బ్రిటీష్ కామన్వెల్త్ దేశాల నుంచి గణనీయంగా సరకు రవాణా జరిగేది. కానీ, ఇప్పుడు దానికి భారీగా అడ్డుకట్ట పడింది. దీంతో, విదేశాల నుంచి దిగుమతులు బాగా తగ్గుతున్నాయి. కాబట్టి, మనం మళ్లీ మన సొంత వసరులపై నిలబడాలి.

ఆహారం విషయానికి వస్తే.. దిగుమతులపై దేశం ఎక్కువ కాలం ఆధారపడలేదు. మన రోజువారీ అవసరాలు విదేశాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండకూడదు. పైగా, పెద్ద మొత్తంలో విదేశీ దిగుమతులు మన విదేశీ మారక నిల్వలపై ప్రభావం చూపుతాయి. మన నిల్వల్ని పారిశ్రామికాభివృద్ధి, దేశాభివృద్ధికి వినియోగించాలి కానీ దిగుమతుల కోసం కాదు. దేశంలోనే వీలైనంత ఎక్కువగా ఆహారాన్ని ఉత్పత్తి చేయటంపై మనం మన శక్తులన్నీ ధారపోయాలి. చేయి చేయి కలిపితే అదేమంత పెద్ద కష్టం కాదు.

## ఆదాయ.. వ్యయాలు

విభజన కారణంగా ఆదాయ అంచనాల్లో చాలా వ్యత్యాసాలు ఉండవచ్చు. ఈ విషయాన్ని సభ గుర్తించాలి. వచ్చే ఏడాది బడ్జెట్‌తోపాటు సవరించిన అంచనాలను సభ ముందుంచుతాను.

**ఆదాయ అంచనా.. రూ.171.15 కోట్లు**

**వ్యయం అంచనా.. రూ.197.39 కోట్లు**

**లోటు.. రూ.26.24 కోట్లు**

అయితే, లోటు ఇంకా ఎక్కువ ఉండవచ్చు. ఎందుకంటే శరణార్థుల పునరావాసం కోసం ఖర్చు చేయటంతోపాటు కొత్తగా ఏర్పడ్డ పశ్చిమ బెంగాల్, తూర్పు పంజాబ్ ప్రావిన్సులకు కొంత ఆర్థిక సహాయం చేయాలి. అయితే, ఆధారపడదగ్గ సమాచారం లేనందున వాటికి నిర్దుష్టంగా ఎలాంటి కేటాయింపులు చేయలేదు.

నేను ప్రతిపాదించిన ఆదాయ అంచనా.. రూ.171.15 కోట్లలో కస్టమ్స్ నుంచి రూ.50.5 కోట్లు, ఆదాయపు పన్ను ద్వారా రూ.29.5 కోట్లు, సాధారణ వసూళ్లు రూ.88.5 కోట్లు.

పోస్టు, టెలిగ్రాఫ్‌ల శాఖ నుంచి ఆదాయం రూ.15.9 కోట్లు, ఖర్చు, వడ్డీ రూ.13.9 కోట్లు. నికర మిగులు అంచనా రూ.2 కోట్లు.

ఈ ఏడాది రైల్వేల నుంచి ఎలాంటి నిధులనూ ఆశించట్లేదు. ఖర్చు రూ.197.39 కోట్లలో.. రూ.92.74 కోట్లు రక్షణ సేవలకు. మిగతాది పౌర ఖర్చులకు. విభజన కారణంగా రక్షణ రంగానికి సాధారణంకంటే ఎక్కువ ఖర్చవుతోంది. 1

949 ఏప్రిల్ 1 నాటికి ఆర్మీలో 2.60 లక్షల మంది సైనికులు ఉండాలి. కానీ, వారి సంఖ్య 2.30 లక్షలకు తగ్గుతోంది. పైగా, నౌక, వాయుసేనల్లో భారతదేశానికి సరి పడా సామర్థ్యం లేదు. దేశ విభజన కారణంగా ఈ రెండు రంగాల్లో మన సామర్థ్యం మరింత తగ్గింది. దీన్ని పెంచటంపై ప్రణాళికల్ని పరిశీలిస్తున్నాం.

భారతదేశం నుంచి బ్రిటీష్ సేనలు వైదొలుగుతున్నాయి. 1947 ఆగస్టు 17వ తేదీన తొలి బృందం తిరిగి వెళ్లింది. 1947లోనే పూర్తి కావాల్సిన ఈ ప్రక్రియ నౌకాయానంలో ఇబ్బందుల కారణంగా 1948 ఏప్రిల్ వరకు కొనసాగొచ్చు.

## స్టెర్లింగ్ పద్దు (విదేశీ మారక నిల్వలు)

భారత ప్రభుత్వం, బ్రిటీష్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం వివరాలను కొద్ది రోజుల కిందటే నేను సభ ముందు పెట్టాను. స్టెర్లింగ్ పద్దు కింద 1946 ఏప్రిల్ 5 నాటికి అత్యధికంగా రూ.1,733 కోట్లు ఉన్నాయి. అవి 1947 మార్చి నాటికి 1,612 కోట్లకు తగ్గిపోయాయి. జూలైలో మన కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టాక అవి రూ.1547 కోట్లుగా ఉన్నాయి. ఆరు నెలల్లోనే మనం రూ.65 కోట్లు తీసుకున్నాం. ఇదంతా కూడా భారీగా ఆహార ధాన్యాలు, సరకు దిగుమతుల కారణంగా జరిగింది. స్టెర్లింగ్ పద్దు నుంచే కనుక డబ్బులు తీసుకోకుంటే.. తగిన దిగుమతులు చేసుకోకుంటే మన దేశం యుద్ధ సమయంలో ఆకలితో అలమటించాల్సి వచ్చేది. తద్వారా చాలా పెద్ద మొత్తంలో నిధులు భారత్ నుంచి విదేశాలకు ముఖ్యంగా బ్రిటన్‌కు మళ్లాయి.

## ఎంపైర్ డాలర్ పూల్

1939 సెప్టెంబర్ నుంచి 1946 మార్చి 31వ తేదీ వరకు ఈ పద్దు కింద మనం రూ.405 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లు సంపాదించి, రూ.240 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లు ఖర్చు చేశాం. రూ.165 కోట్లు మిగిలాయి.

ఇదే సమయంలో కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, పోర్చుగల్ దేశాల కరెన్సీల్లో రూ.51 కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.114 కోట్లు మిగిలాయి. యుద్ధం తర్వాత ప్రణాళిక, అభివృద్ధి పద్దు కింద రూ.100 కోట్లు పెట్టగా, అందులో రూ.45 కోట్లు ప్రావిన్సులకు గ్రాంటులు.

ప్రావిన్సులు అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులూ ఇవ్వట్లేదు. అయితే, అవి తమ స్వంత వనరుల్ని పెంపొందించుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ సహాయం ప్రధాన ఉద్దేశ్యం. దీన్ని ప్రావిన్సులు గుర్తిస్తాయని ఆశిస్తున్నాను.

## దేశ ఆర్థిక పరిస్థితి

వరుసగా ఇది ఎనిమిదవ లోటు బడ్జెట్. ఈ సమయంలో మన దేశ ఆదాయ స్థితి పటిష్టంగా ఉందా? అని ఎవరైనా అడిగితే.. ఉందని చెప్పటానికి నేను ఏ మాత్రం సంశయించట్లేదు. చరిత్రలోనే గొప్ప యుద్ధం ప్రభావాన్ని ఏ దేశమూ తప్పించుకోలేకపోయింది.

ఈ యుద్ధ కాలంలో ఆర్థిక లోటంతా రక్షణ రంగంలో ఖర్చు కారణంగానే జరిగింది. ఈ సందర్భంగా అదనపు పన్నులు వేసి వీలైనంత లోటు పూడ్చాం. శాంతిని పునరుద్ధరించేందుకు చర్యలు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి. అయితే దేశ విభజన కారణంగానూ, పంజాబ్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగానూ అవి కొంత మేరకు దెబ్బతిన్నాయి.

మనం కొంత సాధారణ స్థితికి వచ్చిన తర్వాత తప్పకుండా రక్షణ ఖర్చు తగ్గుతుంది. వచ్చే ఏడాది నాటికే మనం సాధారణ స్థితికి చేరుకుంటామని చెప్పటం అతిశయోక్తి కావొచ్చు. అయితే మనం తప్పకుండా 1949-50 నాటికి దీన్ని సాధిస్తాం.

దేశ ఆర్థిక పరిస్థితి గురించి కూడా ఎలాంటి నిరాశావాదం అవసరం లేదు. విభజన కారణంగా నిజంగానే కొంత మనం బలహీనపడ్డాం. అఖండ భారతదేశంలో అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితి కంటే చాలా మెరుగ్గా ఉండేవాళ్లం.

మన దేశ పరిమాణాన్ని బట్టి చూస్తే మన రుణ స్థితి కూడా మెరుగ్గానే ఉంది. అఖండ భారతదేశ అప్పు, వడ్డీ చెల్లింపులు మొత్తం రూ.2531 కోట్లు. విదేశీ నిల్వలు రూ.1600 కోట్లు. వీటిలో పాకిస్తాన్ వాటాను విడగొట్టాల్సి ఉంది.

## భవిష్యత్ సంకల్పం

భారతదేశం ఇప్పుడే బానిసత్వం నుంచి బయటపడింది. ఆసియాలో లీడర్ కావాలన్న తన లక్ష్యాన్ని కనుక భారత్ చేరుకుంటే.. స్వతంత్ర్య దేశాల్లో ముందువరుసలో ఉంటుంది. ఇందుకోసం మనమంతా రాబోయే సంవత్సరాల్లో క్రమశిక్షణతో కూడిన చర్యలు చేపట్టాలి. శాంతి భద్రతల్ని కాపాడేందుకు, ఉత్పత్తిని పెంచేందుకు, అంతర్గత సంఘర్షణలు నివారించేందుకు అంతా సహకరించాలి. ❑

# తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు



- ఎం.కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో లేదా ఇతరచోట్ల ఏ ఇద్దరు తెలుగు వారు కలిసినా, రచ్చబండల మీద జరిగిన, కొనసాగుతున్న చర్చ ఒక్కటే. అది రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సాయం గురించే. ప్రత్యేకించి రాజధాని అమరావతి పట్టణ అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన పదిహేను వేల కోట్ల రూపాయలు రుణమా లేక దానమా (ఆంగ్లంలో గ్రాంట్ అంటే తెలుగులో దానం) అని తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. కొన్ని మీడియా సంస్థల వార్తల్లో, చర్చల సందర్భంగా తెలుగుదేశం నాయకత్వంలోని మూడు పార్టీల కూటమి ప్రతినిధులు దానమే అంటే, కొందరైతే మరొక అడుగు ముందుకు వేసి ఐదేండ్లపాటు ఏటా పదిహేను వేల కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించినందున పండగ చేసుకోవాలని చెప్పారు. కాదన్న వారి మీద మండిపడ్డారు. కొందరైతే విదేశీ సాయంతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే ప్రాజెక్టుల ఖర్చులో కేంద్రం 90 శాతం భరిస్తుందని, కేవలం పది శాతమే రాష్ట్రం పెట్టుకోవాలని చెప్పారు. అంటే పదమూడున్నర వేల కోట్లు కేంద్రమే భరిస్తుందని, పదిహేను వందల కోట్లు రాష్ట్రం పెట్టుకోవాలన్నది వారి వాదన. అదే నిజమనుకున్నా రాష్ట్రానికి కొంత మేలే. రాష్ట్రం కోరుతున్నది తన మీద భారం మోపని సాయం. కేంద్ర మంత్రి చెప్పిన పదాలకు అర్థం రుణం. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో ఉన్న రెండు ఇంజన్ల డ్రైవర్లు ఏది నిజమో చెబితే జనం బుర్రలు బద్దలు కొట్టుకోవాల్సినపని లేదు. చెప్పటానికి సిద్ధంగా ఉన్నారా ?

దీని గురించి స్పష్టంగా చెప్పకుండా చంద్రబాబు నాయుడు తన పరువును, నరేంద్రమోడీ పరువును కాపాడేందుకు పూనుకున్నారు. గతంలో కేంద్రం ప్రత్యేక హెూదా బదులు ప్యాకేజ్ ఇస్తామంటే అదే గొప్పదని చెప్పారు. బీజేపీతో బంధం తెగిన తర్వాత మాట మార్చారు. ఇప్పుడు ఎలాగైతేనేం డబ్బులు వస్తున్నాయిగా అంటున్నారు. తర్వాత ఏమంటారో భవిష్యత్‌కే వదలివేద్దాం. తనదైన శైలిలో చెప్పిందేమిటి ?

**"నిధులు ఎక్కడి నుంచి ఎలా వస్తేనేం రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కేంద్రం ముందు ఆంధ్రప్రదేశ్ ఉంచిన ప్రతిపాదనల్లో అత్యధికాన్ని ఆమోదించింది. రాజధానికి వచ్చే నిధులతో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. దీంతో పన్నుల రూపంలో రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. వాగ్దానం చేసిన నిధులతో రాజధాని నిర్మాణం తిరిగి ప్రారంభమౌతుంది. విదేశీ సంస్థల నుంచి రుణాల రూపంలో వచ్చినప్పటికీ వాటిని 20-30 ఏళ్లల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. వివిధ సంస్థల నుంచి వచ్చే రుణాలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. రాజధాని సహాయ రూపంలో కొన్ని కేంద్ర గ్రాంటులు వస్తాయి.వెనుకబడిన జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా సాయం వచ్చే అవకాశం ఉంది.ఈ పాకేజ్‌లో పారిశ్రామిక సబ్సిడీలు కూడా ఉంటాయి." అన్నారు చంద్రబాబు.**

బడ్జెట్ ప్రసంగం ముగిసిన తరువాత విలేకర్లతో నిర్మలా సీతారామన్ మాట్లాడిన అంశాలు గందరగోళంగా ఉన్నాయి. "రాజధాని నిర్మాణానికి ఈ ఏడాదే ప్రపంచబాంకు నుంచి 15 వేల కోట్ల రుణం తీసుకుంటాం. ఇందు లో రాష్ట్రం వాటాను కూడా భరించాలి. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రం తన వాటాను చెల్లించగలదా లేదా కేంద్రమే గ్రాంటు ఇస్తుందా అన్న విషయాలను రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తాం" అని నిర్మలమ్మ చెప్పారు. ప్రపంచబ్యాంకు నుంచి కేంద్రం రుణం తీసుకుంటే దానిలో రాష్ట్రం భరించాల్సిదేమిటి ? ఇచ్చేది రాష్ట్రానికే అయినపుడు రాష్ట్ర వాటా ఏమిటి ? దీని గురించి రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి ప్రాజెక్టుల రుణాలు తీసుకోవటం కొత్తేమీ కాదు. అవి రాష్ట్రాల్లో అమలు జరిగినా కేంద్రం హామీ ఇవ్వాల్సి ఉంటుంది. నేరుగా రాష్ట్రాలు తీసుకొనేందుకు వీలులేదు. అలా ఇచ్చే రుణాలలో కొన్నింటిలో కొంత గ్రాంట్ కూడా వుంటుంది. బాటా కంపెనీ చెప్పుల ధరలు, వెయ్యో, రెండు వేలో కాకుండా రు.999, 1,999 మాదిరి ఉంటాయి. వినియోగదారుని మానసిక స్థితిని సొమ్ము చేసుకొనే వాణిజ్య చిట్కా ఇది. అలాగే అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే రుణాలకు అనేక షరతులు ఉంటాయి. వాటికి వ్యతిరేకత తలెత్తకుండా ఉండేందుకు అవిచ్చే రుణాల్లో కొంత భాగాన్ని గ్రాంటుగా ఇస్తాయి. చేదు మాత్రను మింగించేందుకు వాటికి

పంచదార పూత పూయటం వంటిదే ఇది. రుణ షరతులను వ్యతిరేకించే వారి నోరు మూయించేందుకు గ్రాంటు భాగాన్ని జనానికి చూపుతారు. అమరావతి స్వయం పోషక నగరమని, దాని నిధులతోనే నిర్మాణం జరుపుతామని గతంలో చంద్రబాబు ప్రకటించారు. కానీ ఆర్థిక మంత్రి విదేశీ సంస్థల నుంచి అప్పు తీసుకుంటామంటున్నారు. ఒకవేళ అదే వాస్తవం అనుకుంటే ఆ అప్పును ఎవరు తీర్చాలి ? కేంద్రం అంటే దేశం మొత్తం కదా ! ఒక రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం చేసే అప్పును దేశం మొత్తం ఎందుకు భరించాలి ? మా రాజధానులను నవీకరిస్తాం, ప్రపంచస్థాయి నగరాలుగా చేస్తాం అప్పు చేసి మాకూ నిధులు ఇవ్వాలి అంటే కేంద్రం అంగీకరిస్తుందా? విదేశీ సంస్థల నుంచి రుణం తీసుకోవాలంటే ముందుగా ఆ సంస్థలకు ప్రాజెక్టు వివరాలను సమర్పించాలి. పర్యావరణం, వాటి అమలుతో నష్టపోయే వారెవరైనా ఉన్నారా, ఉంటే వారికి పరిహారం ఎలా చెల్లించాలి? తీసుకున్న అప్పులను ఎలా తీరుస్తారు ? అందుకు గాను మీ దగ్గర ఉన్న ఆదాయ వనరులు ఏమిటి ? లేకపోతే ఎలా రాబడతారు ? ఇలా అనేక అంశాలను పరిశీలించి షరతులతో కూడిన రుణాలను మంజూరు చేస్తాయి. ఆదాయాన్ని ఎలా రాబట్టాలో వినియోగదారుల ఛార్జీల వంటి సూచనల రూపంలో షరతులు విధిస్తాయి. మనం సాధారణంగా బాంకుల కు అలా వెళ్లి ఇలా అప్పుతెచ్చుకున్నంత సులభంగా విదేశీ సంస్థల అప్పు ఉండదు. అయినప్పటికీ ఇంకా వర్తమాన ఆర్థిక సంవత్సరంలోనే విదేశీ సంస్థల నుంచి రుణం తీసుకొని ఇస్తా మంటూ నిర్మలా సీతారామన్ చెప్పారు. బహుశా నరేంద్రమోడీ గారిని విశ్వ గురువుగా, నేతగా ప్రచారం చేస్తున్నారు గనుక అలాంటి నిబంధనలను పక్కన పెట్టే ప్రత్యేక వెసులుబాటు, వివరాలేమీ లేకుండానే ముందుగానే ఇచ్చే అవకాశం ఉందేమో తెలియదు. ఇంతవరకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ను కేంద్రానికి సమర్పించినట్లు చంద్రబాబు ఎక్కడా ప్రకటించ లేదు. లీకులు కూడా ఇవ్వలేదు. చంద్రబాబునాయుడు 2014-19 మధ్య అధికారంలో ఉన్నపుడు అమరావతి కోసం విదేశీ సంస్థల నుంచి రుణాలు తీసుకొనేందుకు ప్రయత్నాలు చేశారు. వినియోగదారుల దగ్గర రుసుములు వసూలు చేసే షరతులతో ముందుకు వచ్చినప్పటికీ ప్రభుత్వం మారటం, అమరావతిని వదలి వేయటంతో కథ కంచికి చేరింది. ఒకవేళ ఇప్పుడు మరోసారి ప్రయత్నించాలన్నా, పెరిగిన ధరలకు అనుగుణంగా డీపీఆర్‌ను సమర్పించాలి. అలాంటి ప్రక్రియ ఇంత వరకు లేనందున 15 వేల కోట్లు వెంటనే ఎలా వస్తాయన్నది ప్రశ్న.

ఇలాంటి ప్రశ్నలు, సందేహాలను ఎవరైనా లేవనెత్తితే రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవటం లేదనో, వైసీపీ కండువా కప్పు కున్నారనో ఎన్డీఏ కూటమి ఎదురుదాడికి దిగవచ్చు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నిస్తే వైసీపీ వారు అదే ఆరోపణలు చేస్తున్నారు. వాటిని వదలి వేద్దాం.

హిందూ బిజినెస్ లైన్ పత్రికలో 2024 జూలై 18న న్యూఢిల్లీ ప్రతినిధి రాసిన విశ్లేషణ ప్రకారం "రాష్ట్ర పునర్‌నిర్మాణానికి" కేంద్రం నుంచి రాష్ట్రానికి లక్ష కోట్ల రూపాయల సాయం కావాలని చంద్రబాబు నాయుడు కోరారు. అందుకోసం ప్రధాని నరేంద్రమోడీ, అర డజను మంది కేంద్ర మంత్రులు, 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియాను కలిశారు. నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వివరణాత్మక పత్రాన్ని అందజేశారు. కేంద్రం ఎందుకు సాయం చేయాలో కూడా వివరించారు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఉన్న రుణ పరిమితి జీడీపీలో మూడు శాతం నిబంధనను సడలిస్తూ 0.5 శాతం పెంచాలని, అమరావతి నిర్మాణానికి రూ.50 వేల కోట్ల సాయం ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు పన్నెండు వేల కోట్లు ఇవ్వాలని కోరారు. అలాగే దుగ్గరాజపట్నం రేవు నిర్మాణం, రాష్ట్ర మూలధన పెట్టుబడికి ప్రత్యేక పథకం కింద సాయం, బుందేల్‌ఖండ్ పాకేజ్ మాదిరి వెనుకబడిన ప్రాంతాలకు సాయాన్ని, చమురుశుద్ధి కర్మాగారాల ఏర్పాటును కోరారు. కీలకమైన కేంద్ర మంత్రి పదవులు, లోక్‌సభ ఉప సభాపతి పదవిని కోరకుండా ఆర్థిక సాయం మీదే కేంద్రీకరించినట్లు బిజినెస్ లైన్ పత్రిక రాసింది.

**కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత "ఆంధ్రప్రదేశ్‌కు నిర్మల మద్దతు, కానీ నాయుడు కోరిన దానికి చాలా తక్కువ" అనే శీర్షికతో అదే బిజినెస్ లైన్ పత్రిక రాసింది. దానిలోని అంశాల సారం ఇలా ఉంది. కేంద్ర సాయాన్ని ఆశిస్తూ బడ్జెట్‌లో ఏం కేటాయిస్తారో చూసేందుకు గాను చంద్రబాబు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టడాన్ని వాయిదా వేసుకున్నారు. స్థానికంగా వనరులను పెంచేందుకు మార్గాలు వెతకాల్సి ఉంటుంది. 15వ ఆర్థిక సంఘం సూచనను అనుసరిస్తే రాష్ట్ర ప్రభుత్వం పన్నేతర రాబడులను పెంచుకోవాల్సి ఉంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక పాకేజ్ లేదా ప్రత్యేక హోదా ప్రస్తావన లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతానికి బడ్జెట్ పెట్టకుండా సమయాన్ని తీసుకుంది. అయితే చంద్రబాబు లక్ష్యం అంత తేలిక కాదు. రాష్ట్ర ఆదాయంతో పోలిస్తే వడ్డీ చెల్లింపులు గణనీయంగా ఎక్కువగా ఉన్నందున ఆర్థిక పునర్ నిర్మాణం కోసం ఎంతో ఎంతో చేయాల్సి ఉందని పేర్కొన్నారు.**

**మిగతా 19వ పేజీలో**

# చరిత్ర కాల నిర్ణయం

- ఆర్.పి.బహుగుణ

**1వ ప్రశ్న: మధ్యయుగం నాటి భారతచరిత్ర గురించి అవగాహన మీద, చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాల నిర్ణయం గురించి వలసవాదుల పథకం ఏ విధమైన ప్రభావం చూపింది ? ఈ కాలాన్ని "ముస్లింల పాలనా కాలం"గా అభివర్ణించడం పొరపాటా?**

**జవాబు :** 19వ శతాబ్దం ప్రారంభం నుండే వలస వాద చరిత్రకారులు భారత చరిత్రలోని ప్రాచీన కాలాన్ని "హిందూ ఇండియా"గానూ, మధ్యయుగంగా పేర్కొనబడిన కాలాన్ని "మహమ్మదీయుల పాలనా" కాలంగా నిర్ధారించారు. ఈ నిర్ధారణలు సిద్ధాంతకర్తలు, ప్రభావంలో వున్న చరిత్రకారుల మతతత్వ పూరిత లక్ష్యాలకనుగుణంగా వుండడంతో వారు చరిత్రకు సంబంధించిన ఈ కాల నిర్ణయాన్ని స్వీకరించారు. ఉత్తర భారతదేశం మహమ్మదీయుల దురాక్రమణలకు గురై వారి వశం కావడంతో మధ్యయుగం ప్రారంభమైనదన్న వలసవాద చరిత్రకారుల నిర్ధారణల్లోనే నమ్మకముంచింది. 13, 17 శతాబ్దాల మధ్యకాలంలో పరిపాలన సాగించిన సుల్తానేట్ ఆఫ్ ఓమన్, మొఘల్ పాలకులు ఇస్లామ్ అనుయాయులు కావడంతో ఈ కాలాన్ని 'మహమ్మదీయుల పాలనా కాలం'గా భావిస్తోంది. అయినప్పటికీ, మధ్యయుగం నాటి భారత చరిత్రకు సంబంధించిన యీ వివరణలు పూర్తిగా అసత్యాలు. ఈ వివరణలు, వాస్తవాలను వక్రీకరించడంతోపాటు, చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాల నిర్ణయం విషయంలో సంకుచిత అవగాహన మీద ఆధారపడి వున్నాయి. ఈ క్రింది వాస్తవాలు, వాదనలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. పాలకుల మతం ప్రాతిపదిక మీద ఆధారపడి వివిధ ఘటనలకు సంబంధించిన కాలాన్ని నిర్ణయించలేము. కేవలం పాలకుల మతంలో మార్పును బట్టి ఒక దశ నుండి మరొక దశకు పరివర్తన జరగదు. ప్రాచీన భారతాన్ని ఏలిన పాలకులందరూ హిందువులు కారు. వారిలో అత్యంత ప్రసిద్ధి చెందిన అశోకుడు హిందువు కాదు. బౌద్ధ మతస్తుడు. గుప్తుల పాలన తర్వాత 7 నుండి 12వ శతాబ్దం మధ్యకాలంలో ప్రారంభమైన అత్యంత తీవ్రమైన వూహాతీతమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పుల కారణంగానే ప్రాచీన యుగం నుండి మధ్య యుగానికి పరివర్తన జరిగింది. అంతేగాని తురుష్కులు (టర్కీ దేశీయులు) ప్రవేశించిన తర్వాత యీ పరివర్తన సంభవించలేదు. ఈ మార్పుల్లో భాగంగానే ప్రాంతీయ రాజ్యాలు, వివిధ సమాజాలు, సంస్కృతులు అభివృద్ధి చెంది, అనేక ప్రాంతాల్లో పశువుల పెంపకం నుండి వ్యవసాయానికి పరివర్తన సంభవించింది. దీనితోపాటు, వివిధ ప్రాంతీయ రాజ్యాలు, సమాజాల్లో అంతర్గతంగానూ, వాటికి వెలుపల సాగే వర్తక, వాణిజ్యాల్లోనూ, విత్త(డబ్బు) ఆర్థిక వ్యవస్థలోనూ ప్రాధాన్యత సంతరించుకున్న మార్పులు చోటు చేసుకున్నాయి. బౌద్ధం క్రమక్రమంగా క్షీణించి (బ్రాహ్మణ మతం), వైదిక మతం తిరిగి నిలద్రొక్కుకోవడం ప్రారంభమైంది. సరిగ్గా యీ కాలంలోనే భక్తి ఉద్యమం భారతదేశంలో, ప్రధానంగా దక్షిణ భారతంలో నిర్దిష్టమైన రూపు దిద్దుకోవడం ప్రారంభమైంది. భారతదేశంలోకి వర్తకులుగా వచ్చిన అనేక ముస్లిం సమాజాలకు చెందినవారు, సూఫీలు (మహమ్మదీయ మతంలో ఒక శాఖ. వీరు ప్రకృతినే దైవంగా భావిస్తారు). అనేకమంది యాత్రీకులు, భారతదేశంలో హిందూ రాజుల పాలనలో వున్న వివిధ రాజ్యాల్లో శాంతి యుతంగా స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. 11, 12 శతాబ్దాల్లో తురుష్కులు దండయాత్రలు సాగించి దురాక్రమణకు పాల్పడడంతో, అప్పటికే కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, మార్పులను కొత్త పద్ధతుల్లో వేగిరపర్చాయి.

మొఘల్ సామ్రాజ్య స్థాపన భారతదేశ ప్రాచీన చరిత్రలో మరొక దశను సూచిస్తుంది. చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాలాన్ని గుర్తించడంలో పాలకుల మతం ఒక ప్రధాన అంశంగా భావించవల్సి వస్తే, మధ్యయుగం నాటి కాలంలో భారతదేశాన్ని పాలించిన రాజులందరూ ముస్లిం కారనే విషయాన్ని గమనించాల్సిన అవసరం వుంది. ఢిల్లీ సుల్తాన్, వివిధ ప్రాంతాలకు చెందిన సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు ముస్లిం మతస్తులు. కాని, విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులు, వారి వారసులు, అనేక రాజపుత్ర రాజ్యాలను, మరాఠా సిక్కు, జాట్ రాజ్యాలను పరిపాలించిన వారు ముస్లిమేతరులే. అంతేగాక, సైనిక ఘర్షణలు జరిగి పూర్తి అయిన తర్వాత ప్రారంభంలోనే హిందూ పాలక సంపన్న వర్గాలు మొఘులాయి సామ్రాజ్య సుల్తానుల రాజ్యాలు సువ్యస్థితం చేసిన రాజ్య వ్యవస్థలో అంతర్భాగమైపోయాయి.

అక్బర్ పాలనాపగ్గాలు చేపట్టినప్పటి నుండి రాజపుత్రులు మొఘలాయీ పాలక వర్గంలో అవిభాజ్యమైన భాగమయ్యారు. రాజపుత్రుల్లోని ప్రముఖ నాయకులు కొందరు సైనిక, పరిపాలనా వ్యవస్థల్లో అత్యున్నత స్థానాలను అలంకరించారు. అక్బరు పాలన ముగిసే నాటికి 7000 మంది జాట్ల (జాట్ మొగలాయీ సామ్రాజ్యంలోని సైనిక, పాలనా వ్యవస్థలో ఒక హోదా) సంఖ్య పెరగడం కొనసాగింది. ఔరంగజేబు హయాంలో వీరి సంఖ్య అత్యధిక స్థాయికి చేరుతుంది. మొగలాయీల కాలంలో పాలనా వ్యవస్థ నుండి హిందువులను మినహాయించడం జరిగిందని ఆర్.ఎస్.ఎస్ చేస్తున్న ప్రచారానికి భిన్నమైన విధంగా రాజ్య వ్యవస్థలో హిందువులు కొన్ని అత్యున్నత స్థానాల్లో వున్నారు. షాజహాన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొఘలాయీ కులీన వర్గాల్లోకి మరాఠాలు ప్రవేశించడం మొదలైంది. 1595 సంవత్సరం అక్బర్ హయాంలో 500 అంతకుమించిన స్థానాలలోని అత్యున్నత పదవుల్లో వున్న 98 మందిలో 22 మంది హిందువులున్నారు. అంటే మొగలాయీ సైనిక, పాలనా వ్యవస్థలో 22.5 హిందువులు ఉన్నారు. ఔరంగజేబు పాలనా కాలంలోని రెండవ అర్ధ భాగం (1679-1707) 486 అత్యున్నత స్థాయిలోని వారిలో హిందువుల సంఖ్య 105కు అంటే 31.6కి పెరిగింది. గ్రామాలు, ప్రాంతాలు, స్థానిక స్థాయిలో పాలక వర్గంగా వున్న జమిందార్లలో అత్యధికులు హిందువులే.

**2వ ప్రశ్న : మధ్యయుగాల నాటి భారత చరిత్రను హిందూ-ముస్లింల మధ్య ఘర్షణలతో కూడిన కాలంగా ఆర్.ఎస్.ఎస్ చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనంటారా?**

**జవాబు :** ఈ క్రింది కారణాల వల్ల మధ్యయుగంలో హిందూ-ముస్లిం ఘర్షణలను గురించిన ఆర్.ఎస్.ఎస్ చిత్రీకరణ అత్యంత లోపభూయిష్టమైనది : ఆధునిక కాలంలో హిందూ ముస్లింల మధ్య ఘర్షణలకు దారితీసిన చారిత్రక పరిస్థితులు మధ్యయుగాల నాడు నెలకొని ఉండలేదు. రాజపుత్రులు, తురుష్కుల మధ్య - రాజపుత్రులు, మొగలాయిల మధ్య - మొగలాయిలు, మరాఠాల మధ్య - మొగలాయిలు సిక్కుల మధ్య రాజకీయపరమైన ఘర్షణలు జరుగుతుండేవి. అయితే పాలకవర్గాల రాజకీయపరమైన రాజ్య విస్తరణకు సంబంధించిన పేరాసలే ప్రధాన కారణాలుగా ఉన్నాయే గాని, మతం ఏ విధంగానూ గణనీయమైన పాత్ర నిర్వహించలేదు. ముస్లిం మతానికే చెందిన తమ శత్రువులను, తిరుగుబాటు దారులను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో సుల్తానులు గాని, మొగలాయిలు కాని ఎవరూ తీసిపోలేదు. ముస్లిం పాలకులైన బీజాపూర్, గోల్కొండ సుల్తానుల రాజ్యాలను ఔరంగజేబు తన రాజ్యంలో కలుపుకునేందుకు సాగించిన యుద్ధమే ఇందుకు తార్కాణం. ప్రారంభంలో సాగిన రాజకీయ, సైనిక ఘర్షణలు రాజకీయంగా ఏకీకరణకు, సహకారానికి దారితీశాయి. తుగ్లక్ హయాం నుండి హిందూ నాయకులను సుల్తానుల పాలకవర్గాల్లో చేర్చుకోవడం ప్రారంభమైంది. రాజపుత్ర వంశాలకు చెందిన అనేకమంది ప్రముఖులు ప్రాంతీయంగా వున్న సుల్తానులు పాలక వర్గాల్లో ఉండి ప్రధాన పదవుల్లో వున్నారు. దక్కన్ రాజ్యాల్లో సైనిక, పాలనాపరమైన పదవుల్లో మరాఠాలను నియమించటం జరిగింది. మొగలాయి రాజ్యాన్ని మొగలాయి, రాజపుత్రుల పాలకవర్గాల కలయికగా పేర్కొన దగిన స్థాయిలో రాజపుత్రులు, మొగలాయి పాలకవర్గంలో ఒక ప్రధాన భాగమయ్యారు. పాలకవర్గ స్థాయిలో హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ, సహకారాలు రెండింటికీ సంబంధించిన అనేక సందర్భాలు చరిత్రలో కనిపిస్తాయి. ఇది రాజకీయ, సైనికపరమైన కారణాల వల్ల సంభవించినదే. అయితే రైతాంగం, వృత్తిదారులతో సహా సాధారణ ప్రజలకు సంబంధించినంత వరకూ హిందువులు, ముస్లింలనే బేధభావం లేనే లేదు. అందువలన హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ అనే ప్రశ్నే తలెత్తదు. ఈ విధంగా మతపరమైన విభేదాలు కేవలం ఆధునిక కాలంలోనే, సర్వసాధారణమై, పరివ్యాప్తమై పెద్దఎత్తున మతఘర్షణలు సంభవించే అవకాశాలు కల్పించాయి. మధ్య యుగంలో అనేక మంది హిందూ పాలకులు పాలనాపరమైన విషయాలు, రెవెన్యూ విధానాల్లో సుల్తానులు, మొగలాయిలనే అనుసరించారు. దాదాపు హిందూ పాలకులందరూ రాజ ఆస్థాన సంస్కృతి, సాంప్రదాయాలను పర్షియన్, ఇస్లామిక్ పాలకులను గురించిన విధానాల ప్రాతిపదికనే రూపొందించుకున్నారు. వేరొక ప్రక్క మొగలాయీ చక్రవర్తులు భారతదేశంలో అమలు జరుగుతున్న అనేక సాంప్రదాయాలను, చిహ్నాలను, క్రతువులను తమ,రాజ్య వ్యవస్థలోనూ, రాజకీయ సంస్కృతిలోనూ వ్యవస్థాగతం చేశారు.

**3వ ప్రశ్న : మధ్యయుగాలలో భారతదేశంలో హిందువుల మీద ముస్లింలు దాడులను, సాగించినట్లు హిందువులు వంచించబడినట్లు చిత్రీకరించడం ఆర్.ఎస్.ఎస్ వారి తప్పెలా అవుతోంది?**

జవాబు : ఈ క్రింది కారణాల వల్ల ఇది వాస్తవాల మీద ఆధారపడిన అవగాహన కాదు : దేవాలయాల విధ్వంసానికి

సంబంధించి చూస్తే, కొందరు సుల్తానులు, మొగలాయీ పాలకులు తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్న వారి ఆధీనంలోని ప్రాంతాల్లోని దేవాలయాల విచ్ఛిన్నానికి, విధ్వంసానికి పూనుకున్నారనేది వాస్తవం. ప్రధానంగా వారి శత్రువుల పోషణలో వుండడంతోపాటు, రాజకీయంగానూ, కొన్ని అంశాలకు ప్రతీకగా వుండి ప్రాధాన్యత సంతరించుకున్న దేవాలయాలను వీరు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఔరంగజేబుతో సహా మొగలాయీ చక్రవర్తులు అనేక దేవాలయాలకు పోషణ కల్పించి, అర్చకులకు ఆర్థిక సహాయమందించిన సందర్భాలు అనేకం వున్నాయి.

బ్రజ్ ప్రాంతంలో అనేక దేవాలయాలు మొగలాయీలు మహా రాజ పోషకులుగా వున్నట్లు పెద్దసంఖ్యలో డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలున్నాయి. వైష్ణవ, నాథ సాంప్రదాయాలు (శివునికి సంబంధించిన) పాటించే అనేక దేవాలయాలను మొగలాయీ పాలకులు పోషించారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌లో వున్న విఠల్ ప్రభు దేవాలయాన్ని బీజపూర్ సుల్తానులు పోషించారు. దేవాలయాలను అపవిత్రం చేయడం, విధ్వంసం చేయడం చాలా సంక్లిష్టమైన విషయం. ఇది కేవలం ముస్లిం పాలకుల హిందూ వ్యతిరేక వైఖరి వల్ల మాత్రమే సంభవించిందని చెప్పడం సాధ్యం కాదు. ఉత్తర భారతంలో కొన్ని ప్రాముఖ్యత గల్గిన దేవాలయాలను విధ్వంసం చేసిన ఔరంగజేబు, తన పాలనా కాలంలో 26 సంవత్సరాలు గడిపిన దక్కన్ (దక్కన్ పీఠభూమి ప్రాంతం దక్షిణ, మధ్య భారతంలోని అత్యధిక ప్రాంతం), దక్షిణ భారతంలోనూ ఈ పద్ధతిననుసరించలేదు. ఆ ప్రాంతంలోని దాదాపు అన్ని దేవాలయాలు ఇప్పటికీ యథాతథంగా ఉన్నాయి. అలహాబాద్‌లోని సోమేశ్వరనాథ మహదేవ్ దేవాలయం, వారణాసిలోని జన్గామ్ బాడి శివ దేవాలయం, గౌహతిలోని ఉమానంద్ దేవాలయాలకు ఔరంగజేబు నిధులు మంజూరు చేసినట్లు నిరూపించేందుకు అనేక సాక్ష్యాధారాలున్నాయి. ఒక ప్రక్క దేవాలయాలను ధ్వంసం చేస్తూ, వేరొకపక్క కొన్ని దేవాలయాలకు నిధులు మంజూరు చేయడం చూస్తే. దీనిలో మతపరమైన ప్రేరణతో కూడిన దృక్పథంకంటే సంకుచిత రాజకీయాలే ప్రధానపాత్ర వహించాయని స్పష్టమవుతుంది. ఫిరోజ్ తుగ్లక్ పాలనా కాలానికి ముందు కాలంలో ఢిల్లీ సుల్తానులు ముస్లిమేతరుల మీద జిజియా పన్ను విధించారనడానికి పెద్దగా సాక్ష్యాధారాలు లేవు. చివరకు క్రీ.శ. 1579లో అక్బర్ జిజియా పన్ను రద్దు చేశాడు. క్రీ.శ. 1679లో ఔరంగజేబు తిరిగి ఈ పన్ను విధించాడు. అంటే ఔరంగజేబు పాలనాకాలంలోని మొదటి 22 సంవత్సరాల కాలంలో ఈ పన్ను విధించబడలేదు. ఔరంగజేబు పాలనా ముగిసిన తర్వాత ఈ పన్ను రద్దు చేయబడింది. తిరిగి ఈ పన్నునెవరూ విధించలేదు. బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్పిడులకు సంబంధించి అత్యంత శ్రద్ధగా పరిశోధనలు సాగించిన చరిత్రకారులందరూ, ఇవి చాలా స్వల్ప సంఖ్యలో వున్నాయని నేడు అంగీకరిస్తున్నారు. దాదాపు అందరు ముస్లిం పాలకులు, ఉన్నత పదవుల్లో వున్నవారు హిందువులను బలవంతంగా ముస్లిం మతంలోకి మార్చడం జరిగిందనేది అసత్యం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో "ఇస్లామీకరణ" క్రమానికి గురైన పెద్ద సంఖ్యలోని రైతాంగం, చేతివృత్తుల వారు, ఆధునిక కాలంలో ఉపయోగిస్తున్న పరిభాషలో "హిందువులు" కారు, చివరకు ముస్లింలయిన వారందరు. మొదట్లో హిందువులేననే వాదన సరికాదు. అందువల్ల "మతం మార్పిడి" అనడంకంటే, "ఇస్లామీకరణ" అని పేర్కొనడం సమంజసంగా వుంటుంది. "ఇస్లామీకరణ" రాజ్యం ప్రేరణతో జరిగినది కాదు. అనేక సంక్లిష్ట సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాలకారణంగా క్రమక్రమంగా నెమ్మదిగా ఇస్లాం మతంలోకి సాగిన సాంస్కృతికీకరణ ఫలితంగా సంభవించిందే. ఈ పరివర్తనలో భాగంగానే పశు పాలన సాగించే గిరిజన తెగల వారు రైతాంగంగా పరివర్తన చెందడం ఒక అంశం. ఈ పరివర్తన జరిగే సుదీర్ఘ క్రమంలో భక్తి ఉద్యమం ప్రభావితంలోకి వచ్చిన ప్రాంతాలు, తెగలవారు "హిందువులు"గానూ, సూఫీ, తదితర ముస్లిం దేవాలయాలు ప్రభావంలో వున్న వారు "ముస్లిం"గానూ వున్నారు. భారత చరిత్రలో మధ్యయుగానికి చెందిన కాలన్ని "ఇస్లామీకరణ" జరిగిన కాలంగా కంటే, "హైందవీకరణ" జరిగిన కాలంగా పరిగణించాలి. పంజాబ్, బెంగాల్‌తోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో ముస్లిం రైతాంగ ప్రజా సమూహాలు అభివృద్ధి చెందిన చారిత్రక క్రమాన్ని ఈ విధంగా వివరించవచ్చు.

ఈ మత మార్పిడుల్లో అణచివేత స్వభావం గల్గిన వర్ణవ్యవస్థ పాత్రను తక్కువ చేసి చూడరాదు. రైతాంగం, చేతి వృత్తులకు చెందిన వారిలో అత్యధిక సంఖ్యాకులు కులపరమైన తీవ్ర అణచివేతకు గురవుతున్న తక్కువ కులాలుగా చెప్పబడుతున్న కులాలకు చెంది ఉన్నారు. కనీసం సూత్రప్రాయంగానైనా వివిధ విశ్వాసాలు గల్గిన వారి మధ్య తారతమ్యాలు చూపని ఇస్లాం వైపునకు వీరు ఆకర్షితులవడం ఆశ్చర్యకరమైన విషయం కాదు. రైతాంగం, చేతి వృత్తుల వారు తమ మతంతో నిమిత్తం లేకుండా ఒకే విధంగా దోపిడీకి గురయ్యారు. ముస్లిం మతానికి చెందిన రైతాంగం, చేతి వృత్తుల వారు కూడా ప్రభుత్వానికి, జాగీర్దారులు నుండి జమీందారులు, చౌదరీలు అని పిలువబడే గ్రామ పెద్దల వరకు భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన వివిధ స్థాయిల్లోని వారికి, హిందువులవలెనే ఒకే విధమైన భూమి శిస్తు తదితర పన్నులను చెల్లించవల్సి వుండేది.

**తొలికాలం నాటి రాజపుత్ర రాజ్యాలు మరియు తరువాతి కాలంలోని రాజపుత్ర రాజ్యాలు :**

చోళ చక్రవర్తులు, వారి తర్వాత వచ్చిన పాలకులు, ఢిల్లీ సుల్తానులు వారి వారసులు, విజయనగర సామ్రాజ్యాన్ని, మొఘల్ సామ్రాజ్యాన్ని, మరాఠా, సిక్కు, జాట్ రాజ్యాల పాలకులు రైతాంగం నుండి అదనపు ఉత్పత్తులు కైంకర్యం చేసుకునేందుకు బహిరంగంగానే సైనిక బలగాలను వినియోగించడం మధ్య యుగాలనాటి భారతదేశంలోని రాజ్యాల్లో నిత్యకృత్యమైంది. పాలకులు హిందువులైనా, ముస్లింలైనా వారి రాజ్యాలు మాత్రం ఉదార స్వభావం కల్గిన లేదా సంక్షేమ రాజ్యాలు కావు. మధ్యయుగాలనాటి భారత సమాజంలో నెలకొన్న వైరుధ్యాలు హిందువులు, ముస్లింల మధ్యగాక, అదనపు ఉత్పత్తులను లాగివేసుకునే హిందూ, ముస్లిం పాలకవర్గాలు (మతపెద్దల మద్దతుతో), అణచివేతకు గురవుతున్న కష్ట జీవులైన రైతాంగం, వృత్తిదారుల మధ్య నెలకొని వున్నాయి. పాలకులు హిందువులైనా, ముస్లింలైనా పాలకులు సాగించిన అణచివేత చర్యలకు బలైంది రైతాంగం, చేతి వృత్తుల వారే.

ప్రచారం చేస్తున్న "హిందువుల బలిదానం" అనేది వారి మతపరమైన ఆలోచనల్లో భాగమే గాని, అది చారిత్రక వాస్తవాల మీద ఆధారపడినది కాదు. పైన పేర్కొన్నట్లు మొగలాయీ పాలన వల్ల ప్రయోజనం పొందిన అనేక హిందూ పాలక గ్రూపులు మొగలాయీ సామ్రాజ్యాన్ని పటిష్టం చేయడానికి చురుకైన పాత్ర నిర్వహించాయి.

1576లో హాల్దీ ఘాటీ వద్ద రాణాప్రతాప్‌కు వ్యతిరేకంగా పోరాడిన సైన్యానికి అంబర్‌కు చెందిన రాజామాన్ సింగ్ నాయకత్వం వహించారు. అక్బర్ హయాంలో బృందావనంలో కృష్ణ దేవాలయం నిర్మించడానికి రాజామాన్ సింగ్ ప్రధాన బాధ్యత వహించాడు. హాల్దీ ఘాటీ యుద్ధంలో పరాజయం పాలైన రాణాప్రతాప్ తన జీవితంలో చివరి 20 సంవత్సరాల కాలంలో ఆరావళీ పర్వతాలు, పరిసరాల్లోని అడవుల్లో వుంటూ మొగలాయీల అధికారాన్ని ప్రతిఘటిస్తుండగా, వేరొక ప్రక్క తన హయాంలో అత్యంత శక్తివంతమైన హిందూ నాయకునిగా ఎదిగిన మొగలాయీ నోబుల్ (ఉన్నత పదవిలో వున్నవాడు). సైనిక జనరల్ రాజామాన్ సింగ్ వైష్ణవ మత ప్రబోధకులకు, వైష్ణవ దేవాలయాలకు అందించిన ప్రోత్సాహం సమకాలీన మహా పురుషుల జీవితాల్లో కీర్తించబడడం ఒక ప్రధాన చర్చనీయాంశమైంది. అనేకమంది రాజపుత్రులు వారి చరిత్రలను వారి వీరోచిత కార్యాలను కీర్తించిన కవులు, గాయకులు, హార్దీ ఘాటీయ యుద్ధాన్ని కచ్వా, సిసోడియా వంశాలకు చెందిన రాజపుత్ర రాజ్యాల మధ్య ఘర్షణగా మాత్రమే చూడడం జరిగింది. ఆ కాలం నాటి రాజపుత్రుల రాజకీయ సంస్కృతి హోదాలు, శౌర్య పరాక్రమాలు, మాతృభూమితో వున్న అనుబంధం, విధేయతల మీద ఆధారపడి వుంది. ముస్లిం రాజులకు రాజపుత్రులకు మధ్య జరిగిన ఘర్షణలతోపాటు, వారి మధ్య నెలకొన్న సహకారాన్ని, వైవాహిక సంబంధాలను, ఈ సాంస్కృతిక విలువల ప్రాతిపదికన నిర్ధారించాల్సి వుంది. హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ, సహకారాలకు సంబంధించిన అంశాలను నిర్ధారించడంలో మతం ప్రధాన పాత్ర నిర్వహించలేదు. ఔరంగజేబు పాలనలో అంబర్ రాజు మీర్జా రాజా జైసింగ్ దక్కన్‌కు గవర్నర్ గాను, శివాజీకి వ్యతిరేకంగా పోరాడిన మొగలాయీ సైన్యాలకు అధిపతిగానూ వ్యవహరించాడు. గుజరాత్, మాళ్వాలకు గవర్నర్ గానూ, వాయవ్య సరిహద్దు ప్రాంతంలో మొగలాయీ సైన్యాలకు అధిపతిగా వ్యవహరించిన రాజా జస్వంత్ సింగ్ ఆయనకు సహాయంగా నిలిచాడు.

అసలు "ముస్లింల పాలన"కు బలికావడం మాట అటుంచి, అనేక మంది హిందూ మత పెద్దలు, హిందూ పాలక వర్గ గ్రూపులు మొగలాయీల పాలనలో బాగా అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు, మొగలాయీ సామ్రాజ్యానికి గుండెకాయవలె కీలకమైన బ్రజ్, అవధ్ ప్రాంతాలు, వైష్ణవ భక్తి ఉద్యమానికి కేంద్రాలయ్యాయి.

### 4వ ప్రశ్న: మధ్యయుగాల నాటి కాలాన్ని, 'విదేశీ' ముస్లిం పాలకుల పదఘట్టనల క్రింద హైందవ సంస్కృతి పతనమైన 'చీకటి' కాలంగా అభివర్ణించడంలో ఆర్.ఎస్.ఎస్ తప్పేంటి?

జవాబు : సిద్ధాంతకర్తలు చరిత్ర రచనకు వలసవాదుల ఆలోచనా విధానం మీద ఎక్కువగా ఆధారపడిన సిద్ధాంత కర్తలు, మధ్యయుగాల నాటి భారతంలో సమ్మిళిత సంస్కృతి, మతపరమైన అంశాల మీద ఏకాభిప్రాయం, మతసామరస్యం వర్ధిల్లినట్లు విస్తృత పరిధిలో అందుబాటులో వున్న అనేక విధాలైన సాక్ష్యాధారాలను ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెడుతున్నారు. ఈ విషయంలో చరిత్రను వక్రీకరించే ఆలోచనా విధానం, వారి అజ్ఞానాన్ని ఈ క్రింది వాస్తవాలను పరిశీలించడం ద్వారా స్పష్టంగా అర్ధంచేసుకోవచ్చు.

జాతీయతకు సంబంధించిన ఆధునిక ఆలోచనా విధానం ప్రాతిపదికన విభజింపబడిన నేటి ప్రపంచానికి భిన్నమైన విధంగా, ఆధునిక భారతదేశ ముందు కాలానికి దేశ, విదేశీ అనే పదాలకు సంబంధించిన అభిప్రాయము పూర్తిగా భిన్నంగా ఉండేవి. దండయాత్రలు, సైనిక దురాక్రమణలు, హింసాయుతమైన ప్రాంతీయ ఘర్షణలు, ప్రాంతీయ, స్థానిక గుర్తింపుకు సంబంధించిన ఆకాంక్షల పెరుగుదల, రాజ్యాలు, సామ్రాజ్యాలు

ఏర్పాటు చేయడం, వాటిని రద్దు చేయడం, రవాణా, సమాచార వ్యవస్థల ఏర్పాటు తదితర పరిణామాలు ఒక ప్రాంతానికి సంబంధించిన అభిప్రాయాలు లేదా ఆలోచనలు నిరంతరం మార్పులకు గురై, తిరిగి రూపుదిద్దుకున్నాయి. దేశభక్తి యుతమైన భావనలు వివిధ పద్ధతుల్లో వుండేవి. అయితే అది ప్రస్తుతమున్న (ఆధునిక కాలానికి సంబంధించిన జాతీయతా వాదంతో కూడిన పద్ధతుల్లో మాత్రం కాదు. అరబ్బులు, తురుష్కులు, (టర్కీ దేశీయులు), మంగోలియన్లు, ఆఫ్ఘన్లు, మొఘలాయిలు వివిధ సమయాల్లో వర్తకులుగానూ, యాత్రీకులుగానూ, సూఫీలు, మేధావులుగానూ, వృత్తి నిపుణులుగానూ, ప్రధానంగా దురాక్రమణ దారులుగా మన దేశంలో ప్రవేశించారు. ఈ దండయాత్రలను, తీవ్ర పరివర్తనలకు గురవుతున్న సమాజాలకు చెందిన మధ్య ఆసియా గిరిజన ప్రజల హింసాపూరిత వలసలుగా కూడా పరిగణించవచ్చు. వీరు ఒకసారి భూమి మీద స్థిరపడి, ఈ గడ్డను తమ నివాసంగా ఏర్పరచుకున్న తరువాత వారిని విదేశీయులుగా పరిగణించడం జరగలేదు. రాజకీయ, సైనిక ఘర్షణలు జరుగుతున్న ఈ కాలంలోనే ప్రత్యర్థుల మధ్య ప్రతికూల విశ్వాసాలు అభివృద్ధి చెందాయి. ప్రశాంతత నెలకొనివున్న కాలంలో భారత సంపన్న పాలకవర్గాలు, రాజాస్థానాల్లో వుండే కవులు, రచయితలు (court writers) ముస్లిం రాజులకు చేసే విజ్ఞాపనలు అందరికీ ఆమోద యోగ్యంగా వుండేవి. ముస్లిం పాలకులు, ముస్లిం గ్రూపులు కూడ క్రమక్రమంగా భారత సాంప్రదాయాలను, భాషలను, సాంస్కృతికపరమైన ఆచారాలను పాటించడం జరిగింది. మతం, కళలు, శిల్ప శాస్త్రం, భాష, సాహిత్యం, న్యాయ విచారణ నిర్వహించే సంస్కృతి వంటి విషయాల్లో క్రమానుగతంగా వివిధ సంస్కృతులు ఒక దాని మీద మరొకటి ప్రభావం చూపించడం పెరిగింది. తురుష్కుల పాలన కాలం (సుల్తానేట్) నాటి అనేక సంస్కృత రచనల్లో ఆ నాడు పరిపాలన సాగించిన సుల్తానుల మీద ప్రశంసల వర్షం కురిపించడం జరిగింది. సంస్కృతంలోనూ, స్థానిక భాషల్లో చేయబడిన రచనల్లోనూ, మధ్య యుగాలనాటి ముస్లిం పాలకులను బ్రాహ్మణ మతానికి చెందిన దేవుళ్ళతో సమానంగా పరిగణించిన సందర్భాలు అనేకం వున్నాయి. వేరొక పక్క, దాదాపుగా తుగ్లకీ పాలనా కాలంనాటి నుండి వివిధ మతాలకు చెందిన పరస్పర చర్చలకు సంబంధించిన ఉదాహరణలు అనేకం మనం చూస్తాం.

మహమ్మద్ తుగ్లక్ సుల్తాన్ (1325-1351) హోలీ ఉత్సవాల్లో పాల్గొనడమేగాక, జైన్ సాధువులతోనూ, నాథంతి యోగులతోనూ మతపరమైన చర్చల్లో పాల్గొన్నాడు. ప్రాంతీయ సుల్తానులు, మొగలాయీల పాలనా కాలంలో ఈ విధమైన చర్చలు మరింత ఎక్కువగా సాగాయి. ప్రముఖ కవి అమీర్ ఖుస్రూ రచించిన "నూసిఫిర్"అనే తన గ్రంథంలో భారత దేశాన్ని, ఈ దేశంలోని వాతావరణాన్ని, వివిధ భాషలను ప్రత్యేకంగా సంస్కృత భాషను, ఈ దేశంలోని ప్రజలను, చివరకు జంతువులను ప్రశంసించడం ద్వారా తన దేశభక్తిని వెల్లడించుకున్నాడు. భారతదేశంలో నివశించే ప్రజలను ఉద్దేశించి "హిందూ" అనే మాట ఉపయోగించడం అరబ్బులు, ఇరానీయులు ఇచ్చిన బహుమతి అనే విషయాన్ని ఇక్కడ పేర్కొనవలసి వుంది. మొట్టమొదటగా వారే ఈ ప్రాంతంలో నివసించే ప్రజలను హిందువులని పేర్కొన్నారు. ఆ తర్వాత క్రమంగా ప్రప్రథమంగా రాజపుత్రులు, ప్రాంతీయ ముస్లిమేతర పాలకులు, ఆ తర్వాత అగ్రకులాలకు చెందినవారు తమను తాము హిందువులుగా పిలుచుకున్నారు. హిందూ, ముస్లిం పాలకవర్గాల మధ్య సాంస్కృతికపరమైన సంబంధాలు నెలకొనకుండా ఇది సాధ్యమయ్యేది కాదు. సుల్తానుల పాలనా కాలంలో శిల్ప కళ, సంగీతం, సాహిత్యాల్లో పరస్పరం ఆమోద యోగ్యమయ్యే పోకడలు ప్రారంభమై, ప్రాంతీయ సుల్తానులు, మొగలాయీల హయాంలో మరింత ప్రస్ఫుటమయ్యాయి. సంగీతంలో ఈ పోకడలకు అమీర్‌ఖుస్రూ నాంది పలికాడు. ప్రారంభకాలంలో నాటి చిష్టీ సూఫీయిజం (ఇది ఇస్లాంలోని ఒక సాంప్రదాయంను ఆఫ్ఘనిస్థాన్లోని హెరాన్కు సమీపంలోని చిష్టీ అనే ఒక చిన్న పట్టణంలో మొయినుద్దీన్ చిష్టీ ప్రారంభించాడు. ఇది ప్రేమ, సహసం, నిష్కపటత్వానికి ప్రాధాన్యత ఇస్తుంది. పాటలు, వాద్య సంగీతం, నృత్యం, పద్య పతనం, ప్రార్థనలతో కూడిన 'సామా' లేదా సంగీత సమ్మేళనాలు భారతీయ సాంఘిక జీవనంలో పరిఢవిల్లాయి.

సుల్తాన్‌ల పాలన చివరి కాలంలో సంస్కృత రచనలను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అక్బర్ తర్జుమా చేయడానికి ఏకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేసి, మహా భారతంతో సహా అనేక సంస్కృత రచనలను పర్షియన్ భాషలోకి అనువదింపజేశాడు. అబుల్ ఫజల్ ఐన్-ఇ-అక్బర్ అనే తన రచనలో అధిక హిందూ మతం పట్ల సానుకూల భావనతోనూ, నిష్పాక్షిక దృష్టితోనూ హిందూమతం గురించి వివరించేందుకు కేటాయించాడు. మొగలాయీల హయాంలో ఉర్దూ భాష అభివృద్ధి చెందడం సాంస్కృతిక సమ్మేళనానికి ఒక చక్కని ఉదాహరణ. చివరిదే కాని, అత్యంత ముఖ్యమైన విషయమేమిటంటే, హిందువులు, ముస్లింల మధ్య సంబంధాల్లో మతపరమైన విషయాల్లో ఏకీభావం ఒక ప్రధాన లక్షణం. సూఫీ, భక్తి ఉద్యమాలు పరస్పరం ఒకదానినొకటి బలపర్చుకుంటూ, ఉమ్మడి అభిప్రాయాలకు వస్తూండేవి. సూఫీ ప్రార్థనాలయాలు హిందువులు, ముస్లింలు ఇరువురిని ఆకర్షిస్తుండేవి.

వేరొకపక్క గోగాచౌహాన్ వంటి గ్రామ దేవతలు గూగాపీర్ వంటి పేర్లతో పూజలందుకుంటున్నారు. అనేక మంది సూఫీలు నాథంధీ, యోగులతోనూ, సాధు సంతులు, వైష్ణవులతోనూ సంబంధాలు కలిగి వున్నారు. హైందవీ సూఫీ ప్రణయగాథల రచయితలు తమ భావాలను వ్యాప్తి చేసేందుకు స్థానిక భాషలను, స్థానిక ఇతివృత్తాలను, మతపరమైన కల్పిత గాథలను ఎంపిక చేసుకున్నారు. (వివిధ మతాలకు చెందిన ప్రజల మధ్య శాంతి యుత, సుహృద్భావ సంబంధాలు ఉండాలని ప్రభోదించే) సుర్ఫ్-ఇన్-కుల్ అనే అక్బర్ భావనలు, ఇస్లాం మతంలోని భావ వాదాన్ని ఉపనిషత్తులలోని తత్వ జ్ఞానాన్ని సమ్మిళితం చేసి, అభివృద్ధి చేసేందుకు దారాషికో చేసిన ప్రయత్నాలు, మతపరంగా ఒక సమ్మిళిత సంస్కృతిని అభివృద్ధి చేయడంలో విశేషంగా తోడ్పడ్డాయి. ఈ చారిత్రక పంథాను తుడిచిపెట్టాలని నేడు ఆర్.ఎస్.ఎస్ కోరుకుంటోంది. ❑

వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్. ప్రొఫెసర్ పి.గోపీనాథ్. బి.జె.పి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత సాంస్కృతిక బహుళత్వం, సమానత్వం, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణను పెంపొందించేందుకు స్థాపించబడిన వివిధ సంస్థలను, ఒక పద్ధతి ప్రకారం లక్ష్యం చేసుకుని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. జాతి రాజ్యం ప్రకటించుకున్న లక్ష్యాలను సాధించడంలో ఈ జాతీయ సంస్థలు ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వం ఈ సంస్థలను ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్ దురభిమాన పూరిత లక్ష్యాల సాధనకు, తోడ్పాటు చేసుకోవాలని చూస్తున్నది.

# తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు

(13వ పేజీ తరువాయి)

బడ్జెట్ కేటాయింపులను పరిశీలించే పేరుతో కొద్ది రోజులు కాలయాపన చేయవచ్చు. కేంద్రం నుంచి ఆశించిన సాయం, దాని గురించి తెలుగుదేశం పార్టీ, జనసేన జనంలో పెద్ద ఎత్తున ఆశలు కలిగించాయి. సూపర్‌సిక్స్ పేరుతో చేసిన వాగ్దానాలను బీజేపీ ఆమోదించి ఉంటే ఉమ్మడి ఎన్నికల ప్రణాళికలో దాని పేరు ఉండేది. ఆంధ్రప్రదేశ్‌కు చేసిన అన్యాయం గురించి 2014-19 మధ్య బీజేపీతో కలసి కాపురం చేసినంత కాలం చంద్రబాబు సానుకూలంగా మాట్లాడారు తప్ప జనాలకు వివరాలు చెప్పలేదు. ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్న తరువాతే గళమెత్తి, ఢిల్లీలో నిరసనలు, తరువాత 2019 ఎన్నికలకు ముందు శ్వేత పత్రాలను ప్రకటించారు. జనం వాటిని నమ్మలేదు. చిత్తుగా ఓడించారు. వైసిపిని గెలిపించారు. ఆ పార్టీ అనుసరించిన వైఖరితో విసిగిపోయి చారిత్రాత్మక స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించారు. రాష్ట్రం ఉన్న స్థితి గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పటి మాదిరి గుండెలు బాదుకుంటే, వైసీపీ మీద విమర్శలను గుప్పిస్తే కుదరదు. కేంద్ర సాయం గురించి తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయాలంటే అధికారానికి వచ్చిన తరువాత కేంద్రాన్ని ఏ ఏ రంగాలలో ఎంత సాయం చేయాలని కోరారు ? తాజా బడ్జెట్‌లో వాటిలో ఏ మేరకు వచ్చింది అనే అంశాలను జనానికి అర్థమయ్యే రీతిలో ఒక శ్వేతపత్రం ద్వారా ప్రకటించి పరిస్థితిని వివరించాలి. అందుకు చంద్రబాబు సిద్దపడతారా ? ❑

# వికసించని మన పారిశ్రామిక భారతం!

(9వ పేజీ తరువాయి)

లక్షణం భారత వ్యాపారవర్గానికి వారసత్వంగా రావటం వల్ల కూడా పారిశ్రామిక రంగంలో పురోగతి సాధించలేకపోయా మని సుమిత్ పేర్కొన్నారు. ఇక రాజకీయ వర్గంతోపాటు అధికారవర్గమూ ఆశ్రిత పెట్టుబడిదారులకు అండదండలు అందించింది. దీంతో పోటీతత్వం దెబ్బతిని పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని పెరగనీయకుండా చేసింది. పరిశ్రమల ప్రారంభానికి కఠినమైన రీతిలో లైసెన్స్, పర్మిట్ వ్యవస్థను అమలు పరచటం, ఉత్పత్తులకు కోటాలను ప్రభుత్వమే కతో రంగా నిర్ణయించటంతో 1991కు ముందు పారిశ్రామిక రంగంలో నిజమైన పోటీలేకుండా చేసింది. ఆర్థిక సంస్కరణల అనంతరం ఆ పరిస్థితిలో కొంత మార్పు వచ్చినా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి అనుచిత లబ్ధినిపొందటం ఇంకా సాగుతూనే ఉంది.

**75 ఏళ్ల చరిత్రను చూస్తే వికసిత భారత్ సాకారం కావటం అనేక సవాళ్లతో కూడినదిగా స్పష్టమవుతుంది. ఉత్పాదక సామర్థ్యానికి అడ్డుగా నిలుస్తున్న ఎన్నో జాడ్యాలను వదిలించుకోవాలి. పారిశ్రామిక, సమాచార సాంకేతిక విజ్ఞానంలో సొంతముద్రను వేయగలగాలి. గతమంతా ఘనమనుకునే సంకుచిత ధోరణికి స్వస్తిపలకాలి. బహుళ సంస్కృతుల సమాజాన్ని నిత్యం భయపెట్టే ఉన్మాద రాజకీయాలకు వీడ్కోలు చెప్పాలి.** ❑

# ప్రజాస్వామ్య బహుళత్వం వ్యవస్థ - ప్రత్యామ్నాయ రాజకీయం



- మందలపర్తి కిశోర్

## చర్చనీయాంశం - ఓ పరిచయం!

"బహుళత్వం, ప్రజాస్వామ్యం - హిందుత్వ సాంస్కృతిక దాడి : ప్రత్యామ్నాయ రాజకీయం" అనే విషయాల గురించి ఇవాళ చర్చిద్దాం.


**ఇందులో మూడు విషయాలున్నాయి - మొదటి రెండూ పరస్పరం ముడిపడి వున్నవి. మూడో విషయం ఈ రెండింటికీ సంబంధం లేనిది కాదు - కానీ, దాని గురించి వేరే చర్చిద్దాం!**

బహుళత్వం అనేది రంగూ రుచీ - వాసనా లేని పరబ్రహ్మ స్వరూపం కాదు. నిత్యజీవనంలో మనకి ఎదురయ్యే బహుళత్వానికి ఎక్కడికక్కడ నిర్దిష్ట విశిష్ట స్వరూపస్వభావాలు ఏర్పడతాయి. అవి కొన్ని సామాన్య లక్షణాలను కూడా సంతరించుకున్నమాట నిజం. రాజనీతి శాస్త్రంలో బహుళత్వానికి చెప్పిన నిర్వచనాలు కొన్నిటిని ముందు ముందు చూద్దాం. వాస్తవానికి, ఆధునిక ప్రజాస్వామ్యం అనేది ఓ జీవన విధానం!

ఆ జీవన విధానాన్ని నియంత్రించే విలువల వ్యవస్థలో బహుళత్వం ప్రముఖపాత్ర వహించాలి!! ఏ సామాజిక వ్యవస్థలో ఈ జీవన విధానం అమల్లో వుంటుందో దానికి ఆ "మట్టి వాసన" వుంటుంది. ఆ సామాజిక జీవనంలో భాగంగా వుండే రాజకీయ సంస్థలకు ఈ బహుళత్వం ఎంతో కొంత అంటాలి. ఆయా రాజకీయ సంస్థల స్వభావంలో భాగమైన సౌరభం కూడా కొంత బహుళత్వానికీ అంటుతుంది!!

**రెండో భాగంలో, బహుళ-ప్రజాస్వామ్య వ్యవస్థకు మెరుగైన ప్రత్యామ్నాయాల గురించి చర్చిద్దాం.**

ప్రస్తుతం అనేక దేశాల్లో వీటికి భిన్నమైన సామాజిక వ్యవస్థలు అమల్లో వున్నాయి. అవి బహుళ ప్రజాస్వామ్యంకన్నా మెరుగైనవా? కావా? ఎందుకు ? అని కూడా చర్చిద్దాం. ఈ చర్చను రెండు భాగాలుగా జరుపుకుంటే, ఎక్కువ భావ్యంగా వుంటుందని నా నమ్మకం.




మొదటి భాగంలో బహుళత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, వాటి మధ్య సంబంధాన్నీ చర్చిద్దాం.

రెండోభాగంలో, బహుళత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ బలీయం చేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను ప్రస్తావించుకుందాం.

దానికన్నా ముందే, ఇటీవల ఈ రెండింటి మీద జరుగుతున్న ప్రత్యక్ష పరోక్ష దాడుల గురించి కూడా చర్చిద్దాం. ఈ మొత్తం విషయాల్ని 20 నిమిషాల్లో చెప్పమన్నారు వర్మగారు. అందుకని ఈ ప్రసంగం రాసుకొచ్చాను. ముందు దాన్ని చదివేస్తాను - ఏమైనా చర్చ జరిగితే నేనూ పాల్గొంటాను!

**బహుళత్వం - ప్రజాస్వామ్యం కొన్ని నిర్వచనాలు**

బహుళత్వం, లాంటి మాటలకు నిర్వచనాలు చెప్పడం అంతగా ఫలప్రదం కాదన్నది నా అనుభవం. అలాంటి భావనలకు నిర్వచనాలు చెప్పడం, ఆకాశాన్ని, సముద్రాన్ని ఫొటో తియ్యడం లాంటిదే కాగలదు! అయినప్పటికీ నిర్వచనాలతోనే చర్చలను ప్రారంభించడం మనకో సభా మర్యాదగా మారింది. నేనూ ఆ సభా మర్యాదను పాటించేందుకు ప్రయత్నిస్తాను. ఎందుకంటే, నిర్వచనాలు చర్చకు పరిమితులు విధిస్తాయి. సమయం పరిమి

తంగా వున్నప్పుడు నిర్వచనాలు టైమ్ మేనే జ్మెంట్‌కు బాగా ఉపయోగపడతాయి! సిద్ధాంతాల సారాన్ని గ్రహించిన పెద్దలు బహుళత్వానికి నిర్వచనం చెప్తే అది ఇలా వుంటుంది

**"యెల్ల లోకము వొక్క యిల్లై, వర్ణ భేదములెల్ల కల్లై వేలనెరుగని ప్రేమబంధము వేడుకలు కురియ"**
**(ముత్యాల సరములు, 1910 జులై)**

మహాకవి గురజాడ "బహుళత్వం" అనే మాట ఎక్కడా ప్రయోగించినట్లు నా దృష్టికి రాలేదు - కానీ, అది ఆయన ఆదర్శాల్లో ఒకటిగా ఎప్పుడూ ఉంటూనే వుంది. ముత్యాల సరములు'లో గురజాడ వ్యక్తం చేసిన ఆదర్శవాదం బహుళత్వానికి చెప్పిన నిర్వచనం లాంటిదనే నాకు అనిపిస్తుంది. ఈ నిర్వచనాన్ని ఆధునిక రాజకీయ పరిభాషలోకి అనువదించి-మేకు బందీ చేస్తే-అప్పుడది ఇలా వుంటుంది.

**"సమాజంలోని భిన్న వర్గాలూ-మతాలూ-జాతులూ తమ సంప్రదాయాలనూ, ప్రయోజనాలనూ నిలబెట్టుకుంటూనే, కలిసి మెలిసి బతకగలిగే స్థితినే బహుళత్వం అంటాం."** (డిక్షనరీ ఆఫ్ బ్రిటానికా)

PLURALISM : A situation in which people of different social classes, religions, races, etc., are together in a society but continue to have their different traditions and interests -Britannica

ఇంతకుముందే అనుకున్నట్లుగా, వాస్తవానికి బహుళత్వం కేవలం ఓ "స్థితి- లేదా-పరిస్థితి మాత్రమే కాదు. ఇది నమ్మి, ఆచరించవలసిన ఓ విలువ- ఆదర్శం! చిక్కెక్కడ వచ్చిందంటే, ఒక వ్యక్తో, ఓ కుటుంబమో, ఓ పార్టీయో, ఓ గుంపో ఈ విలువను నమ్మి, ఆచరిస్తే సరిపోదు.

ముఖ్యంగా, సమాజంలో, చట్టపాలన చేసే అధికార వ్యవస్థ - వాడుక భాషలో ప్రభుత్వం - ఈ విలువకు కట్టుబడి, ఆచరించాలి. కానీ, బహుళత్వానికి ఏ సామాజిక వ్యవస్థలోనైనా ఎన్నో సవాళ్ళు ఎదురయ్యే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది.

కార్ల్ శాండ్ బర్గ్ అనుకుంటా.. జీవితాన్ని ఉల్లిపాయతో పోల్చాడు. ఈ ఉపమాలంకారాన్ని సామాజిక జీవనానికి వర్తింపచేద్దాం. ఉల్లిపాయలో ఎన్నో పొరలున్నట్టే, సమాజంలో ఎన్నో వర్గాలుంటాయి. వాటి మధ్య సత్సంబంధాలుంటేనే ఉల్లి పాయ మిగులుతుంది. ఒక్కో ఉల్లి పొరనూ వలిచేస్తూ పోతే, ముందు కళ్ళ నీళ్ళు తిరుగుతాయి. చివరికి ఉల్లిపాయ మిగలదు! కొంద రు కులం పేరు చెప్తే, మరి కొందరు మతం పేరు, ఇంకొందరు ప్రాంతం పేరు చెప్పి ఇదే ప్రయోగం పదేపదే చేస్తారు.

ఇంతకుముందు అనుకున్నట్లుగా, బహుళత్వాన్ని ఓ సామాజిక ఆదర్శంగా కొందరే పాటిస్తే దానివల్ల సత్ఫలితాలు రావు!! మన సమాజంలో కొద్ది మంది కుల మతాలను ఖాతరు చెయ్యకుండా పెళ్ళిళ్ళు చేసుకుంటూనే వున్నారు. మారుతీరావు లాంటి మహానుభావులు కొందరు కుల ప్రాతిపదికపై లక్షలు ఖర్చు పెట్టి మరీ - పరువు హత్యలూ చేయిస్తున్నారు!

సమాజమంటే, చదును చేసి, గుంటకతో పదును చేసిన మడిచెక్కలా వుండదు - **ప్రాణములొడ్డి ఘోర గహనాటవులను పడగొట్టి సృజించిన మాగాణంలోనూ మోళ్ళూ, రాళ్ళూ, గోతులూ గొప్పులూ వుంటాయి!**

విషయమేమిటంటే, సామాజికార్థిక సాధనాలపై పెత్తనం కోసం వివిధ వర్గాలు ఎప్పుడూ పోటీ పడుతూనే వుంటాయి. అయినప్పటికీ, విభిన్న-కొండొకచో-విరుద్ధ సామాజికార్థిక వర్గాలు కలిసి వుంటే తప్ప వాటికి మనుగడ లేని "స్థితి" ఎదురవుతుంది. బ్రిటానికా డిక్షనరీ చెప్పిన "స్థితి" అదే - దాన్నే రాజకీయ పరిభాషలో బహుళత్వం అనడం కద్దు- ఇది ఓ విలువ, ఓ ఆదర్శం!

### ఆధునిక ప్రజాస్వామ్యంలో బహుళత్వం, ఓ అవిభాజ్య అంశం!!

బహుళత్వాన్ని ఓ విలువగానూ, ఆదర్శంగానూ చెప్పుకునే సందర్భంలో మనం మరో విషయం కూడా చెప్పుకోక తప్పదు. విలువలూ, ఆదర్శాలూ అమలు చెయ్యడమనేది పూర్తిగా స్వచ్ఛందం - వాటిని అమలు చెయ్యకపోవడం శిక్షార్హమైన నేరం కాజాలదు!

అలాంటప్పుడు, ఆయా విలువలూ ఆదర్శాల అమలు బాధ్యత ఎవరిది ? సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాన్నీ ఉద్దేశించే ఈ విలువలనూ, ఆదర్శాలనూ మొత్తం సమాజమే రక్షించుకోవాలి!

మన ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి స్వభావం అంతర్గర్భితంగా వుందంటారు పెద్దలు!!

2007-17 సంవత్సరాల మధ్య రెండుసార్లు మన దేశానికి ఉప రాష్ట్రపతిగా వున్న డా. హామీద్ అన్సారీ దీన్ని గురించి ఇలా చెప్పారుః "మన ప్రజాస్వామ్య రాజకీయవ్యవస్థ, బహుళత్వ స్వభావాన్ని సంతరించుకుంది. ఫెడరల్ నిర్మాణాన్నీ, అల్పసంఖ్యాకుల భాషాపరమైన - మతపరమైన హక్కులనూ, వ్యక్తిగత హక్కుల సమాహారాన్నీ గుర్తించి, సమ్మతించడం

ద్వారా దానికి ఆ స్వభావం ఏర్పడింది.”

ఫెడరల్ పాలన అధ్యయనంలో నిపుణుడైన రషీదుద్దీన్ ఖాన్ చెప్పిన ఈ కింది మాటలు బహుళత్వానికి నిర్వచనప్రాయ మైనవి. “రాజకీయ కార్యాచరణకు సంబంధించిన పదకోశంలో జాతీయ సమగ్రత అనే భావనకు విశిష్టమైన అర్థముంది. ఈ పదకోశంలో, జాతీయ సమగ్రత అంటే-కలిసి మెలిసి వుండడం(cohesion) మాత్రమే ఒక దానిలో మరొకటి లీనం (fusion) కావడం కాదు! సమైక్యత (unity) మాత్రమే ఏకరూపత (uniformity) కాదు! పరస్పరం సమాధానపడడం (reconciliation) మాత్రమే - ఒకదానిలో మరొకటి కలిసిపోవడం(merger) కాదు! ఒకరితో ఒకరు సర్దుకోవడం మాత్రమే. ఒకరిని మరొకరు నిర్మూలించడం కాదు! సంయోజన (agglomeration) మాత్రమే. సంలీనం (assimilation) కాదు! సంఘీభావం మాత్రమే ఒకదానిపై మరొకటి పెత్తనం చెయ్యడం కాదు!

ప్రజల్లోని విశిష్టమైన భిన్నత్వాలను అంగీకరించడమే కానీ, పరస్పరం మారిపోవడం (కన్వర్షన్) కాదు ! ఏకరూపత్వాన్నే కాక, భిన్నత్వాన్నీ అంగీకరించడమే జాతీయ సమగ్రత.”

“బహుళత్వ స్ఫూర్తితో ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు హామీగా నిలిచేది రాజ్యాంగ చట్టమే!” మన దేశంలో అలాంటి రాజ్యాంగం డెబ్బయ్ నాలుగున్నర సంవత్సరాలుగా అమల్లో వుంది. మన రాజ్యాంగం ప్రపంచంలోని అన్ని రాజ్యాంగ చట్టాలలోకి సుదీర్ఘమైంది.

అందులో ఓ పీఠిక, 470 అధికరణాలూ, 25 భాగాలూ, 12 షెడ్యూళ్ళూ వున్నాయని మనకందరికీ తెలుసు! ఇది ఏ కొందరో ప్రజాప్రతినిధుల తరపున, లేదా వారి పేరిట ఆమోదించిన రాజ్యాంగం కాదు. భారత ప్రజలందరి తరపునా తీర్మానించుకున్న రాజ్యాంగ చట్టమిది!

మన రాజ్యాంగంలో లోపాలు లేవనీ, వుండవనీ రాజ్యాంగ నిర్మాతలే అనుకోలేదు - మనం ఎందుకనుకోవాలి? నిత్యం ప్రవహించే నదిలాంటి జీవితంలో హెచ్చు తగ్గులు సహజం. రాజ్యాంగంలో మారేకాలం ప్రతిఫలించాలి.

మారిన స్థితిగతుల కు తగినట్లు రాజ్యాంగాన్ని సవరించుకునే హక్కు ప్రజలకు వుండాలి.

అందుకే, దాన్ని సవరించుకునే అధికారం ప్రజా ప్రతి నిధులకు కల్పించారు రాజ్యాంగ నిర్మాతలు. కానీ, చెమ్పాదు కొవ్వు పట్టిన ప్రతి రాజకీయ శక్తీ, రాజ్యాంగ స్ఫూర్తికి కళంకం తేవాలనే చూసింది. రాజ్యాంగం నిర్దేశించిన బహుళత్వానికి భంగం కలిగించే ప్రయత్నం చేస్తూనే వుంది! చిత్రమేమిటంటే, అలాంటి రాజకీయ శక్తులన్నీ, కన్నులొట్ట బోయో, కాలు సొట్టబోయో బతికి బట్టకడుతూనే వున్నాయి. తాజాగా, ఈ మధ్యనే ఇదే మరోసారి జరగడం మనమందరం చూశాం. అయితే, ఈ విలువలకు కట్టుబడని వారిని అదుపు చేసే అవకాశం - వయోజనులైన ప్రజలందరికీ - వుంది. అది కచ్చితంగా ఉండాలి! నిర్దిష్ట కాలపరిధిలో జరిపించే ఎన్నికల ద్వారా, ప్రజలకు ఈ అధికారం కొనసాగాల్సిందే!

మేం కలగన్నంత ఆధిక్యం మాకు రావాలే గానీ, ఈ రాజ్యాంగాన్ని అటకెక్కిస్తామన్నట్లు మాట్లాడారు కొందరు-ప్రతిపక్షాల ఎన్నికల ప్రణాళికలను అడ్డం పెట్టుకుని మతపరమైన విద్వేషం రగిలించాలని చూశారు మరికొందరు-ప్రత్యర్థుల వ్యక్తిగత విషయాలను ఎన్నికల ప్రచారాల్లో వాడుకోవాలని తెగబడ్డారు కొందరు-కులమతాల నీడల్లో చవకబారు ఎన్నికల ప్రచారాలకు తెగించిన వాళ్ళు ఇంకొందరు - ఇలాంటి వాళ్ళందరికీ ఏ గతి పట్టిందో చూశాం!

**ఈ దేశపౌరులు బహుళత్వంతో కూడిన సామాజిక వ్యవస్థ ఉండాలనుకున్నందు వల్లనే ఆ ఫలితాలు అలా వచ్చాయి!!**

## బహుళత్వ ప్రజాస్వామ్య విలువలపై హిందుత్వ సాంస్కృతిక దాడి

“వేద నినాదాల అర్థ వాద వివాదాలు చూడు వాదాలను పొట్టవిచ్చి వర్గవిరోధాలు చూడు!
నీతిని భూతిని పూర్వఖ్యాతిని కొనియాడి పాడి, జాతీయత జాలువార్చు పూతన చనుబాలు చూడు !
మనిషి మీద మమత పెరిగి, మనసంతా కరిగి కరిగి, భూరి విరాళం ఒసగే బోసిపులి వ్రతాలు చూడు !
ఆప్యాయం చిలకరించి, ఆదరాన పలకరించి, ఆతిథ్యానికి పిలిచే వాతాపి ముఖాలు చూడు !
పౌష్టిక యాగాదేష్టలు శిష్టలు గురువాసిష్టలు, యువతకు భవితకు నాటే యూపస్తంభాలు చూడు!”

ఇది మా గురువుగారు రాంభట్ల కృష్ణమూర్తి దాదాపు అర్ధశతాబ్ది కింద రాసిన కవిత.

హిందూ పురాణాలతోనూ, పురా గాథలతోనూ పరిచయం వున్న వారికి ఈ కవితలోని సారాంశం వివరించనవసరం లేదు. భారతీయ నాగరికులలోనూ, వారి సంస్కృతిలోనూ బహుళత్వం పట్ల సహజమైన ఆమోదయోగ్యత ఇప్పటికీ చెక్కు చెదరలేదు. మన నాగరికుల్లో సామాన్యులే కాదు, అసామాన్యులూ అపసామాన్యులూ వాడుకభాషలో పెత్తందార్లు - యెందరో వున్నారు. చరిత్ర పూర్వ యుగాల నుంచీ మన దేశం బహుళత్వానికి నెలవై వున్నమాట ఎంత నిజమో, పెత్తందారీ శక్తులు, ఇక్కడి అల్ప సంఖ్యాకులపై ఎప్పటికప్పుడు దాడి చేస్తూ వస్తున్న మాటా అంతే వాస్తవం. ఇప్పుడు అలాంటి

దాడి బహుముఖీనంగా సాగుతోంది. వాటన్నిటిలోకీ సాంస్కృతిక దాడి ముఖ్యమైంది. దాడికి మూడు కొమ్ములు న్నాయి – అధికార కేంద్రీకరణ, అధిక సంఖ్యాకుల పెత్తనం, చవకబారు జనరంజక రాజకీయాలు.

ఈ మూడు కొమ్ములతో లౌకిక, ప్రజాతంత్ర, ఉదారవాద శక్తులపై తీవ్రమైన ఏ నాటి నుంచో దాడి జరుగుతోంది. ఆ నా టి మాట ఏమో గానీ, ఇరవై, ఇరవయ్యొకటో శతాబ్దాల్లో బహు ళత్వంపై జరిగే దాడులకు ఓ గొలుసుకట్టు స్వభావం వుంది.

ముసోలినీ, హిట్లర్, ఫ్రాంకోలాంటి ఫాసిస్టులు రాజ్యాంగ బద్ధంగానో అబద్ధంగానో 1920–30 దశకాల్లోనే పెత్తనంలోకి వచ్చారు. వాళ్ళందరూ అటు రాజకీయాల్లోనూ, ఇటు ఆర్థిక రంగంలోనూ టొటాలిటేరియన్ ఏకపక్ష నియంతృత్వాన్నే సమర్థించారు.

ఈ నిరంకుశుల పుణ్యమాని "పౌర సైనిక ప్రవృత్తి" రూపుదిద్దుకుంది. అంత వరకూ పౌరులకూ, సైనికులకూ మధ్య వుండిన సరిహద్దు రేఖ చెరిగిపోయింది!

ఇరవయ్యో శతాబ్ది చివరి దశాబ్దం నుంచీ, మన దేశంలో తిరిగి ఈ పోకడలు పునరావృతమవుతున్నాయి. ఏ ఆధారాలూ లేని, వాటి అవసరమే లేని, కథనాలను వాట్సాప్ యూనివర్సిటీల ద్వారా ప్రచారం చేస్తూ ఈ దాడి చేస్తున్నారు.

యూజెనిసిజం (కొన్ని జాతులు, పుట్టుకతోనే వేరే జాతుల కన్నా ఎక్కువని చెప్పే వాదం) మనదేశంలో, మనువాదాన్ని మనువాడింది. రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇజ్రాయిల్, టర్కీ, బ్రెజిల్ తదితర దేశాల సరసన మనల్ని కూర్చోబెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రచలితమవుతున్న బాహుబలి సంస్కృతిని, కస్టమ్స్ సుంకం లేకుండానే, దిగుమతి చేసుకోవాలని వారి ప్రయత్నం.

చిత్రమేమిటంటే, ఈ రాజకీయ బాహుబలులను సమర్థించేందుకు మన స్థానిక బాహుబలులూ, బహుబలులూ ఎగబడుతున్నారు! అడక్కముందే, "మీకు అవసరమున్నా లేకపోయినా సరే, మా మద్దతు మీకే సుమా!" అంటూ తెగబడుతున్నారు. అలా చేసే సందర్భంగా వారికి ఏ చేగెవారా, ఏ వివేకానందుడూ అడ్డుపడకపోవడం మరింత విడ్డూరం!!

కానీ, మన దేశ ప్రజలు ఎప్పటికప్పుడు ప్రజాస్వామ్యం పట్ల తమ విశ్వాసాన్ని పునఃప్రకటిస్తూనే వున్నారు.

రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యం అమల్లో ఉన్నంత వరకూ, ఇక్కడ బహుళత్వానికి ఏ ధోకా లేదు. బహుళత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ఎప్పటికైనా జనమే నిలబెట్టగలరు తప్ప అవకాశవాద రాజకీయులకు అది శక్తికి మించిన పని.

## బహుళత్వం కోసమే బహుళత్వమా?

"మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును అంత, స్వర్గ సుఖమ్ములన్నవి అవని విలసిల్లున్"

అన్నాడు కదా గురజాడ అంతటివాడు ?

ఆయన మాటల్లో బహుళత్వస్ఫూర్తి ఎక్కడుంది?

మతాలన్నీ మాసిపోవాలను కోవడం బహుళత్వం కాగలదా?

మహాకవి అక్కడే ఆగిపోతే, ఆయన ఆదర్శాల్లో విలువల్లో బహుళత్వం లేదనే చెప్పాల్సి వస్తుంది – కానీ, ఆయన "జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగు"తుందని కూడా అన్నాడు కదా – "అంత స్వర్గ సుఖమ్ములన్నవి అవని విలసిల్లుతాయనే ఆశాభావం ప్రకటించాడు కదా –

ఎవరికోసం ఈ జ్ఞానం వెలగాలని ఆయన కోరుకున్నాడు ?

ఈ స్వర్గసుఖాలు ఎవరికి దక్కాలని ఆయన ఆశించాడు ?

ఈ విషయంలో మనకు స్పష్టత ఏర్పడితే కానీ, మహాకవి మాటతీరులోని మర్మం మనకు బోధపడదు! అయినా, బహుళత్వం ఎందుకుండాలి మన సమాజంలో?

కేవలం, బహుళత్వాన్ని బతికించడం కోసమేనా?

దానికి మరో ప్రయోజనమేదైనా వుందా?

"తూ హిందూ బనేగా న ముసల్మాన్ బనేగా – ఇన్సాన్‌కి ఔలాద్ హై ఇన్సాన్ బనేగా!!" అన్నాడు సాహిర్.

అవును– మనుషుల బిడ్డలు మనుషులే కావాలి.

"నరుడు నరుడౌట దుష్కరము సుమ్ము!" అన్నాడు గాలిబ్.

అసమానతలనేవి ఏ రూపంలో వున్నప్పటికీ, అంతకాలమూ మానవాళి సర్వతోముఖ అభివృద్ధి సాధ్యం కాదు!

సొంతలాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడ వోయ్" అని చెప్పిన మహాకవికి ఈ సత్యం తెలుసేమో అనిపిస్తుంది. అన్నప్రాశననాడే ఆవకాయ పెట్టకూడదనే, "సొంత లాభం కొంతయినా మానుకో"రా బాబూ అని హితవు చెప్పాడేమో గురజాడ!!

బహుళత్వం బహుళ జనుల – బహుజనుల కోసం వర్ధిల్లాలి తప్ప, అది లక్ష్యం లేని ఆదర్శం కాదు! కాకూడదు!!

అలా వర్ధిల్లినప్పుడే, ఇలాంటి ఆదర్శాలూ విలువల వల్ల మొత్తం సమాజం ప్రయోజనం పొందుతుంది.

వర్మగారిలాంటి వాళ్ళు అలాంటి లోక కల్యాణం కోసం పాటుపడే వాళ్ళు! (పనిలో పనిగా నాలాంటి వాళ్లకీ కల్యాణం జరిపిస్తారు – అది వేరే విషయమనుకోండి!)

అలాంటివాళ్ళు దాదాపు అరవయ్యేళ్ళుగా చేస్తున్న కృషి ఫల వంతం కావాలంటే, బహుళత్వం వలన బహుజనులు లాభించాలి ! సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ఈ జీవన యానంలో అడ్డదార్లూ దొడ్డిదార్లు వుండవని గుర్తించాలి, గుర్తుంచుకోవాలి!! ❑

**(తణుకులో జూన్ 30న జరిగిన దారిదీపం మిత్రుల సమాలోచన సభలో చేసిన ప్రసంగ పాఠం)**

# ఆగస్టు 9 క్విట్ కార్పొరేట్స్ డే



- వడ్డే శోభనాద్రీశ్వరరావు

పూర్వకాలంలో 18వ శతాబ్దం వరకు ప్రపంచం మొత్తం మీద భారతదేశం అత్యధిక వస్తూత్పత్తి (GDP) కల్గివుండేది. దరిమిలా చైనా మొదటి స్థానంలోకి చేరింది. బ్రిటన్‌కు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీ మన దేశంలో వ్యాపారం కోసం ప్రవేశించి, అధికారాన్ని కైవసం చేసుకొన్న దరిమిలా మనదేశ ప్రజల కష్టార్జితాన్ని దారుణంగా లూటీచేసింది. మన ప్రజలు ఉత్పత్తి చేసే బట్టలు, ఇతర వస్తువులపైన పన్నులు విధిస్తూ మన దేశం నుండి ఇంగ్లండ్‌కు పన్ను లేకుండా పత్తిని తీసుకు వెళ్ళి, అక్కడ బట్టల మిల్లులలో తయారైన వస్త్రాలను పన్నులు లేకుండా మనదేశంలో అమ్మడం వల్ల క్రమేపీ దేశీయ వస్త్ర పరిశ్రమ, చేనేత కార్మికుల స్థితిగతులు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇతర చేతి వృత్తుల ఉత్పత్తులు దెబ్బ తిన్నాయి. ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వాటా 24.4% వున్నదల్లా 1950 నాటికి 4.2%కి తగ్గిపోయింది. స్వాతంత్ర్యానంతరం పంచవర్ష ప్రణాళికలు, ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమలు, లైసెన్స్-పర్మిట్ విధానాల ద్వారా నియంత్రణ కొనసాగుతూ వచ్చాయి. 1990 నాటికి విదేశీ మారకద్రవ్య చెల్లింపులలో సమస్య తలెత్తి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (I.M.F) వద్ద నుండి రుణసేకరణ, దానితోపాటు ఆర్థిక వ్యవస్థలో నియంత్రణను తొలగించడం, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం మున్నగు ఆర్థిక సంస్కరణలు చేపట్టబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటూ వుండగా తీవ్రమైన ఆర్థిక వ్యత్యాసాలు చోటు చేసుకొంటూ వచ్చాయి. 2000లో కేవలం 9 మంది బిలియనీర్లు (రూ.100 కోట్ల డాలర్లపైన సంపద కల్గినవారు) వుండగా వీరి సంఖ్య 2017 నాటికి 101, 2022 నాటికి 166కు పెరిగింది. నరేంద్ర మోదీ ప్రధానిగా కేంద్రంలో బి.జె.పి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గౌతమ్ అదాని, అంబాని సోదరులు, వేదాంత అనిల్ అగర్వాల్ మున్నగు ఆశ్రిత పెట్టుబడిదారులకు వివిధ రూపాలలో వారికి లబ్ది చేకూర్చే విధానాలు అమలు చేయబడుతున్నాయి. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచివేస్తూ, కార్పోరేట్లపైన సంపద పన్ను రద్దు చేయటమేకాక, కార్పోరేట్ ట్యాక్స్‌ను 30% నుండి 20%కు తగ్గించడం వల్ల కేంద్రానికి ఏటా రూ.1.45 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతుంది. భారత రాజ్యాంగంలో దేశంలోని సహజ వనరులు కొద్దిమంది వద్ద కేంద్రీకృతం కారాదని, మొత్తం ప్రజా బాహుళ్యానికి మేలు చేకూర్చేందుకు, అభివృద్ధిని సాధించేందుకు వినియోగించబడాలి అని స్పష్టంగా ఆదేశిక సూత్రాలలో పేర్కొనబడినప్పటికీ, అందుకు భిన్నంగా మోదీ దత్త పుత్రుడు గౌతమ్ అదానీకి 12 నౌకాశ్రయాలను, 7 విమానాశ్రయాలను, కోట్లాది టన్నుల బొగ్గు నిల్వ వున్న గనులను కట్టబెట్టింది. "మానిటైజేషన్" పేరు మీద వేలాది కి.మీ. జాతీయ రహదారులను, విద్యుత్ ట్రాన్స్ మిషన్ లైన్లను పవర్ గ్రిడ్‌తో సహా కార్పోరేట్లకు కారుచౌకగా అందచేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

రైతులు, పేదలు, కుటీర, చిన్న పరిశ్రమల రుణపరిమితి విస్తరించేందుకు 1970లో బ్యాంకుల జాతీయీకరణ జరిగి, అంతకు మునుపుకన్నా ఈ వర్గాలకు కొంత మెరుగైన రీతిలో ఋణాలు అందుతూవున్నా, బ్యాంకులు ఇచ్చు మొత్తం రుణ పరపతిలో సింహభాగం కొద్దిమంది కార్పోరేట్ సంస్థలకే వెళుతూ వుంది. కోట్లాది మంది మధ్య తరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్లు, మహిళలు బ్యాంకులో వేసుకున్న డిపాజిట్లు ధనంతో బ్యాంకులు రుణాలు ఇస్తూ వుంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకులలో రూ.1.20,88,599 కోట్లు మరియు గ్రామీణ బ్యాంకు (ఆర్.ఆర్.బి) వద్ద రూ.6,41,599 కోట్లు మరియు ప్రైవేటు బ్యాంకుల వద్ద రూ.72,95,392 కోట్లు డిపాజిట్లు వున్నాయి. బ్యాంకులలో ప్రజలు దాచుకున్న ధనంపైన అతి తక్కువ వడ్డీ ఇవ్వబడుతూ వుంది. వ్యక్తులు, ట్రస్టులు, ధార్మిక సంస్థలు, కరెంటు అకౌంటులో వుంచిన ధనంపైన వడ్డీ వుండదు. సేవింగ్స్ బ్యాంక్ అకౌంటులో దాచుకున్న ధనం పైన గతంలో 5%గా వున్న వడ్డీని ఇప్పుడు 2.5-3%కు పరిమితమై డిపాజిటర్లకు ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఏమాత్రం లాభించని పరిస్థితి. రైతులు, చిరు వ్యాపారులకు చెందిన 29,53,93,001 ఖాతాలకు రూ.13,44,984 కోట్ల ఋణాలు ఇవ్వగా ఒక్కొక్క ఖాతాకు 100 కోట్లకుపైన ఋణాలు పొందిన 16,892 ఖాతాలకు రూ.46,55,618 కోట్ల రుణం ఇవ్వబడింది. సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం బ్యాంకులలో దాచుకున్న ధనం తిరిగి సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలకు కాకుండా కార్పోరేట్ సంస్థలకు తరలిపోతుందని స్పష్టంగా తెలుస్తూ వుంది. ప్రకృతి వైపరీత్యాల వలన, చీడపీడల వలన పంట నష్టాలు సంభవించి రైతాంగానికి ఒక్క పర్యాయం పంట రుణాలు మాఫీ చేయమని విజ్ఞప్తిచేసినా స్పందించని మోదీ

మిగతా 30వ పేజీలో


# రాజ్యాంగానికి పీఠిక ఒక ఆత్మ



- మాడభూషి శ్రీధర్

**వి ది పీపుల్ ఆఫ్ ఇండియా.. అనే మాట ఆంగ్లంలో తెలుగులో కూడా ఒక గొప్ప మంత్రం వలె నిలబడుతున్నది. ఈ పీఠిక కేవలం పీఠిక మాత్రమే కాదు. ఇది మన భారత రాజ్యాంగానికి పునాది. ఈ సారాంశం వంటి పీఠికను రాజ్యాంగ 'ప్రవేశిక' అనీ, లేక సంవిధాన 'ప్రస్తావన' అనేవారు. ఇది నిజానికి రాజ్యాంగానికి ఒక మూలతత్వం గురించి పీఠిక వివరిస్తుంది. ఇది రాజ్యాంగం ఉపోద్ఘాతం అవుతుంది. మొత్తం రాజ్యాంగానికి ఇది ఒక ముందుమాట లేదా పరిచయం అనీ అంటారు. ఇది పౌర దీక్షా ప్రకటన. ఈ పీఠిక మన భారతీయుల లక్ష్యాల పట్టిక, బాధ్యతల హెచ్చరిక.**

మన సంవిధాన ప్రవేశిక, మనం దీక్ష వహించవలసిన ఆశయాల వేదిక. ఇదొక ప్రతిజ్ఞ. మన సంవిధానం లేదా రాజ్యాంగం ఈ పీఠికతోనే మొదలవుతుంది. మన సమాజం, ప్రజలు భారతదేశ దేశంపై పెంచుకున్న ఆకాంక్షలు, అనుకుంటున్న ఆశయాలు, ఇష్టపడుతున్న కోరికలు ప్రస్తావించే అద్భుతమైన వాక్యాలు ఇవి. స్పష్టమైన అర్థాలతో, పదాలతో, వాక్యాలతో మనకు అవగతం అవుతుంది. అర్థమవుతుంది. భారత రాజ్యాంగానికి పీఠిక ఒక ఆత్మ. మనసు, హృదయం. పరిపాలనా భవనానికి ఇది పునాది. విస్తృతమైన చర్చ తరువాత ఇది చరిత్రగా రాజ్యాంగ సంవిధానంలో ఎదిగింది. 1949 నవంబరు 26న రాజ్యాంగ సభ పీఠికతో మొదలై మరికొన్ని అంశాలను అందులో చేర్చిన దశలో ఆమోదం పొందింది. ఆ తరువాత అంటే రెండు నెలల తరువాత 1950 జనవరి 26న సమగ్రంగా సంపూర్ణంగా అమలులో వచ్చి మన రిపబ్లిక్, గణతంత్రం ఆరంభమైంది.. మరో కొత్త చరిత్ర ప్రారంభమైంది. ఈ పీఠిక ఏ విధంగా పుట్టి పెరిగిందో ఇంతకుముందున్న వాక్యాలలో వివరించడమైంది. జవహర్‌లాల్ నెహ్రూ రూపొందించి 1946 డిసెంబరు 13న రాజ్యాంగ సభలో ప్రవేశమైన తర్వాత రాజ్యాంగ నిర్ణాయకసభ తుది రూపంతో అందరి ఆమోదం పొందిన పీఠిక పునాది మీద దేశ చరిత్ర ఆరంభమైంది.



భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాన్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము

### స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలు

ఈ పీఠికలో ఏమున్నాయి ? నాలుగు వాక్యాలు అక్షరాలేనా ? స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని, సౌహార్ద్ర, సౌభ్రాతృత్వాలనే అర్థం మెదడులోకి ఇంకి జీర్ణించి వస్తున్నాయా ? జీవితాశయమని తెలుసా, అవి ఒక జీవన విధానం అని అర్థమవుతున్నదా ? అంబేద్కర్ తన చివరి ప్రసంగంలో అనేక అంశాలు వివరించారు. (పుస్తకం చివరి భాగాల్లో ఈ వివరాలు చదవండి.) ఇవి సమానత్వంతో కలిసి ఉండాలి. విడివిడి చేయలేము. సమానత్వం, స్వాతంత్ర్యం రెండూ సౌభ్రాతృత్వం ఒకరి కొకరితో పూవుల తీగలతో జంటగా తోడు నీడగా ఉండాలని ఆశ. పెనవేసి ఉంటాయి. విడదీయలేనివి. సమానత్వం లేకపోతే స్వాతంత్ర్యం ఉండగలుగుతుందా? ఒకరిద్దరు లేదా సంపన్నుల శక్తి కలిగిన వారి ఆధిపత్యంతో నెత్తిన ఎక్కి కూచుంటారు. బలహీన ప్రజలను ఈ డబ్బు అధికారంతో బానిసలుగా మారుస్తాయి. కనుక స్వాతంత్ర్యం లేని సమాన

త్వం ఉండదు. వీటికితోడు మరో కీలకమైన లక్షణం సౌభ్రాతృత్వం. ఇది ఏమిటో కూడా చాలా మంది ఆలోచించరు. అర్థం చేసుకోరు. అన్నదమ్ముల్లాగా ఉండాలని అర్థం. అందరూ అన్నతమ్ముల వలె ఉన్నారా లేరుకదా అంటారు. సొంత సోదరులైతే అంటే ఒక కడుపున పుట్టిన వారే ఇష్టపడకుండా కొట్టుకుంటూ ఉంటే సౌభ్రాతృత్వం అంటారా. అదొక కలా లేక నిజమా అనిపించే సౌభ్రాతృత్వం ఉండాలి. ఒక చెట్టుకు తీగ అల్లుకుని పెనవేసుకోవడం వంటి సౌభ్రాతృత్వం అర్థం కావాలి. దాన్ని సాధించడం ఎట్లా ? ఇదే అంబేద్కర్ వివరంగా చెప్పిన తుది ప్రసంగం. సమానత్వం లేకుండా స్వాతంత్ర్యం లేనట్టే కదా. అది సమాజ సమ పరిపాలనకు అది మరీ బహుదూరమే కదా.

### ప్రజాస్వామ్య గణతంత్రం

భారతీయ సంవిధానంలో పీఠిక స్వరూపంలో సర్వ సత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర దేశమని వర్ణించింది. అయితే ఆ తరువాత ఆ వాక్యానికి లౌకిక వాద, సామ్యవాద పదాలను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

### సర్వసత్తాక అంటే..

ఈ జాతి సొంతంగా తమను తాము పరిపాలన చేసుకోగలరని చెప్పడానికి భారతదేశం ఒక సర్వసత్తాక దేశం అని చెబుతున్నారు. బయటి వారెవరూ ఇంకెవరూ దేశ వ్యవహారాలను నిర్దేశించలేరు. కేంద్ర ప్రభుత్వం లేదా భారత రాజ్యాంగ సంవిధానం స్వయంగా ఈ దేశాన్ని నడిపిస్తుంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర సంస్థలు, లేదా భారత ప్రభుత్వ భాగాలు, రాష్ట్ర కేంద్ర న్యాయస్థానాలు, వాని వాని పరిధులలో సక్రమంగ పనిచేయాలని దాని అర్థం. ఆంగ్ల ప్రభువుల వలె మరొకరెవరో అగ్రదేశాల వారు నిర్దేశించడం సాధ్యం కాదు. అది మన సత్తా. మన ప్రజాస్వామ్య సత్తా, జన సార్వభౌమ సంపూర్ణ సత్తా.

### మరో కీలకమైన పదం సామ్యవాదం

చేసినా చేయకపోయినా మొదటి నుంచి ఇంతకుముందు 42వ సవరణ ద్వారా రాజ్యాంగ సంవిధానంలో మరో రూపంలో స్వభావంలో, మొత్తం భాగాలలో, ప్రాథమిక హక్కులలో, మరి కొన్ని ఆదేశిక సూత్రాల ద్వారా మన దేశం సామ్యవాదమని అర్థం చేసుకోవాలి. సామ్యవాదమంటే రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య సామ్యవాదమని అర్థం. సామ్యవాద లక్ష్యాలను ప్రజాస్వామ్య పద్ధతిలో, సహజ పరిణామగతిలో, అహింసా పరంగా సాధించాలి. సామ్యవాద దేశంలో సంపాదనను, సంపదను సమానంగా ప్రజలకు పంచాలి. అతికొద్ది మంది చేతుల్లో డబ్బు, పరపతి, సంపద ఉండిపోకూడదు. భూమి, పరిశ్రమల పెట్టుబడులపై ప్రభుత్వం నియంత్రణ చేస్తూ

## నవంబరు 26 - రాజ్యాంగ దినోత్సవం

### రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ దినం

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో నవంబరు 26వ తేదీకి ముందుగా రాజ్యాంగ వ్యాస రచన, ప్రసంగ పోటీలు నిర్వహించాలి. విద్యా సంస్థలలో సామూహికంగా లేదా తరగతి గదులలో రాజ్యాంగ పీఠికను చదివించాలి. రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, పరిపాలన రాజ్యాంగబద్ధంగా వుండాలని, రాజ్యాంగ పీఠిక వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాలు, సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలి. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు తమ పని ప్రదేశాలలో రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయాలి. ప్రజా సంఘాలు తమ సమావేశాలలో లేదా ఆఫీసులలో ఈ కార్యక్రమం నిర్వహించాలి.

## జనవరి 26 - రిపబ్లిక్ డే

### రాజ్యాంగ పీఠిక దీక్షా దినం

రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ డేను రాజ్యాంగ పీఠిక దీక్షా దినంగా నిర్వహించాలి. ప్రతి పట్టణంలో కార్మిక సంఘాలు, అన్ని ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలు రాజ్యాంగ పరిరక్షణ మీద ఆసక్తిగల సంస్థలు, సంఘాలు ఉమ్మడిగా "పీఠిక దీక్షా దినం" జరపాలి. జాతీయ జెండాతో వివిధ సంఘాల బ్యానర్లు, బాడ్జీలతో అన్ని సంఘాల సభ్యులు పాల్గొనేలా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలి. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల సాధన కోసం సాగే ఉద్యమంగా దీనిని నిర్వహించాలి.

అందరికీ సమాన హక్కుగా అందవలసిన బాధ్యతలు ఇవి.

### మరొక మాట లౌకిక వాదం

లౌకిక దేశమంటూ ప్రజలకు, ప్రభుత్వానికి కేవలం రాజ్యాంగం, చట్టం న్యాయం ద్వారా రూల్ ఆఫ్ లా లో సమపాలనలో ఉపయోగిస్తూ వుండాలి. అదే 42వ సవరణలో చెప్పారు. సవరణ లేకపోయిన పీఠికలో చేర్చినా లేకపోయినా పరిస్థితిలో తేడా లేదు. ప్రజల మతాల ఆధారంగా ఎక్కువ తక్కువలు ఉండకూడదు. లేకపోతే సమానత ఏముంటుంది? అన్ని మతాల వారిని సమానంగా గౌరవించాలి కదా. ఈ

దేశానికి అధికార మతమంటూ ఉండకూడదు. అధికారం లేని మతం అంటూ ఉండదు. మతానికి అధికారం ఏమిటి ? అది అర్థం చేసుకోవాలి, పాటించాలి. ప్రార్థనకు తేడా లేదు. పూజకు తేడా లేదు. పౌరులందరూ వారికి ఇష్టమున్న మతాన్ని నమ్మి, ఆచరించి, పెంపొందించుకోవచ్చు. అందుకు కొట్టుకోవలసిన అవసరం లేదు. ప్రాణాలు తీయడం ఎందుకు అని ఆలోచించాలి.

## అన్నిటికన్నా మూలమైంది 'ప్రజాస్వామ్య' లక్షణం

మనదేశంలో ప్రజలే ప్రభువులు, వారే స్వాములు. అందుకే మన దేశం ప్రజాస్వామ్య దేశం. ప్రజల నుండే పాలకులు ఎన్నికల విధానం ద్వారా ఒక ఓటు అనే సిద్ధాంతంపై ఎన్నుకోవాలి. ఒక వయోజనుడైన వ్యక్తి ఓటు మీద భారత ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. భారతదేశ పౌరుడై, 18 ఏళ్ళు నిండిన ప్రతి వ్యక్తి, చట్టం ద్వారా నిలుపుదల లేని సందర్భంలో, ఓటు వేసే హక్కును సాధిస్తాడు. రాజకీయ, ఆర్థిక సామాజిక ప్రజాస్వామ్యం కూడా అసలైన అవసరం. గణతంత్రం అంటే దశాబ్దాలపాటు పదవిలో ఉండడమా మనది రిపబ్లిక్ దేశం. గణతంత్ర ప్రభుత్వం మనది. ప్రభుత్వ నాయకుడు అంటే ప్రధాని లేదా ముఖ్యమంత్రిని ప్రజలే ఓటు ద్వారా పరోక్షంగా ఎన్నుకుంటారు. వారు రాజులు కాదు. వారిది వారసత్వం కాదు. రాచరికంతో పనిలేదు. నియంతలు ఉండరు. ఉండకూడదు. ప్రజాస్వామిగా మాటలు మార్చుకుని నియంతలైతే, నియంత్రణలు అంటే అది న్యాయం కాదు. దాన్ని మళ్లీ ఓటింగ్ ద్వారానే ఆ నియంతని తొలగించాల్సిందే. ప్రభుత్వం అందరి ప్రజలది. ఏ ఒక్కరి సొంతం కాదు. వారి సొత్తు కాదు. ఒక పరిమిత కాలం వరకు ప్రజల ద్వారా నేరుగా గానీ, పరోక్షంగా గానీ, ప్రభుత్వ నాయకుడిగా ఎన్నిక, అందుకే ప్రజాస్వామ్యాన్ని కుట్రలు చేసుకుంటూ మోసాలు చేస్తూ నియంతలుగా మారుతూ ఉంటే, జరగవలసింది అమెరికాలో వలె రెండు పదవీ కాలాల నుంచి పెరగకూడదు. అంటే ఒక జీవితంలో రెండుసార్లు ప్రెసిడెంట్ అయితే మళ్లీ ఎన్నికల్లోకి రాదు. మన దేశంలో ఒకే ప్రధాని పదేళ్లు కాక మళ్లీ ఎన్నిక కాకూడదు. ముఖ్యమంత్రి 15 ఏళ్లు, 20 ఏళ్లు లేదా ఇంకెక్కువ కాలం వరకు పరిపాలించకూడదు. ముఖ్యమంత్రులు ఎంపీలు ఎమ్మెల్యే జీవితం అంతా కొనసాగడానికి వీల్లేదు. అదే నిజమైన ప్రజాస్వామ్యం.

## అసలు కావలసింది పూర్తి నిజమైన 'న్యాయం'

మనదేశం తన పౌరులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించేందుకు నిరంతరం ప్రయత్నించడం ప్రతి పౌరుడి బాధ్యత. ఆ న్యాయాలు రకరకాలుగా దొరకాలి. అందులో ఇవి కొన్ని సామాజిక న్యాయం అంటే కొందరు కులస్తులా సామాజిక న్యాయమంటే కొన్ని కులాల వారు, మతం వారు కేవలం న్యాయం అందుకోవడం న్యాయం కాదు. కుల, సంప్రదాయ, మత, వర్ణ, లింగ, స్థాన భేదాల ఆధారంగా ఎవరినీ ఎక్కువ తక్కువ చేసి చూడకూడదు. సమాజంలోని అన్ని రకాల దోపిడీలను, అన్ని రకాల వివక్షను నిర్మూలించడమే సామాజిక న్యాయం.

## ప్రజాస్వామిక న్యాయం

ఆర్థిక న్యాయం అంటే కొందరు కుబేరులా? ఇన్ని వందల కోట్ల కుచేలులా? ఆర్థిక న్యాయం ఏది? జీతాలు వేతనాలు, ఆస్తులు, ఆర్థిక హోదా ఆధారంగా స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాలు ఎందుకు? కొందరు కుబేరుల ప్రపంచమైన ఒకరో ఇద్దరో సంపన్నులు కావడం జరిగితే అంతకన్నా అన్యాయం మరేది ఉంటుంది? సమానంగా సంపద పంచుతూ, ఆర్థిక సమానత్వం తెస్తూ, వస్తువుల తయారీ-పంపిణీలలో ఏకాధిపత్యాన్ని నిర్మూలిస్తూ, ఆర్థిక వనరులను వికేంద్రీకరిస్తూ, అందరికీ ఆర్థికంగా బాగుపడేందుకు సమాన అవకాశాలను అందివ్వడమే భారత ప్రభుత్వ లక్ష్యం కావాలని రాజ్యాంగ ధ్యేయం. అంబేద్కర్ ఆశయం. రాజ్యాంగ నిర్ణాయక సభలో పెద్దలందరూ సభ్యులందరూ కలిసి దాని కోసం పనిచేయాలి. తద్వారా అందరికీ గౌరవంగా జీవనోపాధి సంపాదించుకు నేందుకు అవకాశాలు అందాలి. బాగవుతుంది. ఆ పరంగానే దేశం బాగవుతుంది.

## రాజకీయ న్యాయం

సమానంగా, స్వేచ్ఛగా, న్యాయంగా అవకాశాలు ప్రజలకు కల్పిస్తూ వారిని రాజకీయాలలో పాల్గొనేలా చేయడం రాజకీయ న్యాయం. భయం, పక్షపాతం లేని రాజ్యం కావాలి. అందరికీ సమానంగా రాజకీయ హక్కులు సాధించడానికి పౌరులు ప్రయత్నం చేయాలి. ఎవరూ ప్రదానం చేయరు. బహుమతిగా దానం చేయరు. కష్టపడి సాధించాలి. లేకపోతే ఉత్త ఉపన్యాసాలే అవుతాయి. పౌరులందరికీ రాజకీయాల్లో పాల్గొనే హక్కు, స్వేచ్ఛ ఉండాలి. అదే ఉదార ప్రజాస్వామ్యాన్ని అవుతుంది. రాజ్యాంగ నిర్ణయసభ సమాపక సమావేశంలో ప్రసంగించిన సభాధ్యక్షుడైన డాక్టర్ రాజేంద్రప్రసాద్ (1949 నవంబర్ 26) "రాజ్యాంగంలో ఏది ఎలా ఉన్నా, ఈ దేశ ప్రజల సంక్షేమం అనేది దేశాన్ని పాలించే తీరు తెన్నులపైన ఆధారపడి ఉంటుంది. దేశాన్ని పాలించే వ్యక్తులపైన ఆ సంక్షేమం ఆధారపడి ఉంటుంది. ఇందుకు ఆ వ్యక్తులు నిజాయితీపరులయి ఉండాలి. వారికి దేశ ప్రయోజనాలు తప్ప మరొక యావ ఉండకూడదు" అన్నారు. ❑

# 'నియంత అంతం' వర్తమానంతో సరిపోలిన ఊహా చిత్రం

**ఆకార్ పటేల్ పుస్తక పరిచయం**


- కె.శ్రీనివాస్



భవిష్య పురాణం అని ఒకటుంది. అందులో విక్టేశ్వరి అనే రాణి భవిష్యత్తులో భారత దేశాన్ని పాలిస్తుందని రాశారట. అది నిజం అనుకునేవాళ్లు విక్టోరియా మహారాణి గురించి ఎప్పుడో చెప్పారని పౌరాణికులను మెచ్చుకుంటారు. అనుమానం ఉన్నవాళ్లు, ఆ పురాణంలోని అటువంటి ఆధునిక విశేషాలన్నీ తరువాత చేర్చినవని తెలుసు కుంటారు. వర్తమానాన్ని గతంలోకి పంపి, దాన్ని భవిష్యత్తుగా జోస్యం చెప్పగలగడం అమోఘమైన విద్య.మన 'ఘనత'నంతటినీ మూటగట్టి దాచిపెట్టిన గతకాలాన్ని మరింత గొప్ప చేయడానికి అది పనికివస్తుంది.

ఆకార్ పటేల్ రాసిన 'ఆఫ్టర్ మెస్సయ్య' నవలలో కూడా భవిష్య పురాణాన్ని పోలిన చమత్కారం కొంత ఉన్నది. విషయం మాత్రం పూర్తి భిన్నం. నవలలో స్థలకాలాలు ఏవీ నిర్దిష్టంగా చెప్పలేదు కానీ, ఇది రేపటి కాలాన్ని, సమాజాన్ని ఊహిస్తూ చేసిన ఫ్యూచరిస్టు రచన లాగా కనిపిస్తుంది. కానీ, కాల్పనిక భవిష్యత్తు పేరుతో రచయిత చెప్పింది మాత్రం పచ్చి వర్తమానాన్నే. ఎవరి తదనంతరాన్ని నవల చర్చించిందో, వారు పీఠం మీద కొనసాగుతున్నారు. సృజనాత్మక రచనలో ఊహలకు ఉండే అపరిమితత్వాన్ని రాజకీయ వివేకంతో ఆకార్ పటేల్ ఉపయోగించుకున్నారు. అధికార కేంద్రాన్ని ఆవరించుకుని ఉన్న హింసా బీభత్సాలను వ్యంగ్యంగా, గుంభనంగా, కొంటెగా, సాహసంగా చిత్రించే కథనాన్ని ఇందులో రచయిత ఆశ్రయించారు. దాదాపు ఏడాది కిందట ఆయన ఈ రచన చేశారు కాబట్టి, దీనిపై 2024 ఎన్నికల ఫలితాల, పర్యవసానాల ప్రభావం లేదు.

'నియంత అంతం' పేరుతో ఈ నవల 'మలుపు బుక్స్' ప్రచురణగా ఈ మధ్యే తెలుగులో వచ్చింది. 'వీక్షణం' సంపాదకులు, ప్రసిద్ధ రచయిత ఎన్.వేణుగోపాల్ దీనిని సమర్థంగా, సరళంగా అనువదించారు. తెలుగు పాఠకులకు అంతగా పరిచయం కాని రాజకీయ వాతావరణాన్ని, సన్నివేశాలను అనువదించడంలోను, మూల రచయిత ఉద్దేశించిన ధ్వని, వ్యంగ్యాలు తగ్గకుండా చూడడంలోను




**'నియంత అంతం'**

**రచయిత:** ఆకార్ పటేల్

**అనువాదం:** ఎన్.వేణుగోపాల్

**ప్రచురణ:** మలుపు బుక్స్

**కాపీ కోసం** 94900 98654

వేణుగోపాల్ నైపుణ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ నవల పఠనానుభవం ప్రత్యేకమైనది. నవలలోని పాత్రలు, వాటి స్వభావాలు పరిచయం అవుతున్న క్రమంలో రచయిత ఉద్దేశించిన వాస్తవ వ్యక్తులు స్ఫురించి, రెండో అర్థాన్ని కనిపెడుతున్న రహస్యానుభూతి మొదట కలుగుతుంది. తరువాత తరువాత, కథాగమనంలోను, పాత్రల సంభాషణ ల్లోనూ వ్యక్తమయ్యే దేశ అధికార వ్యవస్థల ప్రక్రియలను, వాటి లోగుట్టులను చదువుతున్నప్పుడు భయం వేస్తుంది. మనం వార్తల ద్వారా, ఇతరత్రా తెలుసుకున్న సంఘటనలు ఆయా సన్నివేశాలలోకి పొదుచుకు వచ్చి, మనకు ఒక జలదరింపు కలుగుతుంది. మొత్తంగా ఏదో ఒక అవగాహన కలుగుతుంది కానీ, ఆ తెలివిడి చాలా విచారాన్ని కూడా కలిగిస్తుంది.

పెద్దాయన చనిపోవడంతో కథ మొదలవుతుంది. ఆయన ఆకస్మిక మరణంతో ఉత్పన్నమయిన పరిస్థితితో తొలి అధ్యాయాలు కొనసాగుతాయి. జయేష్ షా, స్వామి అనే ఇద్దరు పెద్దాయన స్థానం కోసం పోటీపడతారు. వారిలో జయేష్ షా, పెద్దాయనకు కుడిభుజంగా ఉండేవాడు. కొంత కాలం ఆంతరంగిక భద్రతా శాఖ నిర్వహించాడు కూడా. మనుషులను, పరిణామాలను నియంత్రించడంలో ఆయనకు

తనదైన నిర్దాక్షిణ్యమైన పద్ధతులున్నాయి. రాష్ట్రాలలో పనిచేస్తూ ఉండిన స్వామి కూడా కొంత బలం పుంజుకుంటున్న నాయకుడు. ఈ ఇద్దరి తగవు తెగక, తాత్కాలిక ఏర్పాటుగా మీరా అనే సామాజిక కార్యకర్తను ప్రధాని చేయాలను కుంటారు. చనిపోయిన సీనియర్ నాయకుని కూతురు ఆమె. మీరా ఆదివాసులలో వారి హక్కుల కోసం పనిచేస్తూ ఉంటుంది. పదవిని స్వీకరించడానికి తటపటాయిస్తున్న మీరా మీద ఒత్తిడి తేవడానికి, ఆమె లాయర్ కూతురును జయేష్ షా అరెస్ట్ చేయిస్తాడు. పదవి స్వీకరించి ఏదన్నా చేయవచ్చునేమో అన్న చిన్న ఆశతో మీరా ప్రధాని అవుతుంది. ఆదివాసుల నుంచి భూమిని ప్రభుత్వం తీసుకోవడానికి వీలు లేకుండా ఒక బిల్లు తెద్దామనుకుంటుంది. దానికి అన్ని వైపుల నుంచి, చివరకు ప్రతిపక్షం నుంచి కూడా వ్యతిరేకత వస్తుంది. ఏకుమేకైన మీరాను దింపడానికి రిసార్టు రాజకీయం మొదలవుతుంది. చివరకు, పదవి నుంచి మీరా దిగిపోయి, తిరిగి ఆదివాసీ సమాజంలో పనిచేయాలని నిర్ణయించు కుంటుంది. నిజానికి ఈ కథలోని ఇతివృత్తం తప్ప, కథా గమనం ఏమంత గొప్పది కాదు. ఆకార్ పటేల్ ఈ నవల ద్వారా ప్రధానంగా చేసినవి రెండు. ఒకటి, పెద్దాయన చేసిన విధ్వంసం ఏమిటో ఆయన మరణానంతర సన్నివేశాల ద్వారా చెప్పదలచుకున్నారు. రెండు, సంకోచిస్తూనే ప్రధాని పదవి స్వీకరించిన మీరా పాత్ర ద్వారా, కీలక అధికార స్థానాల్లోకి మంచి వ్యక్తులు వచ్చినా వారు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటారనీ సూచించదలచారు. మొదటి అంశం ద్వారా, వర్తమానంలో చూస్తున్న దేశ స్థితిగతులను తీవ్ర విమర్శ నాత్మకంగా చిత్రించారు. రెండో అంశం ద్వారా, రాజ్యం, ప్రభుత్వం అధికారికంగానూ, అనధికారికంగానూ పనిచేసే విధానం, అందులో ప్రాబల్యాలు, ప్రయోజనాలు వ్యక్తమయ్యే తీరు పటేల్ చెప్పారు. కథాసారాంశాన్ని చదివిన వారికి, ఆయా పాత్రలు ఎవరెవరిని పోలి ఉన్నాయో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. రచయిత, తన మూలపాత్రల గురించిన స్ఫురణలను ఏ మాత్రం నియంత్రించాలనుకోలేదు. కథారంభంలో, చనిపోవడా నికి ముందు, ఒక ప్రభుత్వాస్పత్రి ప్రారంభోత్సవానికి పెద్దా యన అతిథిగా వస్తారు. అక్కడి సన్నివేశాన్ని రచయిత ఇట్లా వర్ణించారు. "...అక్కడ రెండు పెద్ద తెరల మీద జాతికి, ప్రత్యేకంగా వైద్య ఆరోగ్య రంగాలకు పెద్దాయన అందించిన కానుకల దృశ్యాలున్నాయి. ఆయన గతానికి సంబంధించిన కల్పనతో కూడిన సమాచారం ఉంది. ఒక చిన్న పిల్లవాడు ఒక పనికిరాని ఆస్పత్రి సిబ్బందిని మందలిస్తున్న నలుపు తెలుపు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. మరొక చిత్రంలో పెద్దాయన పోలికలతో ఉన్న యువకుడు కొవ్వొత్తి వెలుగులో వైద్య శాస్త్ర గ్రంథాలను శ్రద్ధగా చదువు తున్నాడు. ఈ చిత్రాలకు తోడుగా సైనికుల కవాతు శబ్దం వినిపిస్తోంది." పెద్దాయన చరిత్రను "నిర్మించడానికి" యంత్రాంగం పడుతున్న పాట్లు అవి. బాల్యంలోను, యవ్వనం లోనూ వైద్య శాస్త్రాన్ని ఆ పెద్దాయన అధ్యయనం చేశాడట. ఆ వేడుకలో ఆయన ఆహార్యం కూడా వైద్యులదే. మరి సైనికుల కవాతు శబ్దం ఎందుకు? అదే ఆకార్ పటేల్ ప్రత్యేకత! పెద్దాయన హయాంలో ప్రధానమంత్రి కార్యాలయం (ప్రమంకా) సమూలంగా మారిపోయింది. అన్ని మంత్రిత్వ శాఖలూ ఆయన ఆఫీసు నుంచే పనిచేసేవి.

"పెద్దాయన నేతృత్వంలో జరిగే భారీ ఘటనలూ, ఉత్సవాలూ రూపొందించడం మీదనే మంత్రిత్వ శాఖలు దృష్టి పెట్టేవి." "అప్పటికే పూర్తిగా తయారై, వేలు పెట్టడానికి అవకాశం లేని స్థితిలో మాత్రమే ఫైళ్లు మంత్రుల సంతకాల కోసం వాళ్ల దగ్గరికి వచ్చేవి." "పెద్దాయనకు వీలయినప్పుడు, లేదా ఆయన కు చెయ్యడానికి మరే పనీ లేనప్పుడు మంత్రివర్గ సమావేశాలు అనేవి జరుగుతుండేవి." ఇక ప్రజల అనుభవంలోకి వచ్చిన పెద్దాయన పాలనలో "అసమ్మతి అనే మాటకూ దేశద్రోహం అనే మాటకూ మధ్య విభజన రేఖ చెరిపివేయబడింది. పెద్దాయన అనే వ్యక్తికి అతీతంగా, బైట రాజ్యం అనేదే లేదనే పరిస్థితి తలెత్తింది". మరి, జయేష్ షా ఎట్లా ఉంటాడు? "..ఆయన మనుషులను పిలిచి కూచోబెట్టి మాట్లాడుతాడు. ఒత్తిడి చేస్తాడు. బలవంతపెడతాడు. సరే ఎట్లాగూ బెదిరింపులూ సాగుతాయి. ఆ గదిలో పుస్తకమనేది లేదు". అవసరమైన మనుషులందరి వ్యక్తిగత విశేషాలను, సామాజిక మాధ్యమాలలో నడవడిని నిశితంగా పసిగట్టి, వాటి ఆధారంగా చర్యలు తీసుకునే చాణక్యుడు జయేష్ షా. ప్రశాంతంగా ఎంతటి కర్కశమైన పనులైన చేయగల వ్యక్తిగా ఆ పాత్రను పటేల్ చిత్రించారు. ప్రధాన మంత్రి పదవి స్వీకరించే క్రమంలోను, ఆ తరువాత బాధ్యతలను నెరవేర్చడం మొదలు పెట్టిన కొత్తలోను మీరా, ప్రమంకా సిబ్బందితో సంభాషిస్తుంది. రిటైర్ కాబోతున్న ఉన్నతోద్యోగి జోషి, ఆ స్థానంలోకి రాబోతున్న ఆయేషా, ఆమె సహాయకుడు ప్రభు, మేనేజర్ మీరాతో ఎక్కువ సంభాషణలు చేస్తారు. ఒక సందర్భంలో అటార్నీ జనరల్ మీరాతో సంభాషిస్తారు. ఈ మాటల్లో అధికార స్వభావం గురించిన అనేక అనుభవసత్యాలు వ్యక్తమవుతాయి. రాజ్యం ఎప్పుడూ ఎవరో తన మీద దాడి చేయబోతున్నట్టు, తాను బలహీనంగా ఉన్నట్టు భావించుకుంటుందని, ఆదర్శానికీ పాలనకూ ఘర్షణ ఏర్పడిందని, పాలనను పటిష్ఠం చేసుకోవడం కోసం రాజ్యం అధికారాలు పెంచుకుంటూ పోయిందని అటార్నీ జనరల్ ఒక విశ్లేషణ ఇస్తాడు. "రాజ్యం అనేది హింసాత్మక సాధనం. అదేమీ ఆదర్శ సాధనం కాదు. అది ఎన్జీవో కాదు.. రాజ్యం అంటే హింస మీద గుత్తాధిపత్య అధికారం ఉన్న సంస్థ అని ఎవరో వర్ణించారు. దాన్ని అలాగే

నిర్వచించాలి. హింస ద్వారా నిర్వచించాలి. అది హింసాత్మకంగా ఉండడం మాత్రమే కాదు, హింసను తన చేతుల్లో గుత్తాధికారంగా మార్చుకుంటుంది. అంటే అర్థం, దాని గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించే వాళ్ల మీద దాడి చేస్తుంది". అనుభవజ్ఞుడైన ప్రమంకా మేనేజర్ ఒక సంభాషణలో మీరాతో అంటాడు. "..రాజ్యం అనేది ఒక హింసాత్మక రాజకీయ జంతువు. అసలు అది అట్లా ఉన్నందుకు ఉన్నత వర్గాలు దాన్ని చాలా ప్రశంసిస్తాయి. ప్రత్యేకంగా పెద్దాయన వంటి వ్యక్తులు దానికి నాయకత్వం వహిస్తే ఇంకా మెచ్చుకుంటాయి. హింసను ఎంత విజయవంతంగా వాడితే అంతగా ప్రోత్సాహకరమైన ప్రశంస అందుతుంది" అని ఆ మేనేజర్ మీరాకు కీలకసందర్భంలో స్పష్టత ఇస్తాడు. ఈ నవలలో పెద్దాయన పాలన ప్రజల వ్యతిరేకత వల్ల పోలేదు. మీరాను ప్రజలు ఎన్నుకోలేదు. రెండు పరిణామాలూ ప్రమాదవశాత్తూ జరిగినవే. అయితే, ప్రధానమంత్రి స్థానంలో ఒక కొత్త వ్యక్తి, ఆదర్శాలు మాత్రమే తెలిసిన వ్యక్తి రావడం వల్ల, ఆమె వైపు నుంచి అధికార కేంద్రాల సందర్శన పాఠకులకు సాధ్యమైంది. అప్పటి దాకా ఉన్న ఒక స్వాతిశయమూ స్వీయ ఆరాధకుడూ అయిన ఒక జనరంజక నియంత వ్యవహార సరళి ఎట్లా ఉన్నది, ఆయన చుట్టూ ఎటువంటి వ్యవస్థ పనిచేస్తున్నది చెప్పడానికి కూడా ఆస్కారం కలిగింది. ఆకార్ పటేల్ రాజకీయ విశ్వాసాలేమిటో తెలియదు కానీ, ప్రస్తుత వ్యవస్థ మరమ్మతుకు, ఆదర్శ వ్యక్తుల చేతిలో సంస్కరణకు ఆస్కారం ఇవ్వదని ఆయన ఈ నవల ముగింపులో చెప్పదలచుకున్నారా ? లేక, సాధికారతా సాధన అన్నది అట్టడుగు నుంచే మొదలు కావాలని కథానాయిక ద్వారా భావించారా ? ❑

# దేశ సంపదను లూఠీ చేస్తున్న కార్పోరేట్లను బహిష్కరించాలి

**(24వ పేజీ తరువాయి)**

ప్రభుత్వం పదేళ్లలో బడా బాబులకు రూ.14.56 లక్షల కోట్లు రైట్ ఆఫ్ చేసింది. కట్టకల్గిన స్థోమత వుండి ఉద్దేశ పూర్వకంగా ఎగవేస్తున్నారని బ్యాంకులే పేర్కొన్న వారికి రూ.79,000 కోట్లు రైటాఫ్ చేయబడింది. 2014 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకు సగటున సంవత్సరానికి రూ.7,187 కోట్లు రైటాఫ్ చేస్తూ వుండగా, 2023 నాటికి సగటున రూ.1.27 లక్షల కోట్లు మాఫీచేసాయి. అలాగేప్రైవేట్ బ్యాంకులు సగటున ఏటా చేసిన రైటాఫ్లు రూ.4,115 కోట్ల నుండి రూ. 84,000 కోట్లకు అనగా దాదాపు 20 రెట్లు పెరిగింది. ఈ ఋణమాఫీ పొందిన వారిలో 95% మంది గుజరాతీలు. ఇది చాలదన్నట్లు దివాళా పరిష్కారం (IBC కోడ్) మరియు (NCLT) పరిష్కార పద్ధతుల ద్వారా కార్పోరేట్లకు గరిష్ట స్థాయిలో మోడి ప్రభుత్వం లబ్ది చేకూరుస్తూ వుంది. 2016 నుండి 2023 మధ్యకాలంలో దాదాపు రూ.23 లక్షల కోట్ల బకాయిలు వున్న 7,325 కేసులలో దివాళా పరిష్కారంగా రూ.3.86 లక్షల కోట్లు మాత్రమే రాబట్టబడింది.

ఉదాహరణకు వీడియోకాన్ సంస్థ దాని అనుబంధ 12 సంస్థలు కలిసి మొత్తంగా రూ.71,433 కోట్లు బకాయిని, వేదాంత గ్రూపునకు రూ.2,962 కోట్లకు పరిష్కారం అయినది. అనగా బ్యాంకులకు 96% క్షవరం (Haircut) అయింది. మోడీకి మరొక అత్యంత సన్నిహితుడు అనిల్ అంబానికి చెందిన R.Com సంస్థ రూ.47,124 కోట్లు బకాయి వుండగా ముఖేష్ అంబానీకి రూ.456 కోట్లకే కట్టబెట్టబడింది. ఇంకా పలు కార్పోరేట్ వర్గాలకు లక్షల కోట్ల రూపాయల బాకీలు రద్దు చేయబడుతున్నాయి. ఈ కారణాల వల్లే సంయుక్త కిసాన్ మోర్చా కార్పోరేట్లను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. ఈ విధంగా ప్రజలు దాచుకున్న డిపాజిట్లు చేసిన సొమ్ములో అధికభాగం ఈ కార్పోరేట్లకే వెళుతూ వుండడం వల్ల రైతులు, కౌలు రైతులు, గ్రామీణ పేదలు, బలహీన వర్గాలకు ఋణపరపతి సౌకర్యం తగ్గిపోతూ అధిక వడ్డీలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి ఋణం పొందాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల సంఖ్య సగానికి తగ్గింది. తగ్గటమేకాక 1991 వరకు బ్యాంకు ఋణాలలో అత్యధిక భాగం చిన్న ఖాతాదారులకే వెళ్ళుతూ వుండగా ఆర్థిక సంస్కరణల దరిమిలా అధిక స్థాయిలో ఋణాలు పొందిన ఖాతాల సంఖ్య బాగా పెరిగింది.

వ్యవసా యం, అనుబంధ రంగాలకు, చిన్న పరిశ్రమలు, మున్నగు ప్రాధాన్యతా రంగాలకు ఋణం పేరుతో ఇవ్వవలసిన 18% లో ప్రత్యక్ష ఋణంగా 13.5% మరియు పరోక్ష ఋణం పేరుతో 4.5% వెళుతూ వుంది. మొత్తం వ్యవసాయ ఋణంలో 44% రైతులకు వ్యవసాయ ఋణంగా లభించగా, 56% పరోక్షపు ఋణంగా వ్యవసాయాధారిత, ఆహార పరిశ్రమ, విత్తన-పురుగు మందులు షాపులకు మున్నగువాటికి ఇవ్వబడింది. అంతేకాక వ్యవసాయ ఋణంలో 28% వ్యవసాయం చెయ్యకుండా పట్టణాలు మరియు మెట్రో నగరాలలో వుంటూ వున్న ధనిక రైతులకు వెళ్ళిందే తప్ప కౌలు రైతులలో అత్యధిక శాతం మందికి, సన్నకారు, చిన్న రైతులలో 40% మందికి బ్యాంకుల నుండి సహకారం అందటం లేదన్నది అనుభవమే!

**అందువలనే కార్పోరేట్లను బహిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా యిచ్చిన పిలుపును (ఆగస్టు 9) జయప్రదం చేయవలసిందిగా యావత్ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాము.** ❑

# పారిస్ కమ్యూన్ ఒక సామాజిక విప్లవ ఉషోదయం!

- వివిజయకుమార్



'కమ్యూనిస్టు లీగ్' మార్క్స్ ఎంగెల్స్‌లను మనం సాధించాలను కుంటున్న సమాజం ఎలా వుండాలో చెబుతూ ఒక ప్రణాళిక రాయమంది. 1848లో 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'లో వారి ఇరువురూ కమ్యూనిస్టు సమాజం ఎలా ఉండాలో, ఎలా ఉంటుందో చాలా ఉద్వేగంగా మార్గ దర్శనం చేశారు. అది నిజ మేనా ? నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం వహిస్తుందా ? అన్న సందేహాలు బోలెడు. ఎందుకంటే అప్పటి దాకా నడిచిన చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్ర కదా మరి? ఇరవై మూడేళ్ళ కు పారిస్ అనే ప్రయోగశాలలో తమ సిద్ధాంతానికి తొలి రుజువులు దొరికాయ్ ! ఇంక పరవాలేదు. ఈ తల్లకిందుల అమానవీయ ప్రపంచాన్ని మార్చడానికి తమ సిద్ధాంతం భేషుగ్గా పనికొస్తుందని గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నారు. అందుకే దాన్ని, చాలా ఉత్సాహంగా, "మానవ జాతినంతా, వర్గాల సమాజం నుండి, శాశ్వతంగా విముక్తం చేసే మహత్తర సామాజిక విప్లవ ఉషోదయం"గా ఎలుగెత్తి మరీ ప్రకటించారు! ప్రయోగం విజయవంతం కాకపోయినా ఫలితాల పరంగా చూసినప్పుడు అవి తాము అనుకున్న రీతిలోనే ఉన్నాయను కున్నప్పుడు ఒక శాస్త్రవేత్త ఎంత భావోద్వేగానికి గురౌతాడో మార్క్స్, ఎంగెల్స్‌లు అనే ఇరువురు సామాజిక శాస్త్రవేత్తలు కూడా ఇంచుమించు అలానే ఫీలయ్యారు.

"కార్మిక విముక్తికి వినూత్న మార్గం లభించింది" అంటూ పొంగిపోయాడు మార్క్స్! నిజానికి 'పారిస్ కమ్యూన్' డెబ్భై రెండు రోజులు బతికి బట్టకట్టింది. కానీ ఆ 72 రోజుల్లోనే (1871 మార్చ్ 18 నుంచీ మే 28 వరకూ) అది ఏం చేసిందో చూస్తే, కమ్యూనిస్టు సమాజం ఏర్పడితే, మౌలికంగా ఏ మార్పులు వుంటాయ్ అనే విషయాలు తెలుసుకోవాలనుకునే వారికి ఆసక్తికరంగా ఉంటుంది.

### 72 రోజుల్లో పారిస్ కమ్యూన్ ఏం చేసిందో చూడండి!

- ప్రజా ప్రతినిధుల్లో ఎవరైనా మెజారిటీ ప్రజల విశ్వాసం కోల్పోతే ఆ ప్రతినిధి తన పాలనాధికారం కోల్పోతాడు.
- పాత సైన్యం రద్దు చేసి జాతీయ రక్షణ దళాన్ని ఏర్పాటు చేసింది.
- ఆర్థిక, ఆహార, పౌర రక్షణ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం 10 కమీషన్ల ఏర్పాటు.
- రాజ్యం నుంచి చర్చిని వేరు చేశారు. చర్చి ఆస్తి జాతీయ ఆస్తి. ప్రభుత్వం మత సంస్థలకు డబ్బు ఇవ్వడం ఉండదు.
- జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్‌లు మత సంస్థలు చేయడం రద్దు.
- పాఠశాలల్లో మత బోధన రద్దు.
- మహిళా ఆధ్వర్యంలో మహిళా సైనిక దళం ఏర్పాటు.
- పారిపోయిన ఫ్యాక్టరీ యజమానులస్థానే కార్మికులు.
- నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు.
- యజమానులు వేసే అన్ని జరిమానాలు రద్దు.
- తాకట్టులో ఉన్న వాటిని ఉచితంగానే వెనక్కి తెచ్చుకునే అవకాశం.
- ఇళ్ళ అద్దెల చెల్లింపులకు గడువు పెంపు.
- మురికివాడల్లో నివసించిన వారికి ధనవంతుల ఇళ్లలో కొన్ని భాగాల కేటాయింపు.
- ఉచిత, నిర్బంధ విద్య.
- పారిపోయిన ధనవంతుల ఇళ్ళలో పాఠశాలల ఏర్పాట్లు.
- మహిళా కార్మికుల పని స్థలాల్లో వారి శిశువులకు ఏర్పాట్లు.
- బేకరీల్లో రాత్రి పూట పని రద్దు.
- నిర్బంధంగా సైన్యంలో చేర్చుకోవడం రద్దు.
- కమ్యూన్‌లో ఏ ఒక్కరి జీతం ఆరు వేల ఫ్రాంకులు దాటకూడదన్న నియమం.
- గిలిటెన్‌ని కాల్చి వేశారు.
- వెండోమ్ అనే విజయ స్థంభం కూల్చివేశారు.
- పాప పరిహార కట్టడం కూల్చివేత.
- కమ్యూన్‌లో ఓ విదేశీయుడికి చోటు! (ప్రపంచ కార్మికులు అంతా ఒకటే!)
- జైళ్లలో మగ్గే నిరపరాధుల విడుదల.
- మరణ శిక్షలు రద్దు.

ఇలా ఇంకా ఎన్నో చేశారు. ఎన్నో చేయాలని తలపెట్టారు. 1867లో జర్మన్ భాషలో కాపిటల్ వచ్చింది. 1872లో ఫ్రెంచ్ అనువాదం వచ్చింది. (పారిస్ కమ్యూన్ ఏర్పడింది

మిగతా 34వ పేజీలో

# ఫ్రెంచి వామపక్ష కూటమి ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమం !



- ప్రభాత్ పట్నాయక్

ఈ మధ్య యూరోపియన్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో పచ్చి మితవాద శక్తులు చెప్పుకోదగ్గ రీతిలో విజయాలు సాధించాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఫ్రెంచి పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించాడు. ఈ ఎన్నికల్లో మితవాద శక్తిగా ఉన్న లీపెన్‌ను ఢీకొనడానికి వామపక్ష పార్టీలలో నాలుగు న్యూ పాపులర్ ఫ్రంట్ పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, గ్రీన్ పార్టీలతోబాటు ఫ్రాన్స్ అన్‌బౌడ్ (ఇది జీన్ లూక్ మెలెం కన్ నాయకత్వంలో ఉంది) ఈ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఏర్పాటు ఒక చారిత్రక ప్రాధాన్యత కలిగినట్టిది. 1930 దశకంలో ఫ్రాన్స్‌లో పాపులర్ ఫ్రంట్ అనే కూటమి ఏర్పడింది. అప్పటికి యూరప్‌లో పెను ప్రమాదంగా ముందుకొచ్చిన ఫాసిజాన్ని, ముఖ్యంగా జర్మనీలో అధికారాన్ని చేజిక్కించుకున్న నాజీ హిట్లర్ ఫాసిజాన్ని ఎదిరించడానికి ఈ ఫ్రంట్ అప్పట్లో ఏర్పడింది. మళ్లీ ఇప్పుడు నయా ఫాసిజం యూరప్‌లో పెద్ద ప్రమాదంగా ముందుకొస్తున్న సందర్భంలో ఈ న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) ఏర్పడింది.

ఇప్పుడు ఎన్నికలలో ప్రధానంగా బరిలో ఉన్న వారిలో మాక్రాన్ సూటిగానే నయా ఉదారవాద విధానాలను బల పరుస్తున్నాడు. అతడి పార్టీకి విజయావకాశాలు బాగా తగ్గిపోయాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక తీవ్ర మితవాద శక్తిగా ఉన్న లీపెన్ పార్టీ ఆర్థిక విధానాల మీద ఎటువంటి స్పష్టతా ఇవ్వకుండా దాటవేస్తోంది. ఇప్పటికి ఆ పార్టీ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి కొంత అనుకూలంగా ఉంది. "సరైన తరుణంలో" అది బహిరంగంగానే గుత్త పెట్టుబడితో జట్టు కడుతుంది. మూడవ శక్తిగా ఉన్న ఎన్‌పిఎఫ్ తన ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమాన్ని స్పష్టంగా ప్రకటించింది. ఈ కార్యక్రమం ఉక్రెయిన్ యుద్ధం విషయంలో అమెరికాకు అనుకూల వైఖరిని తీసుకుంది. కూటమి భాగస్వాములైన సోషలిస్టులను కలుపుకు పోవలసి వున్నందున ఈ రాజీ అవసరమైంది. అదే విధంగా గాజాలో జరుగుతున్న ఊచకోత విషయంలో కూడా మరో భాగస్వామి అయిన మెలెం కన్ భావాలకు అనుగుణంగా వ్యవహరించింది. ఇలా కొన్ని అంశాలలో రాజీ పడినప్పటికీ, నయా ఉదారవాదం విషయంలో మాత్రం స్పష్టంగా పూర్తి వ్యతిరేక వైఖరిని తీసుకుంది.

నెలవారీ కనీస వేతనాన్ని పెంచడం, ఆహార దినుసులు, పెట్రోలు, గ్యాస్, విద్యుత్తు వంటి నిత్యావసరాల ధరలపై సీలింగ్ విధించడం, ఈ మధ్య మాక్రాన్ పెంచిన రిటైర్మెంట్ వయో పరిమితిని 64 నుండి తగ్గించడం (దీని వలన ప్రభుత్వం చెల్లించవలసిన పెన్షన్ల బడ్జెట్ పెంచాలి), పర్యావరణ రక్షణకు, పౌర సేవలకు కేటాయింపులు భారీగా పెంచడం వంటి ప్రతిపాదనలు ఎన్‌పిఎఫ్ కార్యక్రమంలో ఉన్నాయి. వీటన్నింటికీ అయ్యే అదనపు ఖర్చును ఎన్‌పిఎఫ్ జాగ్రత్తగా అంచనా వేసి లెక్కలు కట్టింది. ఆ అదనపు ఖర్చు కోసం ద్రవ్యలోటును పెంచకుండా అదనపు వనరుల సమీకరణకు ప్రతిపాదనలు చేసింది. తద్వారా యూరోపియన్ యూనియన్ ద్రవ్యలోటుపై విధించిన నియంత్రణకు లోబడి నడుచుకోవచ్చు. అదనపు వనరుల కోసం సంపద పన్నును మళ్ళీ ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించింది (దీనిని మాక్రాన్ గతంలో రద్దు చేశాడు). వివిధ రకాల పన్నుల వసూళ్లలో ఉన్న లోపాలను సరిచేయాలని ప్రతిపాదించింది. వారసత్వంగా సంపదను పొందేవారు ఒక పరిమితికి మించి ఆ సంపదను పొందకుండా ఉండేలా సీలింగు విధించాలని, ఆ సీలింగుకు మించి ఉన్న సంపదను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రతిపాదించింది.

ఇదంతా నయా ఉదారవాదానికి పూర్తి వ్యతిరేక దిశలో ఉంది. ఇన్నేళ్లుగా నయా ఉదారవాదం ప్రబోధిస్తున్న విషయాన్ని పరమ సత్యంగా ప్రధాన స్రవంతి మీడియా ప్రచారం చేస్తూ వస్తోంది. ఈ ప్రచారం ఒక్క ఫ్రాన్స్‌కే పరిమితం కాలేదు. భారతదేశంతో సహా యావత్ ప్రపంచమంతటికీ ఈ ప్రచారం సాగింది. ఒక సందర్భంలో (కరోనా అనంతర కాలంలో) అన్ని దేశాలూ కార్పొరేట్ పన్ను కనీసం 25 శాతం విధించాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చింది. దీనికి కారణం ఉంది. పెట్టుబడులను ఆకర్షించడం కోసం దేశాలు పోటీ పడి కార్పొరేట్ పన్నును తగ్గిస్తూ వచ్చాయి. పన్ను ఎక్కువగా ఉంటే పెట్టుబడులు తమ దేశానికి రావన్న ఆందోళన దీనికి కారణం. కాని దాని ఫలితంగా కార్పొరేట్ పన్ను రేటు మొత్తంగానే తగ్గిపోయింది. ప్రభుత్వాలకు రాబడి తగ్గిపోయింది. ఈ పరిస్థితి నుండి బయటపడడానికి అన్ని దేశాలూ కూడబలుక్కుని కార్పొరేట్ పన్ను కనీసం 25 శాతం ఉండేలా నిర్ణయించాలని ప్రతిపాదన వచ్చింది. కాని ఈ ప్రతిపాదన మీద చాలా దేశాలు రకరకాలుగా అడ్డుపుల్లలు వేశాయి. చివరకి కనీస కార్పొరేట్ పన్ను 15 శాతం ఉండేందుకు అంగీకారం కుదిరింది. ఐతే చాలా దేశాల్లో అప్పటికే అంతకన్నా ఎక్కువ పన్ను ఉంది. బడా

కార్పొరేట్లమీద అదనపు పన్నులు విధించడానికి ప్రభుత్వాలు ఎంత వెనకాడుతున్నాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది. ఇది నయా ఉదారవాదం పర్యవసానం. ఇటువంటి పరిస్థితిలో ఎన్‌పిఎఫ్ బడా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలని ప్రతిపాదించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక సంపద పన్ను విధించే విషయంలో ఎక్కువగా చేస్తున్న వాదన ఒకటుంది. ఈ సంపద పన్నును అమలు చేయడం చాలా కష్టం అని, దాని ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఆ పన్ను వసూలు కోసం ఏర్పాటు చేసే యంత్రాంగానికి అయ్యే ఖర్చు ఎక్కువ అని ఆ వాదన అంటుంది. భారతదేశంలో గతంలో ఉన్న సంపదపన్ను విధానాన్ని మార్చివేయడాన్ని సమర్ధించుకోడానికి ఈ వాదననే ముందుకు తెచ్చారు. సంపద పన్నును అరకొరగా వసూలు చేయడం, దాని ఫలితంగా వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని చూపించి అసలు సంపదపన్ను వసూలు చేయడమే దండగ అని చెప్పి ఏకంగా సంపద పన్నునే రద్దు చేయడం వాళ్ల వ్యూహం.

ఎన్‌పీఎఫ్ ఇప్పుడు ప్రతిపాదించినట్టే గతంలోనూ వేరు వేరు రాజకీయ కూటములు సంపదపన్ను విధించాలన్న ప్రతిపాదనలు ముందుకు తెచ్చాయి. అమెరికాలో గత అధ్యక్ష ఎన్నికల సందర్భంగా బెర్నీ శాండర్స్, ఎలిజబెత్ వారెన్ సంపద పెరిగే కొద్దీ దాని మీద విధించే పన్ను రేటును పెంచాలన్న ప్రతిపాదనలు చేశారు. అమెరికన్ పాలకవర్గం వారిద్దరూ డెమాక్రటిక్ పార్టీ తరపున అభ్యర్థులుగా నామినేట్ కాకుండా చూసుకుంది. ఆ కారణంగా వారి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఈ మధ్య ఫ్రెంచి ఆర్థికవేత్త థామస్ పికెటీ, అతడి బృందం భారతదేశంలో సంపద పన్నును తిరిగి ప్రవేశ పెట్టాలని సిఫార్సు చేశారు. ఈ బృందం ప్రపంచ అసమానతల గణాంకాలను నిత్యం పర్యవేక్షిస్తూ వాటిని తగ్గించడానికి సూచనలు చేసే సంస్థను నడుపుతోంది (వరల్డ్ ఇనీక్వాలిటీ డేటాబేస్). ఇటువంటి ప్రతిపాదనను ఇక్కడి వామపక్షాలు ఎప్పటి నుంచో చేస్తూనే వున్నాయి.

ఎన్‌పీఎఫ్ ప్రతిపాదించిన విధంగా వారసత్వ పన్ను వ్యవస్థను సమూలంగా మార్చడం ఏ ప్రజాస్వామ్య దేశానికైనా చాలా అవసరం. నిజానికి ఈ మార్పు పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. కొన్ని ప్రత్యేక లక్షణాలు, నైపుణ్యాలు కలిగివున్న వాళ్ళకి అందుకు ప్రతిఫలంగా సంపదను సమకూర్చుకునే హక్కు ఉండాలే తప్ప ఆ ప్రత్యేకతలతో, నైపుణ్యాలతో నిమిత్తం లేకుండా కేవలం సంపన్నులకు సంతానంగా జన్మించినందు వల్ల ఆ తల్లిదండ్రుల సంపదపై హక్కు పొందడం న్యాయం కాదు అన్నదే పెట్టుబడిదారీ సిద్ధాంతం. అంతేకాదు, వారసత్వ పన్ను అనేది సంపద పన్ను వసూలు పక్కాగా అమలు జరగడానికి తోడ్పడుతుంది. ఈ రెండు రకాల పన్నులనూ అమలు చేసినప్పుడే పన్నుల చట్రం నుండి ఆ అతి ధనవంతులు తప్పించుకోలేరు. కాని ఈ మధ్య ఒక కాంగ్రెస్ పార్టీ నాయకుడు వారసత్వ పన్ను ప్రతిపాదనను చేస్తే (వామపక్షాలు ఎప్పటి నుంచో చేస్తున్నాయి) ఆయన మీద మొత్తం మన మీడియా యావత్తూ విరుచుకు పడిపోయింది. ఇక ప్రధాని నరేంద్ర మోడీ అయితే ఆ ప్రతిపాదనను దారుణంగా వక్రీకరించి హిందూ స్త్రీల తాళిబొట్లను లాగేసుకుని ముస్లింలకు అప్పగించడానికే కాంగ్రెస్ ఈ ప్రతిపాదన చేసిందంటూ ప్రచారానికి దిగాడు! ఎన్‌పిఎఫ్ ప్రతిపాదనలో కేవలం వారసత్వ పన్ను విధించడం మాత్రమే కాదు, వారసత్వంగా సంక్రమించే సంపద మీద కూడా సీలింగు విధాంచాలని ఉంది. ప్రస్తుత పరిస్థితిలో దీనికి చాలా ప్రాధాన్యత ఉంది.

ఇక పౌర సేవల కోసం ప్రభుత్వం చేసే ఖర్చు పెంచాలన్న ప్రతిపాదన చాలా ప్రాముఖ్యత కలిగి వుంది. విద్య, వైద్యం వంటి రంగాలను ప్రయివేటీకరించడం వలన కలుగుతున్న హాని అంతా ఇంతా కాదు. ఇది మన దేశపు స్వంత అనుభవం. ఐతే ఈ రంగాలలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం నయా ఉదారవాదానికి ఎంతమాత్రమూ అంగీకారం కాదు. ఈ రంగంలో ప్రైవేటు కార్పొరేట్లకు అపార లాభాలు వస్తున్నాయి. నిజానికి మన దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగకుండా కొనసాగడానికి ఈ రెండు రంగాలనూ ప్రైవేటీకరిచండమే కారణం. తమ బిడ్డల విద్య కోసం, కుటుంబ సభ్యుల వైద్యం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు చాలా ఎక్కువ.

ఇక నిత్యావసరాల ధరలపై సీలింగు విధించాలనే ప్రతిపాదన కూడా ముఖ్యమైనది. సామాన్య ప్రజల్ని ఇది ధరాభారం నుండి కాపాడుతుంది. కాని ఇది పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకం. నిజానికి పెట్టుబడిదారీ విధానం ధరలు తగ్గాలంటే డిమాండ్ తగ్గాలని, అందుకోసం ప్రజల కొనుగోలు శక్తి తగ్గాలని వాదిస్తుంది. మరింత నిరుద్యోగాన్ని పెంచితే అటు వేతనాలూ తగ్గి, ఇటు డిమాండూ తగ్గి ధరలు వాటంతట అవే తగ్గిపోతాయన్నది పెట్టుబడిదారీ సిద్ధాంతం. దీనికి భిన్నంగా నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని వామపక్షాలు ఎప్పటినుంచో చేస్తున్న డిమాండ్ ఇప్పుడు ఒక సంపన్న పెట్టుబడిదారీ దేశం ఫ్రాన్స్‌లో ప్రతిధ్వనిస్తోంది.

నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయం ఏమీ లేదంటూ చాలా కాలంగా పనికిమాలిన ప్రచారం సాగుతూనే వుంది. ఇప్పుడు ఎన్‌పీఎఫ్ ప్రతిపాదించిన కార్యక్రమం దానికి పూర్తిగా భిన్నంగా, ఒక కొత్త దనాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఫ్రాన్స్‌లోని బూర్జువా మీడియా, కొందరు రాజకీయవేత్తలు, నయా ఉదారవాదాన్ని సమర్ధించేవారు మొదలు, పచ్చి మితవాదులు–అందరూ విరుచుకుపడుతున్నారు. ఈ కార్యక్రమం గనుక అమలులోకి వస్తే ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ యావత్తూ సర్వనాశనం


అయిపోతుందంటూ ప్రజల్ని భయపెట్టే కథనాలు ప్రచారం చేస్తున్నారు. కాని ఇప్పటి వరకూ ఒపినియన్ పోల్స్‌లో ఎన్‌పిఎఫ్ 26 నుండి 28 శాతం వరకూ ప్రజల మద్దతు పొందుతున్నట్టు, పచ్చి మితవాది లీ పెన్ పార్టీకి 31 శాతం మద్దతు ఉన్నట్టు, మాక్రాన్ పార్టీకి 20 శాతం కన్నా తక్కువ మద్దతు ఉన్నట్టు తేలింది. ఫాసిజాన్ని ఓడించడానికి తమ నడుమ ఉన్న అన్ని విభేదాలనూ పక్కనబెట్టి ఫ్రెంచి వామపక్ష పార్టీలు ఐక్యంగా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. మెలెంకన్‌తో దీర్ఘకాలంగా శత్రుత్వ వైఖరి కలిగివున్న సోషల్ డెమాక్రటిక్ పార్టీ నాయకుడు గ్లక్స్‌మన్ ఆ వైఖరిని విడనాడి ఎన్‌పిఎఫ్‌కు మద్దతు ప్రకటించాడు. ఒకవేళ ఎన్‌పీఎఫ్ గనుక గెలిస్తే తనకే ప్రధాని పదవి దక్కాలని పట్టు పట్టబోనని మెలెంకన్ ప్రకటించాడు. ఈ విధంగా తమ తమ పదవీ కాంక్షల్ని, సైద్ధాంతిక విభేదాలను సైతం పక్కనబెట్టి పచ్చి మితవాద శక్తులకు అధికారం దక్కకుండా చేయాలన్న పట్టుదలను వారంతా ప్రదర్శించడం గొప్ప విషయం. నయా ఉదారవాద చట్రం పరిధిని అతిక్రమించి ఒక కొత్త మార్గాన ఆర్థిక వ్యవస్థను నడిపించాలన్న దృక్పథంతో రూపొందిన కొత్త కనీస ఉమ్మడి కార్యక్రమం అంతకన్నా గొప్పవిషయం. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది పక్కన పెడితే, ఒక సంపన్న పెట్టుబడిదారీ దేశంలోనే నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయం ఈ విధంగా తలెత్తడం కొత్త ఆలోచనలకు తెరతీస్తోంది. ❑

# పారిస్ కమ్యూన్ ఒక సామాజిక విప్లవ ఉషోదయం!

(31వ పేజీ తరువాయి)

1871 మార్చి చివరిలో) పారిస్ కమ్యూన్ విప్లవంలో ఉన్న వారికి కాపిటల్ ఎందరికి తెలిసో కూడా సందేహమే! అసలు విప్లవకారులు బ్లాంకీ గానీ, రిగాల్ట్ గానీ, వార్లేన్ గానీ, లూసీ మిషెల్ గానీ ఏ ఒక్కరూ సోషలిస్టు భావాలకు మించి ఎదగని వారు. అయినా ఎంతో గొప్ప నిబద్ధతతో ప్రాణాలను ఫణంగా పెట్టి తాము చేయగలిగినదంతా చేశారు. చుట్టూ జర్మన్ సేనలు తోడేళ్ళలా పొంచి వున్నా, స్వదేశీ సేనలు నిరంతరం ఈ 'భయంకరమైన' మార్పులను ఏవగించుకుంటూ జీర్ణం చేసుకోలేక దాడులు చేస్తున్నా మానవ జాతి అసలెలా బతకాలో, కొంచెం ఇతర మనుషుల పట్ల రవ్వంత సానుభూతి వున్నా ఈ ప్రపంచాన్ని ఎలా నందనవనం చేసుకోవచ్చో కేవలం 72 రోజుల్లోనే ప్రపంచానికి చాటి చెప్పింది ఈ పారిస్ కమ్యూన్ అనే ప్రయోగం! మనిషి నమ్మకం వమ్ము కాదు ! మార్క్స్ ఎంగెల్స్‌ల శాస్త్రీయ భావనలు వమ్ము కావు! ఇంత అన్యాయంగా, ఇంత ఘోరంగా, ఇంత నీచంగా తోటివాణ్ణి వేధిస్తూ, వారి శ్రమ మీద పడి కల్మషాన్నికతకడం చాలా జుగుప్స కలిగించే విషయమనీ, రోత పుట్టే వ్యవహారం అనీ ఎప్పటికైనా తన శ్రమ మీద తాను బతకడమొక్కటే మనిషనే వాడికి మిగిలే ఏకైక తాత్విక సూత్రం అని పారిస్ కమ్యూన్ చాలా ధృడంగానే సందేశాన్నిచ్చింది. దీని కోసం 30 వేల మంది ప్రాణాల్ని శత్రువుకిచ్చింది. 40 వేల మంది జైళ్లలో బందీలై చిత్రహింసలు అనుభవించారు. 650 మంది పసి కూనలు అరెస్టయ్యారు. పారిస్ కమ్యూన్ ఏం చెప్పింది? మనిషి ఇంకా తనతోనే తోడు తెచ్చుకుంటున్న ఒక అమానుష ప్రవృత్తి, అదే, 'ఇతరుల శ్రమని దోచుకు తిని బతికే' ఒక అమానవీయ ప్రవృత్తి నుంచి కచ్చితంగా వదిలించుకుని బతికే రోజు వస్తుందని రూఢిగా చెప్పింది! ఒక సత్యాన్ని నిబ్బరంగా ప్రకటించింది! అందుకు మనం ఏం చెయ్యాలో చెప్పింది ! తను మరణిస్తూ ఈ నిజాన్ని బతికించుకొనే మార్గం చెప్పి నిష్క్రమించింది! అందుకే పారిస్ కమ్యూన్ ఒక మహత్తర సామాజిక విప్లవ ఉషోదయం! రంగనాయకమ్మ గారు రాసిన 'పారిస్ కమ్యూన్' (సామాజిక విప్లవ ఉషోదయం) పుస్తకంలో, మార్క్స్ ఎంగెల్స్‌లు స్వయంగా ఈ ఉద్యమాన్ని పరిశీలిస్తూ ఎటువంటి భావోద్వేగాలతో ఎంత ఆర్తితో ఎలా స్పందించారో తెలుసుకోవడానికి ఈ పుస్తకాన్ని కచ్చితంగా చదవాలి! ❑

## స్వీకారం




**రచయిత–ఎస్ఆర్ పృథ్వీ – వెల 100**

ప్రతులకు : P.Usha Rani-104-6-140-
MG Street-Ramakrishna Nagar-
Rajamahendravaram- 533101 -
Cell : 99892 23245

# మార్క్స్ జన్మస్థలం ట్రైయర్ కళా సంపదకు నిలయం



-బుడ్డిగ జమిందార్

ట్రైయర్ జర్మనీ పురాతన నగరం. రోమన్ చక్రవర్తి ఆగస్టస్ పాలనలో క్రీ.పూ.16లో స్థాపించినది. పోర్టా నిగ్రా వంటి పురాతన కళా సంపదకు, స్మారక చిహ్నాలకు ముఖ్యమైన ప్రదేశం ఈ నగరం. లక్సెంబర్గ్ సరిహద్దుకు సమీపంలో సుందరమైన మోసెస్ లోయకు పైభాగన ఈ నగరం ఉన్నది. ఇక్కడ అరుదైన చరతురస్రాకార మార్కెట్లను, అనేక ఉత్తమ రోమన్ శిథిలాలను చూడవచ్చు. క్షీణించే పశ్చిమ రోమన్ సామ్రాజ్యానికి కాంస్టాంటైన్ చక్రవర్తి పశ్చిమ రోమన్ రాజధానిగా ఈ నగరాన్ని తీసుకొన్నాడు. రోమన్ చక్రవర్తుల తర్వాత బిషప్పు, ఎలెక్టర్లు, సాధారణ ప్రజలు ట్రైయర్న్ నిర్మించారు. చాలా చిహ్నాలు యునెస్కో స్మారక వారసత్వ హోదాను కలిగి ఉన్నాయి. సెయింట్ పీటర్స్ కేథడ్రల్ వంటి మధ్యయుగ కాలపు నాటి అనేక భవనాలు ఈ నగరం నిండా కనబడతాయి.

వీటన్నిటినీ మించి ప్రపంచ దృష్టిని పోర్టా నిగ్రా సమీపంలోని ఒక రెండస్తుల బరోక్ భవనం మళ్లించింది. ఈ భవనంలోనే విశ్వ విఖ్యాత తత్వ శాస్త్రవేత్త, ఆర్థిక శాస్త్రవేత్త చరిత్రను ఔపాసన చేసినవాడు, మానవ పుట్టుక నుండి రాజకీయ, ఆర్థిక సంబంధాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన సామాజిక ఆర్థికవేత్త, సామాజిక స్పృహ కలిగి దోపిడీలకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని నింపిన ఆలోచనాపరుడు ప్రపంచ ప్రసిద్ధ 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' రచయితలో ఒకరిగా నిల్చిన కార్ల్ మార్క్స్ 1818 మే 5లో ఈ నగరంలోనే జన్మించాడు.

కార్ల్ మార్క్స్ తన 17వ ఏట వరకూ ఈ నగరంలోని ఫెడరిక్ విల్ హెమ్ జెమ్నాజియంలో తన స్కూల్ విద్యను పూర్తి చేసి తదుపరి ఉన్నత విద్యకై బోన్, బెర్లిన్ నగరాలకు వెళ్లాడు. ఈ ఇంటి ప్రాముఖ్యతను 1904 వరకూ ప్రపంచం అంతగా గుర్తించనప్పటికీ, ఆ తర్వాత కాలంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఈ ఇంటిని వశపర్చుకోడానికి ప్రయత్నించి 1928లో విజయం సాధించినప్పటి నుండీ ప్రాముఖ్యత ఏర్పడింది. 1933లో హిట్లర్ నాజీ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ భవనం జప్తుకు గురైంది. తదనంతరం ప్రింటింగ్ హౌస్గా మార్చారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1947 మే 6లో ఈ భవనాన్ని కార్ల్ మార్క్స్ జీవిత, రచనల మ్యూజియంగా ప్రారంభించారు. 1968లో ఫ్రెడరిక్ ఎలర్ట్ ఫౌండేషన్లో విలీనం చేశారు. ఈ ఫౌండేషన్ ఎస్పీడీ పార్టీకి సన్నిహితమైనది. 1983 మార్క్స్ 100వ వర్ధంతి నాడు భవనాన్ని మూడు అంతస్థులకు విస్తరించటానికి పూనుకొని ఒక సంవత్సర పునర్నిర్మాణం తర్వాత తిరిగి తెరిచారు. 2018 సంవత్సరంలో ఈ నగరంలో కార్ల్ మార్క్స్ ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా ట్రైయర్ కౌన్సిల్ తీర్మానంతో 2,300 కిలోల బరువుగల కాంశ్య విగ్రహాన్ని చైనా బహుకరించగా ఆవిష్కరించారు. ఈ విగ్రహం సుమారు 19 అడుగుల ఎత్తు ఉంటుంది.

"కార్ల్ మార్క్ ఈ నగరానికే గాక ప్రపంచ సుప్రసిద్ధ పౌరులలో మేటి పౌరుడు అనే సత్యాన్ని మనం దాచకూడదు" అని ట్రైయర్ మేయర్ వోల్ఫ్రామ్ లీబే అన్నారు. ఫ్రాక్ కోటులో ఆలోచనాత్మకంగా ఉన్న మార్క్స్ ఎడమ పాదంతో ముందుకు వెళ్తున్నట్లు ఈ విగ్రహాన్ని చిత్రీకరించారు. ఇటువంటి చారిత్రాత్మక నగరంలో ఉన్న కార్ల్ మార్క్స్ మ్యూజియంను కాంశ్య విగ్రహాన్ని ప్రస్తుతం జర్మనీలో ఉన్న నాకు సందర్శించుకునే సదవకాశం పది రోజుల క్రితం నాడు దక్కింది. ఆ మహనీయుని విగ్రహానికి మనందరి తరపున, విజయవాడ కార్ల్ మార్క్స్-ఎంగెల్స్-లెనిన్ విగ్రహాల కమిటీ తరపున నివాళులర్పించే అరుదైన అవకాశం నాకు దక్కింది. ఉత్కంఠగా జరిగిన నా ప్రయాణం తర్వాత విగ్రహం ముందు, మార్క్స్ మ్యూజియం ముందు నిల్చున్నప్పుడు ఏర్పడిన నా మనోభావాలు వర్ణనాతీతమైనవి. ప్రపంచంలో ప్రతి కమ్యూనిస్టు, సామాజిక ప్రగతిశీల మార్పు కోరుకునే ప్రతివ్యక్తి ఈ నగరానికి రావాలనుకోవడం అతిశయోక్తి కాదేమో! 2018లో విగ్రహావిష్కరణ తర్వాత మ్యూజియంలోని అతిథుల పుస్తకంలో సందర్శకులు అనేక వందల మంది తమ అభిప్రాయాలను రాశారు. వాటిలో కొన్నింటిని ప్రపంచ సోషలిస్టు వెబ్సైట్ ఆన్లైన్ పత్రికలో, ఈ క్రింద ఉదహరించిన కొన్ని అభిప్రాయాలను కార్ల్ మార్క్స్ గురించి ఉంచింది.

**'ఒక స్నేహితుడు', 'నాకు మానవ జీవితంపై అవగాహన కల్పించిన వ్యక్తికి ధన్యవాదాలు'. 'నా రోల్ మోడల్', 'తను తిరిగి వచ్చాడు', 'అభినవ కమ్యూనిస్టు', ది గ్రేటెస్ట్ ఇంటర్ ప్రెటర్ ఆఫ్**


**(మిగతా 38వ పేజీలో)**

# నేను కమ్యూనిస్టును ఎలా అయ్యాను ?



- నాజర్

**కళల మీద ప్రీతి, పేదరికపు బాధ, నా స్థానమెక్కడో చూపించాయి. పుట్టింది పేద ముస్లిం కుటుంబంలో. నా తాతల నాటి నుండి - సన్నాయి వాయిద్యానికై ఇవ్వబడిన దేవుడి మాన్యం 34 ఎకరాలు మాత్రం వుంది. అదైనా మెట్ట పొలం. చిన్నప్పటి నుండీ సంగీతమంటే - చెవి కోసుకునేవాడిని. నన్ను చాగా చదివించాలనీ... గొప్పవాణ్ణిగా చేయాలని - తల్లి దండ్రుల కోరిక. ఐదో ఏట పొన్నెకల్లు (గుంటూరు తాలూకా) బడిలో వేశారు. 4వ తరగతి చదువుతూండగా బడిలో పంతులు గారు వేయించే ఏకాంక నాటికలలో నటించే వాణ్ణి. ప్రథమ బహుమతులు వచ్చేవి.**




ఒకనాడు మా చేత నాటకం వేయించాడు మా పంతులు గారు. నాటకానికి బాలరత్న సభ(తెనాలి)కు చెందిన హార్మోనిస్టును పిలిపించారు. నేను మంచి నటకుడిగా రాణించగలనని తెలుసుకున్నాడా హార్మోనిస్టు. తన కంపెనీ డైరెక్టర్‌తో చెప్పాడు. వెంటనే నన్ను బాలరత్న సభలోకి తీసుకున్నారు. చదువుకు స్వస్తి చెప్పి కంపెనీలో చేరా.

"నాజర్" అనే ముస్లిం పేరు బాగుండదనుకున్నారు గాబోలు "గోపి" అని మారు పేరెట్టారు. రామదాసులో కబీరు, ఇతర నాటకాలలో స్త్రీ పాత్రలూ ధరించేవాణి. పొగడ్తలూ, బంగారు పతకాలూ వచ్చేవి. కాని, ఖర్చులు గాక నెలకు రూ.15/-లు మాత్రం ఇచ్చేవారు కంపెనీవారు. 1935లో కంపెనీ ఆర్థికంగా చితికిపోవడంతో ఆ రాబడి పోయింది.

నా తండ్రి చాలా నిరుత్సాహపడ్డాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేక, నన్ను అభివృద్ధి చేయడానికి ఏ మార్గమూ కనిపించక ఎప్పుడూ దిగులు పడుతూండే వాడు. చివరకు ధైర్యం చేసి నర్సరావుపేటలో సంగీతం పంతులు గారి వద్దకు పంపించాడు. తన రెక్కల కష్టం నుండి ఎలాగో మిగిల్చి నెలకు రూ.3/- చొప్పున నాకు పంపించేవాడు. పంతులు గారు సంగీతం ఉచితంగా చెప్పబట్టి.. ఆ మూడు రూపాయలతోనూ ఎలాగో ఒకలాగు పొట్ట పోసుకుంటూ విద్యాభ్యాసం సాగించా. కాని కొన్నాళ్ళకు ఆ మూడు రూపాయల మొత్తం కూడా మోయరాని బరువైపోయింది తండ్రికి. నిరాశ చెందాడు. ఏం చేస్తాం ? ఇక మానుకో నాయనా.. అంటూ కంటతడి బెట్టాడు. నా శరీరమంతా నీరైపోయింది. పంతులు గారు జాలిపడి, తానే తిండి పెట్టి సంగీతం నేర్పుతానన్నారు. ఆరు మాసముల కాలం ఆ విధంగా చెప్పారు. హఠాత్తుగా తండ్రి మరణించాడు. నా నడుం విరిగిపోయింది. గత్యంతరం లేక ఇంటికొచ్చా.

ఇల్లు గడిచే దారి లేదు. తల్లిని పోషించే బాధ్యత నా మీదే వుంది. 'నేనెలాగో బ్రతుకుతాను, నీవు పోయి చదువుకో'మని తల్లి ధైర్యం చెప్పసాగింది. ఈమారు తాడికొండ సంగీతోపాధ్యాయుల వద్ద కెళ్లా. తెలిసిన వారవడం చేత పంతులు గారు ఉచితంగానే చెబుతామన్నారు. కాని, తిండి సమస్య పెద్దదయింది. వారాలు చేసుకోవడం కోసం ప్రయత్నించినా లాభం లేకపోయింది. సంగీతం, చాలించడమా ? సాధించడమా ? అన్న సమస్య. తీవ్రంగా ఎదుర్కొంది. చివరకు సాధించడానికే నిశ్చయం చేసుకుని 'నేను జోలె కట్టుకుంటానండీ' అన్నా పంతులు గారితో. ఆయన ఆశ్చర్యపోయాడు. పట్టుదలకెంతో మెచ్చుకొని, ప్రోత్సాహకరంగా ఒక అంగ వస్త్రాన్ని ఇచ్చాడు. అంగ వస్త్రాన్నే జోలె కట్టుకున్నా. ఉదయం, సాయంత్రం ఇళ్ళ వెంట తిరిగా. పాటలు పాడించి పట్టెడన్నం పెట్టేవారు తాండికొండు ప్రజలు. కొన్నాళ్లు అయ్యే సరికి మా పంతులు గారి వద్దకొక విద్యార్థి వచ్చాడు. ఆయన నాకు నకలే. కాని భిక్ష మెత్తుకోవడం నామోషీగా తోచిందతనికి. నేనే మరి కాస్త భిక్ష మెత్తి అతణ్ణి పోషించా. ఈ విధంగా ఏడాది కాలం గడిచింది.

కడుపు నిండా అన్నం దొరుకుతోంది. కాని, కంటినిండా

నిద్ర లేదు. నా స్థితిని చూచుకుని, నాలో నేనే కుమిలిపోయే వాడిని. 'ఎంత కాలం ఇలా బ్రతకడం ? తల్లిని పోషించడ మెలా ? ఈ సంగీతంలో ఎన్నాళ్ళకు నిపుణత్వం సంపాదించ గలను ? కుటుంబాన్ని పోషించగలిగే స్థితికి ఎప్పటికి రాగలను ? అంత వరకూ అడుక్కు తినవలసిందేనా ? నేనడుక్కుతింటూ జీవిస్తా. కాని, వృద్ధురాలైన తల్లి మాటేమిటి ? ఆమె కూడా తిరిపె మెత్తవలసిందేనా ? కాదు.. కాలు చేతులు తిన్నగా వుండి కష్టించి పొట్ట పోసుకోగలిగిన శక్తి ఉన్నప్పుడు అడుక్కు తినడం – ఆత్మ గౌరవానికి భంగకరం' అనుకున్నా. నిరాశతో కూడిన విరక్తితో సంగీతానికొక సలాం కొట్టి ఇంటికొచ్చా.

'మడిదున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ' అనే 'పోతన' నీతి జ్ఞాపకమొచ్చింది. అప్పుదెచ్చి రెండు దున్నలను కొని వ్యవసాయం బెట్టా. ఎంత బండ చాకిరి చేసినా. ఫలితం మాత్రం అల్పంగా వుండేది. ఆ కౌలు సేద్యంలో మేపలేక ఒక దున్ననమ్మివేసి, వ్యవసాయం ఎత్తివేశా. ఇక జీవించడానికే మార్గమూ కనిపించక కూలికి బయలుదేరా. మిరప కోతలకు, జొన్న కోతలకు వెళితే రోజుకు ఎనిమిదణాల వరకూ గిట్టేది. కాని సంవత్సరం పొడుగునా ఇలాంటి కూలి పని ఎలా దొరుకు తుంది ? అంచేత పొగాకు కంపెనీలో కూలికి వెళ్ళి ముఠాలో చేరా. మా ముఠాలో ఏబది మందిమి పనిచేసేవారం. అలసట లేకుండా, పెండెలు కట్టడం వగైరా పనులన్నీ పూర్తి చేసుకుని, సాయంత్రం మా ముఠా చేసిన పనిని గూర్చి వివరంగా లెక్కలు రాసేవాణ్ణి నెలాఖరుకు జూస్తే, కంపెనీ లెక్కకూ – మా లెక్కకూ రూ.25/– తేడావచ్చింది. కంపెనీలో పనిజేసే కూలీలెవరూ స్వంత లెక్కలు రాసుకునేవారు కాదు. కండలు కరిగించి, బండ చాకిరి చేసి కూడా కంపెనీ వారిచ్చిందే మహా ప్రసాదం అనుకుంటూ కిక్కురుమనకుండా పట్టుకుపోయే వారు. అంచేత నేను వివరంగా లెక్కలు చూపించి, రూ.25/–లు విరగ గోయడమేమిటని నిలదీసి అడగడాన్ని సంహిచలేకపోయాడు కంపెనీ యజమాని. ఈ జాడ్యమే, కూలీలందరికీ అంటుకుం టుందేమోనని అనుకున్నాడు. గుడ్లెర్ర జేస్తూ "పనిలో నుండి తొందరగా బయటికి దయచేయండ"న్నాడు. చేసేది ఏమీ లేక, రెండో దున్ననమ్మి. కుట్టుమిషన్ కొన్నా. మిషన్ కుడుతూనే, ఊళ్లో పిల్లలకు సంగీతం నేర్పేవాణ్ణి, సంవత్సరం గడిచేటప్పటికి రెండు వందలు వెనకేశా. కాసిని గాదు.. కూసిని గాదు. రెండు వందల రూపాయలు. రెండు వందలు సంపాదించడమంటే నాబోటి గర్భ దరిద్రుడికి సామాన్యమైన విషయం కాదు. పట్టరాని సంతోషంతో కష్టారితమైన రెండు వందలూ బెట్టి... పెళ్ళి చేసుకున్నా.

గారపాడు (సత్తెనపల్లి తాలూకా)లో అత్తవారింటి వద్ద వుండగా, చుట్టుప్రక్కల గ్రామాల యువకులతో ఎక్కువగా పరిచయం ఏర్పడింది. నెల జీతం పద్ధతి మీద, నాటకాలు నేర్పమన్నారు యువకులు. క్రమేణా నెలకు రూ.30/– నుంచి రూ.75/–లకు పెరిగింది సంపాదన. సంసారం ఒడుదుడుకులు లేకుండా, సాఫీగా నడిచిపోతోంది.

నాటక దళాలను తయారు చేస్తూ, స్వగ్రామమైన పొన్నెకల్లు వస్తూ పోతూ వుండగా, పొన్నెకల్లులోని పార్టీ సభ్యులతో పరిచయం కలిగింది. వారు నాకు రాజకీయ పుస్తకాలూ స్వతంత్ర భారత్ పత్రిక ఇచ్చేవారు. స్వతంత్ర భారత్ చదువుతూంటే కమ్యూనిస్టు పార్టీ కష్టజీవుల పార్టీ అని, స్వాతంత్ర్యం కోసం కూలీ రైతుల అభివృద్ధి కోసం ఎడతెగ కుండా నిరంతరం పనిచేస్తూన్న పార్టీయనే భావం కలిగింది. అక్కడి నుంచి ఎక్కువగా రాజకీయపుస్తకాలు చదువడం ఆరంభించా. "ఇంకేముంది" కమ్యూనిస్టు పుస్తకాలు చదువు తున్నాడు మీ అబ్బాయి, పోలీసులు పట్టుకు పోతారమ్మో:" అని ఎవరో మా తల్లిని భయపెట్టారు. ఒకనాడు గోర్కీ రాసిన "అమ్మ" చదువుతూండగా, గోల చేయడం మొదలు పెట్టింది మా అమ్మ. గోర్కీ "అమ్మ" కూడా తన కొడుకు పావేల్‌ను గూర్చి సరిగ్గా ఒలాగే భయపడింది మొదట్లో. ఫరవాలేదులే అమ్మా ! అని మా అమ్మకు ధైర్యం చెప్పి గోర్కీ "అమ్మ"ను పూర్తిగా తెలుసుకున్నా. నా జోలి సంచీ. దున్నల నాగలీ – కూలి చెమటా – కుట్టు పనీ – బుర్రలో ఒకసారి గిర్రున తిరిగాయి. "పావెల్"ను జ్ఞాపకముంచుకున్నా. పార్టీ కరపత్రాలను ఎక్కు వగా చదువనారంభించా. క్రమేణా పార్టీ అంటే అభిమానం ఎక్కువైంది. 1942 సంవత్సరంలో పార్టీ మీద నిషేధం తొలగింది. చీకట్లను చీల్చుకొని వెలుగులోకి వచ్చింది పార్టీ. కొన్నాళ్ళకు తాళ్ళూరులో జరిగిన గుంటూరు తాలూకా యువజన మహాసభకు హాజరై పాటల పోటీలో పాల్గొన్నా. ప్రథమ బహుమతి వచ్చింది. తరువాత 1943లో తెనాలిలో జరిగిన జిల్లా పార్టీ మహాసభకూ, గుంటూరు తాలూకా పార్టీ సభకూ, వెళ్ళా.. ఆ సభల్లో పాటలు పాడా. పార్టీ సభ్యులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రదర్శనలను చూశా. అవి నన్నెంతో ఉత్తేజ పరిచాయి. వివిధ కళా రూపాలను ప్రదర్శించవలసింది పొట్ట కోసం కాదనీ, ప్రజల కోసమనీ, తెలుసుకున్నా. ఇంత వరకూ నేనాడిన నాటకాలకూ, పార్టీ సభ్యులిచ్చే ప్రదర్శనాలకూ, వున్న తేడాను గ్రహించా. నేనాడిన నాటకాలలో లాగా వీటిలో భగవంతుని సాక్షాత్కారాలు లేవు. కైలాస మసలే లేదు. కాని మానవ ప్రపంచముంది. వివిధ కళా రూపాలను అభివృద్ధి పరచి, వాటి ద్వారా ప్రజా సామాన్యంలో చైతన్యాన్ని పెంచాలనే కమ్యూనిస్టు పార్టీ ఆశయాన్ని తెలుసుకున్నా. చిన్న నాట నుంచి కళలంటే నాకున్న ప్రీతి – నిరు పేదలనుభవించే కష్టాల అనుభవం – నా స్థానమెక్కడో చూపించాయి. వెంటనే పార్టీలో చేరా.

వివిధ రకాల ప్రదర్శనలు నేర్చుకొని ప్రదర్శించా. తోటి

కామ్రేడ్స్ బుర్రకథలు చెబుతున్నారు. నేను మాత్రం ఎందుకు చెప్పగూడదనే పట్టుదల కలిగింది. కామ్రేడ్స్ రామకోటి, పురుషోత్తములను కలుపుకొని బుర్రకథలను సాధన చేశా. క్రమేణా "బెంగాలు కరువు" బుర్రకథ రాశా. ఈ బుర్రకథల ద్వారా ఇంత వరకూ, మా దళమొక్కటే ఆరు లక్షల మంది ప్రజలలోకి స్వాతంత్ర్య సందేశాన్ని తీసుకువెళ్లగలిగింది. ఈ విధంగా ప్రజాసేవ చేసే భాగ్యం నాకు కలిగించింది పార్టీ.

నాట్య కళాప్రపూర్ణ శ్రీ బళ్లారి రాఘవాచార్యులు గారు బాపట్లలో కథ విని, అమితానందంతో ఆశీర్వదించారు. బళ్లారికి ఆహ్వానించారు. మద్రాసు ప్రదర్శనలలో డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు గారు కౌగలించుకొని "హరి ప్రసాద రావును జ్ఞాపకం చేశా"వన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ విధంగానే పొగిడారు. పూట కూటికి గతి లేని పేద ముస్లిం కుటుంబంలో పుట్టి అష్టకష్టాలు పడిన నాకు చిన్ననాటి నుంచి ఎన్ని నాటకాలాడినా, ఊరూ పేరూ లేని నాకు – ఇన్ని గౌరవ మర్యాదలు ఎలా కలుగుతున్నాయి ? ఎలా ప్రజా సేవ చేయగలుగుతున్నాను ? నాకు రాజకీయాలు నేర్పి, చైతన్యం కలిగించి, అన్ని విధాలా అభివృద్ధి చేసి – కష్ట జీవుల పార్టీ కమ్యూనిస్టు పార్టీ నా జీవితాన్ని తీర్చిదిద్దింది కనుకనే. కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్. ❑

# మార్క్స్ జన్మస్థలం ట్రైయర్ కళా సంపదకు నిలయం

(35వ పేజీ తరువాయి)

**రియాలిటీ', 'కూల్', 'మార్క్స్ స్టాండ్స్ ఫర్ హ్యూమానిటీ', 'మేము కార్ల్ మార్క్స్ వారసులం' - 'ధైర్యవంతుడు, సాహశీలి', 'ఒక సామాన్య మానవుడు మన కళ్లు తెరిపించాడు.' - 'స్వాతంత్ర్య సమరయోధుడు' 'మానవత్వ విమోచకుడు", - 'ఒక మార్గ దర్శకుడు', - మనం మన కోసమే ఆలోచిస్తున్నామా 'ఆలోచించండి. గుర్తించండి. పనిచేయండి. పురోగతి సాధించండి'. 'విప్లవం కోసం చిరకాలం జీవించండి".**

'ఇప్పటి వరకు తత్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ మార్గాల్లో మాత్రమే అర్థం చేసుకున్నారు. అయితే దానిని మార్చటమే ప్రధాన విషయం' అంటారు కార్ల్ మార్క్స్. కార్ల్ మార్క్స్ జన్మించి 206 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా కార్ల్ మార్క్స్ తత్వంలో ఉన్న లోతైన ఆలోచన, సందేశం కోసం ప్రపంచ ప్రజలంతా అన్వేషణ చేసి తన నినాదం 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' కోసం కృషిచేయాలి. ప్రపంచ శ్రామికులు, కర్షకులు, అభ్యుదయ మేధావి వర్గం, మధ్యతరగతి ప్రజల దోపిడీకి గురవుతున్న ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి నడుం బిగించాలి. ఈ నాటి పెట్టుబడీదారీ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ప్రజల కంటికి కునుకు పట్టనీయడం లేదు. యువత విపరీతమైన నిరుద్యోగంతో సతమతమవుతూ నిరాశావాదులుగా తయారవుతూ నిరుత్సాహవంతులవుతున్నారు. కొద్దిపాటి ఆదాయాలతో ఉద్యోగాలున్న కుటుంబాలు విద్య, వైద్యం, ఉండేందుకు ఇళ్లు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఆర్థిక అసమానతల మధ్య ప్రజలు, ప్రదేశాలు, దేశాలు తీవ్ర అశాంతికి, ఒత్తిడులకు లోనవుతున్నా(రు)యి. లాభార్జన పేరిట సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాల వనరుల కోసం ఒక వైపు ప్రపంచ బ్యాంకు – ఐ.ఎమ్.ఎఫ్‌లను అడ్డం పెట్టుకొంటూ వేరొకవైపు యుద్ధాలకు పాల్పడుతున్నాయి. జాతీయత అంటూనే అనేక జాతుల చరిత్రను కాలగర్భంలోకి నెట్టివేస్తున్నారు. పాలస్తీనా సమస్య, మణిపూర్ సమస్యలు వంటివి మచ్చు తునకలు మాత్రమే. లాభాల పేరిట పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వస్తు వినిమయాన్ని పెంచుతూ పర్యావరణ వినాశనానికి కారణమవుతూ భవిష్యత్తు తరాలకు కాంక్రీట్ జంగిల్స్‌ను, ఎడారులను మాత్రమే ఉండేలా అడుగులు వేస్తుంది. ప్రజల అభివృద్ధి పేరిట జీడీపీ ఎదుగుదల గణాంకాలను మాయ చేస్తూ, పెరిగిన అభివృద్ధి కొద్ది మందికే దక్కేలా చేస్తూ సగటు ఆదాయాలు పెరిగేలా పోజులు ఇస్తున్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థతో లాభార్జన, పోటీ మార్కెట్లు, స్టాక్ మార్కెట్లతో ప్రజా సంపదను కొల్లగొట్టి ఆర్థిక సంక్షోభాలకు తరచూ దారి తీస్తున్నాయి. ప్రజా కొనుగోలు శక్తి పడిపోతున్నది. శాశ్వత పరిష్కార మార్గం చూడమని మార్క్సిజం చెబుతోంది. ఆర్థిక సమస్యల పరిష్కారానికి కార్ల్ మార్క్స్ 'మిగుల విలువ' అధ్యయనం చేయుట ద్వారా మిగులు విలువ దోపిడీ నుండి రక్షింపబడటానికి ఉత్పత్తి సాధనాలను ప్రజల కోసం సహకార సంఘాల కోసం మళ్లించడం ద్వారా మాత్రమే దోపిడీ పీడన నుండి, దోపిడీ వర్గాల నుండి రక్షించుకోగల్గుతారు. ఆ విధంగా 'మార్చటం' కోసమే కార్ల్ మార్క్స్ తన జీవిత కాలం కృషి సల్పారు. దానికే మరొక పేరుగా సోషలిస్టు సమాజ స్థాపనగా అర్థం చేసుకుందాం. కార్ల్ మార్క్స్ 206వ జయంతి ద్వారా తన ఆశయసాధన కోసం పయనిద్దాం. అదే మనం కార్ల్ మార్క్స్‌కు ఇచ్చే నిజమైన నివాళి. అజేయమైనది మార్క్సిజం-లెనినిజం. ❑

# బుర్ర కథా లోకంలో లేజర్-నాజర్



- ఖాదర్ మొహిద్దీన్

**జవసత్వాలుడిగిపోయిన ఒక జానపద కళా రూపానికి జీవం పోసిన కళాకారుడు నాజర్. పీడితులు, తాడితులు, అట్టడుగు వర్గాల వారి కన్నీళ్ళకు పలు రూపాల్లో ప్రాణ ప్రతిష్ఠ చేసిన ప్రజాకవి నాజర్ ! తన ఆట ద్వారా, పాట ద్వారా, మాట ద్వారా ప్రజల్ని ఉర్రూతలూగించి చైతన్యవంతం చేసిన ప్రజా నటుడు, గాయకుడు, వక్త. శక్తివంతమైన ఆయుధంలాంటి బుర్ర కథకు మూడక్షరాల ముద్దు పేరు, మారు పేరు నాజర్.**



ఒకప్పుడు నాజర్ కథ వినిపించినంతనే ఉద్రేకం ఉర్రూతలూగేది. వాతావరణం దావాగ్ని పొగలు గక్కేది. రక్తం ఉడుకెత్తి ఉరకలు వేసేది. గంధకపు రాసులపై నిప్పు కణికల్తో రాసిన అగ్ని గీతాల్ని ఆలపించేవాడు నాజర్. నాజర్ బుర్ర కథలు, నాజర్ అభినయం, నాజర్ ప్రతి కదలికా, అన్నిటికీ మించి ఆయన నమ్మిన సిద్ధాంతం యుగధర్మంలో కత్తు కలిపి ప్రజల్ని కదలించింది. పెనునిద్దర వదిలించింది, మునుముందుకు నడిపించింది. ప్రజలు నాజర్‌కు బ్రహ్మరథం పట్టారు. తమ సాంస్కృతిక యోధుడుగా గుర్తించారు. కాలం వచ్చింది. 1949లో నాజర్ కమ్యూనిస్టు పార్టీ నుంచి తప్పుకున్నాడు. 1986 వచ్చింది. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం నాజర్‌కు 'పద్మశ్రీ' ప్రకటించింది.

దాదాపు నలభయ్యేళ్ళుగా ఒక జానపద కళాకారుడిగా, బుర్రకథ ఆర్టిస్టుగా, కథా పితామహుడుగా ప్రఖ్యాతిగడించిన నాజర్‌ను ఇంటర్వ్యూ చేద్దామని వెళ్ళాం. గుంటూరులోని అమరావతి రోడ్డు పక్కనే ఆ ఇల్లు. 'బుర్రకథ పాఠశాల' పెద్ద అక్షరాలతో దర్శనమిచ్చాయి. మేం వెళ్ళే సమయానికి నాజర్ సీరియస్‌గా ఏదో చదువుకుంటున్నారు. గదిలో ఒక చిన్న టేబుల్, రెండు కుర్చీలు, ఒక మంచం. పక్కనే షెల్ఫులో పుస్తకాలు. టేబుల్ మీద మావో సేటుంగ్ వర్ణ చిత్రం, ప్రజా నాట్య మండలి బహూకరించిన లెనిన్ ఫలకం ఉన్నాయి. గోడల మీద వివిధ సన్మాన సత్కారాల సందర్భంగా తీసిన ఫోటోలు, రాష్ట్ర ప్రభుత్వం వారిచ్చిన ప్రశంసాపత్రాలు, కార్ల్ మార్క్స్, లెనిన్, ఏసుక్రీస్తు ఫోటోలు ఉన్నాయి.

నాజర్‌ను చూస్తే అమాయకుడైన ఒక పేద రైతు గుర్తుకు వస్తాడు. నాజర్ నవ్వితే బోళాతనం కనిపిస్తుంది మనకు అఖిలాంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన నాజర్ తంబూరా గది మధ్యలో పైకప్పు మీంచి వేలాడుతోంది. ఆయన నవ్వినప్పుడు మెరుస్తున్న బంగారపు పళ్ళు కూడా కనిపిస్తాయి మనకు. ధృఢమైన శరీరం ఆయనది. ఆజానుబాహుడు. చేతికి స్వర్ణ కంకణం, వెండి ఉంగరాలు, వెళ్ళి కూర్చున్నాం. ఏ మడగాలో తెలీడం లేదు. ఎక్కణ్ణించి ప్రారంభించాలో తోచడం లేదు. ఏదోఒకటి అడగాలి. ఎలాగోలా మొదలుపెట్టాలి.

**? 'పద్మశ్రీ' సందర్భం గురించి వ్యాఖ్యానించమని అడిగి, ఇది మీ వ్యక్తిగత విజయంగా భావిస్తున్నారా?**

**నాజర్ :** హీనస్థితిలో వున్న బుర్రకథ కళారూపానికి నేను చేసినటువంటి కృషిని గుర్తించారనీ, నేను ఏ రాజకీయ విశ్వాసాలతో ఈ నలభై సంవత్సరాలుగా ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేస్తున్నానో తెలిసినప్పటికీ, అన్ని పార్టీలు నా కృషిని గుర్తించి నాకీ 'పద్మ శ్రీ' బిరుదు ప్రకటించారని అనుకుంటు న్నాను. ఎలాగయితేనేం, ఇంటర్వ్యూ గాడిలో పడింది.

**? ప్రజా కళాకారుడుగా మీ అనుభవాలు చెప్పండని అడిగాం. దీంతో పాటు జీవిత విశేషాలు కూడా జోడించి చెప్పమని కోరాం.**

**నాజర్ :** లేదు. బుర్రకథ అనే జానపద కళా రూపంతో, ఒక ప్రజా కళాకారునిగా నలభై సంవత్సరాల నుంచి నేను కృషి చేస్తున్నాను. ప్రజల కష్టసుఖాల్ని గురించి నేను కథ

చెప్పుతున్నాను. తమ కష్టసుఖాల్ని చెపుతున్నాను. ప్రజలు నన్ను అమితంగా అభిమానిస్తున్నారు. ఈ ప్రజాభిమానమే, ప్రజాభిప్రాయమే భారత ప్రభుత్వం చేత నాకు పద్మశ్రీ గౌరవం లభింపజేసిందని నేను అనుకుంటున్నాను. ఉన్నట్టుండి మాకో సందేహం వచ్చింది.

**? ఇంతకు ముందు జానపద, ప్రజా కళాకారులకు ఎవరికైనా పద్మశ్రీ లభించిందా అని.. ఇదే విషయం నాజర్‌ను అడిగాం.**

**నాజర్ :** నాకు తెలిసినంత వరకు ఇదే మొట్ట మొదటిసారి అనుకుంటున్నాను. ఇంకో విషయం ఏమిటంటే 'పద్మశ్రీ' అందుకునే పాటి జానపద కళాకారులు ఇంతకు ముందే వుండి వుంటే మనం ఇంత కష్టపడవలసిన పనే వుండేది కాదు. ఒక బుర్రకథ కళా రూపం కోసం నేను ఇన్నేళ్ళుగా కృషి చేయాల్సిన అవసరం వుండేది కాదు. ఇక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో వున్న పొన్నెకల్లు గ్రామంలో పుట్టాను. 1920 ఫిబ్రవరి 5 నా పుట్టినరోజు. చాలా పేద కుటుంబం మాది. ఒక పూట తింటే రెండోపూట పస్తుపడుకోవాల్సిన పరిస్థితి మాది. నాకూ, మా చెల్లికీ అన్నం పెట్టి మా అమ్మా నాన్నా పస్తుపడుకునే వాళ్ళు చాలా సార్లు. ఇదీ చిన్నప్పటి మా కుటుంబ పరిస్థితి. ఆ రోజుల్లోనే నేను కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చాను. నేను మార్క్సిజం చదువుకొని పార్టీలోకి రాలేదు. కమ్యూనిస్టు నాయకుల ఉపన్యాసాలు విన్నాను. ఇదేదో ఇదేదో పేదల కోసం పాటు పడే పార్టీ అనుకున్నాను. నేను నేర్చుకున్న సంగీతం, నటనలను కూడా ప్రజల్ని చైతన్యవంతం చేయటం కోసం పేదవాళ్ళ బాగు కోసం ఉపయోగపడితే బాగుంటుందని భావించి పార్టీలో ప్రవేశించాను. పదహారు రూపాయల చొప్పున నాకూ, నా భార్యకూ జీవన భృతి పార్టీ ఏర్పాటు చేసింది. మా అమ్మ ఐ.ఎల్.టి.డి.లో కూలిపని చేసుకుంటూ బతికింది. నాకున్న సంగీత పరిజ్ఞానం, నాటకానుభవాన్ని పార్టీ గుర్తించింది. నాలుగో తరగతి పాసై అయిదో తరగతి చదువుతూ మానేసిన వాణ్ణి నేను. తెనాలిలో బాలరత్న సభ అనే నాటక సమాజంలో చేరాను. నారదుడు వంటి పౌరాణిక పాత్రల ద్వారా ప్రఖ్యాతిగడించిన రామకృష్ణశాస్త్రి గారికి శిష్యరికం చేశాను. 1932లో నరసరావుపేటలో కొంత సంగీతం నేర్చుకున్నాను. నా ఈ అనుభవాల దృష్ట్యా 1943 మార్చిలో పార్టీ నన్ను సాంస్కృతికరంగంలో పనిచేయమని కోరింది. డాక్టర్ రాజారావు నాకు ఎన్నోవిషయాలు నేర్పాడు. ప్రజా కళాకారుడుగా నన్ను దిద్దితీర్చిన మొదటి గురువు డాక్టర్ రాజారావు. జానపద కళల్ని గురించి ఆయనకు ఎన్నో విషయాలు తెలుసు. హావభావాలు ప్రకటించడం దగ్గర నుంచి స్టేజి మీద గెంతటం వంటివన్నీ నాకు ఆయనే నేర్పారు. ప్రజాకవి సుంకర సత్యనారాయణ రాసిన కష్టజీవి బుర్రకథ ను నేను ఎన్నోచోట్ల ప్రదర్శించాను. అప్పుడే స్వంతంగా బుర్రకథ రాయాలన్న ఆలోచన నాకు కలిగింది. 1944లో బెంగాల్లో పెద్ద కరువు వచ్చిపడింది. బెంగాల్ ప్రజల కడగండ్లు నన్ను కదలించాయి. దాంతో నేను స్వయంగా బుర్రకథ రాసి మన అభ్యుదయ రచయితల సంఘం మహాసభలో ప్రదర్శన ఇచ్చాను. ఎంతో మంది పెద్దపెద్ద కవులు, రచయితలు కథ బావుందనీ, ప్రజల భాషలో, ప్రజల సమస్యని తీసుకొని ఎంతో చక్కగా బుర్రకథగా మలిచి చెప్పానని ప్రశంసించారు. అప్పటి నుంచీ నేను ఏ కథ తీసుకున్నా ప్రజా సమస్యల్ని చొప్పించ టానికి ప్రయత్నం చేస్తూ వచ్చాను. పల్నాటి యుద్ధం బుర్రకథ రాశాను. అందులో బ్రహ్మనాయుని చాపకూటి సిద్ధాంతం ఆధారం చేసుకుని ఈ మాల, మాదిగ, చాకలి, మంగలి, ఎరుకల, యానాది, దొమ్మరి, బుడబుక్కల, కోయ, చెంచు, లంబాడీ వగైరా పేద ప్రజానీకం బతుకులు ఎంత నికృష్టస్థితిలో వున్నాయి, వాళ్ళంతా కలసికట్టుగా ఉద్యమిస్తేనే తప్ప బతుకులు బాగుపడవని చెప్పాను. సమకాలీన రాజకీయాలను చొప్పిస్తూ కథలు చెప్పాను. ఏ కథ తీసుకున్నా రాజకీయాలు, ప్రజా సమస్యలతో ముడిపెట్టి చెప్పటానికే ప్రయత్నిస్తూ వచ్చాను. ఈ విధంగా ప్రజల మనిషిగా, ప్రజా కళాకారునిగా పనిచేసే అవకాశం నాకు లభించింది. నా భావాలు, అభిప్రాయాలే నన్ను ప్రజలకు మరింత సన్నిహితం చేశాయని నేను నమ్ముతున్నాను. ప్రజలకూ, నాకూ మధ్య ఇంతటి అవినాభావ సంబంధానికి నా విశ్వాసాలే పూర్తికారణం. నా సంగీతం అందుకు దోహదపడి వుండవచ్చు. అంతమాత్రాన కేవలం నా పాటనే అభినందించారనీ, నా ఆటనే ఆదరించారనీ, నా హావభావాలనే మెచ్చుకున్నారనీ నేను అనుకోవడం లేదు.

అగ్గిరాముడు సినిమాలో పని చేసి వచ్చిన తరువాత నా సంగీతం మన సంగీతం కాదేమోనన్న అనుమానం వచ్చింది. దేశంలో వున్న యాదవ దాసులు, మాలదాసులు, మాదిగ దాసులు, జంగా సుబ్బాదాసు వంటి ప్రముఖులైన వీధి భాగవతులందరి దగ్గరికి వెళ్ళాను. వాళ్ళ సంగీతం విన్నాను. నా సంగీతాన్ని వాళ్ళకు వినిపించాను. అంతేకాదు, ఇతర రాష్ట్రాల నుంచి కరీంఖాన్ కార్డులు బిస్మిల్లాఖాన్ షహనాయి రికార్డులు అలాగే దక్షిణదేశం నుంచి రాచప్ప, కిష్టప్ప, సన్నాయి విద్వాంసుడు రాజరత్నం రికార్డులు అన్నీ తెప్పించుకున్నాను. వీటిలో ఏ సంగీతం నా బుర్రకథకు నప్పుతుందని పరిశీలించాను. ఇది నా జాతీయ సంగీతమని చెప్పుకోవడానికి, ఆయా సంగీతాలను ఏ మేరకు తీసుకోవాలో తీసుకుంటూ నా ఈ బుర్రకథా కళా రూపాల్ని అభివృద్ధి చేసుకుంటూ వచ్చాను. అందువల్లనే సామాన్య ప్రజానీకం నా బుర్రకథ వినటానికి

ఎంతో కుతూహలపడుతోంది. ఇది సామాన్యప్రజల బాణీలో కలిసి పోయింది కాబట్టి, కొంత కొత్తదనం వున్నప్పటికీ వాళ్ళ శరీరంలో వున్నటువంటి ధ్వనికి అనుగుణంగా జాతీయ సంగీతాన్ని సరైన విధంగా సమన్వయం చేయగలిగానేమోనని నేను భావిస్తున్నాను. అలాగే నాట్యం కూడా. మన గొల్ల భాగోతుల కుప్పీలు, గంతులు – అలాగే యుద్ధఘట్టంలో ఎట్లా వుండాలి, రౌద్రరసాన్ని ఎలా పోషించాలి, బీభత్స రసాన్ని ఎలా రక్తి కట్టించాలి. నాయకురాలు నాగమ్మను ఏ రకంగా ప్రవేశపెట్టాలి. మగువ మాంచాలను ఏ విధంగా తీసుకురావాలి. బాల చంద్రుడు ఎట్లా నడవాలి, బ్రహ్మనాయుడు ఏ రకంగా నడవాలి వంటి ప్రతి చిన్న విషయాన్ని గరించి కూడా నేను జాగ్రత్త తీసుకున్నాను. ఆయాపాత్రల నడకదగ్గర్నుంచీ కులుకు దగ్గర్నుంచీ వాళ్ళ హావభావాలు, మాట్లాడేతీరు అన్నిటి మీద దృష్టిని కేంద్రీకరించి ఈ కళారూపాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దటానికి కృషి చేశాను. గట్టిగా వూపిరి పీల్చుకున్నారు నాజర్. తర్వాత ప్రశ్న ఏమిటన్నట్టు మావైపు చూశారు.

## ? బుర్రకథ యక్షగానం నుంచి వచ్చిందని మీరంటున్నారు గదా, దీన్ని మీరు ఎలా రుజువు చేయబోతున్నారు? ఇదీ మా ప్రశ్న.

**నాజర్ :** 1949 నుంచి నాజర్ దళం పేరుతో నేను కథ చెప్పటం ప్రారంభించిన తర్వాత ఈ బుర్రకథ యక్షగానానికి సంబంధించిందని నేను దృఢంగా నమ్మాను. యక్షగానానికి సంబంధించిన ఈ ప్రక్రియను బుర్రకథ అని పిలవవలసిన అవసరం ఏమొచ్చింది అన్న అనుమానం వచ్చి నేను కొంత చరిత్రను తిరగేయవలసి వచ్చింది. అయితే, యక్షగానం, యక్షగాన గాయకుల్ని పదపదార్థ విజ్ఞాన ప్రబోధకులు అనే అర్థంలో పిలుస్తున్నారు. పదమంటే జనులు నివసించే భూమియని, పదార్థమనగా వంటింటికి సంబంధించిన సరుకనీ నేను అర్థం చేసుకున్నాను. నిఘంటువులు కూడా అలాగే చెబుతున్నాయి.

నేను ఈ బుర్రకథ యక్షగానం కోవకు చెందినటువంటిదే అని చెప్పడానికి మరో కారణం వుంది. అప్పకవి చెప్పినటువంటి నిర్వచనం రగడల నుండి, అర్ధ చంద్రికల నుండి ఇవన్నీ బుర్రకథలోనే కనిపిస్తున్నాయి. తుదనేడు లఘువులు తొలగించి చదివిన ద్విపదకు వృషభగీతి పదయుగము అన్నారు. అర్ధ చంద్రికలు అన్నారు. అన్నీ మనకు ఈ బుర్రకథలోనే కనిపిస్తాయి. మన కావమ్మ కథ, పెద్ద బొబ్బిలిరాజుల కథ, సర్వాయి పాపడు కథ ఒక్కొక్క రగడను ఒక్కొక్క కథగా తయారు చేశారని నా అభిప్రాయం. కాని వీటన్నింటినీ జోడించి చూపినపుడు అది యక్షగానంగానే నాకు కనిపించింది.

**'వినరా భారత వీర కుమారా విజయము మనదేరా'**

ఇదే రగడ. దీనిలో సగభాగం గుర్తించి చూడండి. అప్పుడది అర్ధ చంద్రిక అవుతుంది. పదహారో శతాబ్దానికి చెందిన కందుకూరి రుద్రకవి సుగ్రీవుని గురించి రాసిన యక్షగానంలో మనకు ఆధారాలు లభిస్తాయి.

## ? మీ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి?

**నాజర్ :** యక్షగానానికి సంబంధించిన పుస్తకం ఒకటి రాస్తున్నాను. 'జాతి యక్ష గానం' పేరుతో ప్రజలకు కళలతో వున్న అవినాభావ సంబంధం గురించి విపులంగా రాస్తున్నాను. ఈ 'పద్మశ్రీ' బిరుదు నా బాధ్యతను మరింత పెంచింది. తప్పనిసరి గా నేను ఈ పుస్తకం పూర్తి చేసి ప్రజలకందిస్తాను. జానపద కళా రూపాలకు సంబంధించిన అనేక బాణీల పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశోధించేందుకు అనేక ప్రదేశాలు తిరగాల్సి వుంది.

## ? దాదాపు పుస్తకంలోని ఎన్నో అధ్యాయాలను గురించి వివరించి చెప్పారు నాజర్. ప్రస్తుతం మీ రాజకీయ అభిప్రాయాలేమిటో చెప్పమని అడిగాం.

**నాజర్ :** 1944 – 48 మధ్యకాలంలో నాకు ఏ రాజకీయ అభిప్రాయాలున్నాయో ఇప్పటికీ అవే వున్నాయి. అయితే ప్రస్తుతం 'నేను ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేకుండా వుంటున్నాను. మార్క్సిజాన్ని అభిమానించే వారిలో నేనొకణ్ణి. 1949 నుంచే ప్రజా నాట్యమండలితో నా సంబంధాలు తెగిపోయాయి.

## ? ఆ తర్వాత కూడా మీరు కమ్యూనిస్టు పార్టీల వేదికలపై నుండి ప్రచారం చేశారు కదా?

**నాజర్ :** నిజమే గాని పార్టీ క్రియాశీల సభ్యుడిగా చేయలేదు. బయటివాళ్ళు నాలుగు వందలు ఇస్తే కమ్యూనిస్టుల దగ్గర వందా, నూట యాభై మాత్రమే తీసుకొని ప్రచారం చేశాను తప్ప, పార్టీ మనిషిగా చేయలేదు. కాంగ్రెస్ వాళ్లు పిలిచినా వెళ్ళాను. నాకో పాలసీ వుంది. అట్టడుగున వున్న మాల, మాదిగ, దక్కల, చిందుల, దొమ్మరి, ఎరుకుల, యానాది, బుడబుక్కల, వెందు, కోయజాతుల జనాలు విజ్ఞానవంతులు కావాలి. వాళ్ళలో చైతన్యం కలగాలి. వీళ్ళలోంచి నాయకత్వం రావాలి. వాళ్ళు స్వయంగా నాయకత్వంవహించి ఉద్యమాలు నడపాలి. అప్పుడే ఈ దేశానికి విముక్తి. ఇదీ నా పాలసీ, ఏ వేదిక మీద నుంచైనా నేను ఈ విషయమే. చెబుతున్నాను.

**? మీరు రాసిన బుర్రకథలు ఎన్ని వున్నాయి? వాటి వివరాలు చెప్పండి?**

**నాజర్ :** బెంగాల్ కరువు స్క్రిప్టు పోయింది. పోలీసులు ఎత్తుకుపోయారు. దాన్ని తిరిగి రాయటం సాధ్యపడలేదు. తర్వాత రాసిన రాయలసీమ కరువు, బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, అభిమన్యుని యుద్ధం అచ్చయ్యాయి.

**? మీరు ఎప్పుడయినా నిర్బంధానికి గురయ్యారా?**

**నాజర్ :** 1944-48 మధ్య కాలంలో ఏడుసార్లు జైలుకు వెళ్లా. అయితే 15 రోజుల రిమాండు, రెండు నెలల రిమాండ్లు తప్ప ఎక్కువ కాలం జైలు జీవితం అనుభవించలేదు. 1948లో మూడు నెలల రహస్య జీవితం గడిపాను.

**? ఖమ్మంలో జరిగిన విప్లవ రచయితల సంఘం ప్రథమ మహాసభకు వెళ్ళారు గదా, ఆ తర్వాత మీరు ఎందుకు కొనసాగలేదు?**

**నాజర్ :** నా పాలసీని మార్చుకోమన్నారు. నేను మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పా. నా కథ విన్నారు. నేను వద్దన్నా నన్ను కమిటీ సభ్యుడిగా తీసుకున్నారు. ఆ తర్వాత నా పాలసీని మార్చుకోమన్నారు.

**? గద్దర్, వంగపండు ప్రసాద్‌లు జానపద కళా రూపాలను ఎంతో ముందుకు తీసుకువెళుతున్నారు గదా, దీన్ని గురించి మీ అభిప్రాయం?**

నాజర్: ఇప్పటి ప్రజాకళాకారులు ఆయా కళారూపాల్ని ఆకళించుకోవడం లేదు. అదొక కళారూపమనీ, దాని కాళ్ళ మీద అది నిలబడగలిగేట్టు చేయాలనీ వీళ్ళు ఆలోచించడం లేదు. కమ్యూనిస్టుపార్టీలు కూడా కళారూపాలను తమ ప్రచారం కోసం వినియోగించుకుంటున్నాయే తప్ప వాటిని బతికించాలని అనుకోవడం లేదు. ఒకప్పుడు ఈ జానపద కళారూపాలు వాటి కాళ్ళ మీద అవి నిలబడ్డాయి. కాళ్ళలో సత్తువ తగ్గిపోయి అవి పడిపోయాయి. మళ్ళీ మనం వాటిని నిలబెట్టాలన్న ఆలోచన మనవాళ్ళకు కలగటం లేదు. సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథకు జీవం పోశాడు. దాని కాళ్ళ మీద అది నిలబడేట్టు చేశాడు. అలా కళారూపాన్ని బతికించుకోవాలని సీరియస్‌గా పట్టించుకోవడం లేదని నా అభిప్రాయం.

**? గద్దర్, వంగపండు ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నారు గదా?**


నాజర్ : మాసెస్‌లోకి చొచ్చుకుపోవచ్చు. అది వేరే విషయం. వాళ్ళు నా కంటే కూడా వేగంగా ప్రజల్లోకి వెళ్ళగలుగుతున్నారు. ఆయా కళారూపాలను వాటి కాళ్ళ మీద అవి నిలబడేట్టు చేయడంలేదన్నదే నా అభిప్రాయం.

**? రాజకీయ ఉద్యమాల ప్రమేయం లేకుండా జానపద కళా రూపాలను బతికించడం సాధ్యమేనంటారా?**

**నాజర్ :** ఎందుకు సాధ్యం కాదు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు నన్ను తమ వేదికల మీదికి ఆహ్వానించకూడదని నిర్ణయించుకున్నాయి. అయితే ఏమయింది ? ఒక్క విషయం గమనించాలి. కళా రూపాలకు ప్రజా జీవితం, ప్రజల సమస్యలకు ప్రతిస్పందించటం ముఖ్యం. ప్రజల కష్టసుఖాల్ని ప్రతిబింబిస్తూ ఆయా కళారూపాలు వాటి కాళ్ళ మీద అవి నిలబడేట్టు చేయవచ్చని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

**? బుర్రకథ చెప్పటం పూర్తిగా మానేశారా?**

**నాజర్ :** చెప్పలేకపోతున్నానండీ, ఎందుకనంటే అదో పెద్ద కుస్తీ. కసరత్తు వంటిది. ఓ చేత్తో ధమరు కొట్టాల, ఓ చేత్తో అందెలు కొట్టాల, మరి రెండు కాళ్ళతోటి ఆడాల, ఎగరాల, గంతులేయాల. మరి, బాలచంద్రుడు కత్తి దూసి దూకాడంటే కథకుడు దూకాల మరి నేను దూకలేకపోతున్నాను. ఓ సారి ఏం జరిగిందో తెలుసా ? అకాడమీలో అనుకుంటాను. కథ చెబుతున్నాను. బాలచంద్రుడు నరసింగరాజు మీదికి కత్తి దూసి దూకాల గదా, దూకాను. అంతే కుదబడిపోయి లేవలేకపోయాను. పక్కాడి భుజం మీద చెయ్యేసి ఆ వూపు మీద లేచాను. సమయానికి పక్కవాడు లేకుంటే అలాగే కూర్చుండి పోయివుందును. అప్పట్నించి భయపడుతున్నాను. బిగువు వుండాలి. ఉండాల్సిన స్టెబిలిటీ లేకపోతే కథ రక్తి కట్టదు. ఓసారి భీమవరంలో కథ చెపుతున్నాను. ఒకాయన అప్పుడే పైకి లేవబోయాడు. కథ మంచి రసపట్టులో వుంది. తాండ్ర పాపారాయుణ్ణి ప్రవేశపెడుతున్నాను. ధిల్ అన్నాను. ఆ లేవబోతున్న మనిషి అంతెత్తున ఎగిరి జనం మీద పడ్డాడు. మరి అట్టాంటి గదుముళ్ళు, వ్యవహారాలు వుండాలి. అదీ తగ్గిపోతోంది. ఒక్కోసారి దానిష్టం వచ్చినట్టు అది పోతుందే తప్ప గాత్రం మన ఆధీనంలో వుండటం లేదు. అయితే నేను ఈ విద్యలో పర్ఫెక్షన్ సాధించానని ఎంత మాత్రం అనుకోవటం లేదు. ఇంకా ఇందులో బోలెడు లోపాలున్నాయి. సరిదిద్దుకోవలసింది ఎంతోవుంది. ఇంత వరకే నా జీవితం సరిపోయింది. ❑




వాట్సప్ వర్శిటీలో..




వారే లేకుంటే..!





తుస్..!

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 2 - Issue No : 11 August 2024




వెల : **250**

ప్రతులకు..


మలుపు బుక్స్




ప్రతులకు..

విశాలాంధ్ర బుక్ హౌస్


## కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..

సయ్యద్ నశీర్ అహమ్మద్

**94402 41727**




ప్రతులకు..

నవ తెలంగాణ బుక్ హౌస్

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.